విజయనామ సం॥ భాద్రపదము

భారతి

సంపుటము-30
సంచిక-9.



విజయ
భాద్రపదము

భారతి

సంపుటము 30
సంచిక 9

గీతాంజలి

★

శ్రీమతి నాయని కృష్ణకుమారి

నిన్నుదలచిన మాత్రాన మిన్ను మన్ను
పట్టనట్టుల పొంగెడి భక్తిభావ
మెడద లోలోతు పొరలను వెడలి వచ్చి
నీ పదాబ్జాత మధువుగా రూపునొందు.

నిన్ను దలచిన మాత్రాన, నీట నిండి
భారమున వాలి వర్షింపగోరు వార్షి
కాభ్రమును బోలు నాహృది యణగి మణగి
నీ సమీపాన నమ్రమై నిలువ దలచు.

నా గళమ్మున చిక్కుగా నాగి పెనగు
వివిధ రాగాలు ఒక్కటై విక్రమించి,
నిన్నుదలచినమాత్రాన నిస్తరంగ
స్తబ్ధసాగర ముఖముగా సాగి కఱగు.

ఇంటిపైనున్న మమకార మెడదపొంగి
తమకమున కొండగూళ్లకు దారితీయు
నీటికొంగల బారుల నింగి యాత్ర
వలెనె, నాలోని జీవ సర్వస్వ మెడలి
నిన్నుదలచినమాత్రాన, నిజము, స్వామి!
నీ పదమ్ముల ఛాయకై నిలచి వెదకు.

యక్షరాత్రి ★

శ్రీ గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి

1

ప్రాత పద్ధతిలో విసుగుపుట్టి, క్రొత్తదనముతో క్రొత్త కృతులను నిర్మింపవలెనని, నవకవులు, కర్తవ్యమున తికమకపడుచున్న రోజులలో, క్రొత్త పాత్రలకు చక్కని సామరస్యమును సమకూర్చి, కృతి నిర్మాణము గావించినవారు శ్రీ శివశంకరశాస్త్రిగారు. వీరి ఆదికావ్యము 1917 వ సంవత్సరమున రూపొందినది.

శ్రీ శివశంకరులకు, ప్రాచీన సాహిత్యమనినను, దర్శనము లనినను, గాఢాభినివేశము, ఆదరమును. ఎక్కువ కృషిచేసి, వాని నవగతము చేసికొని, నిశిత ప్రజ్ఞను సంపాదించి, శ్రీ శాస్త్రిగారు పేరుగాంచినారు. గీర్వాణ భాషయందును, శ్రీ శాస్త్రిగారు కావ్యములను వ్రాయుచున్నారు.

అయినను, శివశంకరులు, నవకవితా రీతులలో, ఎన్నియో ఖండకావ్యములను, గీతి నాటికలను, రచించియున్నారు. వారి ప్రతికృతియందును విశిష్టమైన నూతనరీతి గోచరించుచున్నది.

శ్రీ శివశంకరుల కృతులు, గేయకావ్యములు, నాటికలుగా, సల్లాపకములుగా, వివిధరీతుల నలరారుచున్నవి.

2

కవిత్వము ముఖ్యముగా గేయమయముగా నుండవలెననియే శివశంకరుల అభిమతము. అందువలన, శివశంకరులు, ప్రాచీనార్వాచీన సామరస్యమునకు, పద్యకవిత్వమునుగూడ తఱచు చెప్పుచు, 1934 నుండి తమ దృష్టిని పూర్తిగా గేయకవిత్వ ధోరణికి మరల్చిరి.

గేయములు అనుటతోడనే, మనము కీర్తనలు మొదలైనవానిని స్మరింపరాదు. సర్వసాధారణములై ప్రసిద్ధములుగానున్న వంశస్థము, వసంతతిలక, శిఖరిణి, పృథివి, సుగంధి, ఉత్సాహ, తోటకము, పాదప, దోధక, రథోద్ధతము, వనమయూరము, మున్నగు చిన్నిచిన్ని వృత్తములను మాత్రమే, వారు తమ కావ్యములను గ్రహించినారు. మంజరులను, శివశంకరులు తమ కావ్యములలో విశిష్టరీతిలో శ్రవణపేయములుగా, ఆయా సందర్భములలో, అద్భుతరూపమున నడపినారు. ఇవిగాక, పలుతావుల వారి కృతులలో ముత్యములుగా జాలువాఱినవి ముత్యాల సరములు. సర్వసాధారణముగా నవ్యులు కూర్చు ముత్యాల సరములకును, శివశంకరుల ముత్యాల సరములకును, ఎంతయు నంతర మున్నది.

ఈ వృత్తములతో, శ్రీ శివశంకరులు, తమ కావ్యములలో గేయత్వమును సరసముగా పోషించుకొనినారు. వాస్తవముగా గేయకావ్య నిర్మాణమున కింతకన్న విశిష్టమైన మార్గము లేదు.

3

ఈరీతిలో నిర్మితములైన కృతులను "కావ్యములు" అనవచ్చునా, యని శంకింపవలసిన పనిలేదు. ఎవరేని శంకించినను, సామాన్యముగా, ఒక సమాధానము చెప్పవచ్చును.

ప్రతిభాశాలియైన కవిముఖమునుండి వెలువడిన ప్రతియొక వాక్యము, కావ్యమే గదా! అట్టి కావ్యమొక మహత్తరమైన అనుభూతితో గూడియున్నపుడు, ఇంక విచారింపవలసిన పనియే యుండదు. కావుననే, అమరుకాదుల ప్రతియొక శ్లోకము, ప్రబంధశతములకు తులదూగ గలిగినది.

తమ కావ్యముల కావ్యత్వముపై ముందు ముందిట్టి కుశంకతో నాక్షేపము చేయు బుద్ధిమంతులు కొందఱుందురు; వారికి సమాధానము నిచ్చుట మంచిది. అను తలంపుతో, శ్రీ శివశంకరులే స్వయముగా, తమ పద్మావతీ చరణ చారణ చక్రవర్తిలో, జయదేవుని గీతగోవింద కృతికావ్యత్వ విచారములో, ప్రాసంగికముగా, ఈ క్రింది వాక్యములతో ఆక్షేపములను సూచించి, సిద్ధాంతమును రచించియున్నారు.

"ఎందు చేర్పవచ్చు నీ నవ్యకావ్యంబు?
....
"నూత్నసృష్టితోడ జాదు సెడల
ప్రతి కవీంద్రు రచన ప్రత్యేకమై యుండు.
....
"ఏగుణంబు మిగుల హెచ్చుగా గాన్పించు
చుండు, దానివలన నొదవు నాఖ్య
యొట్టి కృతికైన; ఈ మహాకావ్యంబు
నందు గేయగుణము కుండిలంబు."

(షష్టి పూర్తిముద్రణము. పద్మావతి. పుట 480.)

పూర్వాచార్యులు వచించిన అష్టాదశ వర్ణనములు లేకున్ననేమి! ఉదాత్తభావ గంభీరములై, సరస రచనముతో, రస పరిపుష్టములుగా నున్న కృతులన్నియు కావ్యములే యని శ్రీ శివశంకరుల నమ్మిక.

ఆధునికకవితలోని అపమార్గములు

★

శ్రీ పొట్లపల్లి సీతారామారావు

ఆంగ్లభాష మనకు పరభాష. ఆ భాష యేలుబడి క్రింద మనము చాలకాల మున్నాము. ఆ భాషను ప్రయత్నించి నేర్చుకొన్నాము. పరభాష నేర్చుకొనేటప్పుడు వాక్య నిర్మాణము—వాడుక—శబ్దప్రయోగము—దగ్గరనుండి అతి జాగ్రత్తతో నేర్చుకొంటాము. ఆ శ్రద్ధ స్వభాషయైన, మన తెలుగుభాషమీద లేకుండాపోయింది. అందుచేత తెలుగు ఉపేక్షింపబడినది. ఆంగ్లములో వాక్య నిర్మాణములో గాని, వాడుకలో కాని, శబ్దప్రయోగములో కాని ఏమాత్రము దోషము చేసినా, విజ్ఞులచేత వెక్కిరించబడతాము. ఆ దోషాలే తెలుగులో చేస్తే, అవి పాటించబడటం లేదు. దీనికి కారణం తెలుగు భాషకు ప్రాధాన్యము లేకపోవడం—సంప్రదాయసిద్ధంగా చదువుకొన్న వాళ్ళు లేకపోవడము. ఇలాంటి పరిస్థితులలోనుంచే, తెలుగుకవులూ పుట్టారు. చక్కగా చదువుకొన్న తరువాత, కవిత్వం వ్రాసిన వాళ్లు కారు. మిడిమిడి జ్ఞానముతోనే, మొదలుపెట్టి కవిత్వం వ్రాస్తూ, వయసు వచ్చినకొద్దీ, కొద్దిగా వ్యాకరణం—అదీ—తెలిసికోవటం చేశారు. అందుచేత, ఈ తెలుగుకవుల రచనలలో, శబ్దముయొక్క విశుద్ధరూపాలు గాని, వాడుకయొక్క వ్యక్తీకరించదగిన అర్థసంగ్రహణం గాని, ఉండటం లేదు. అనువాదాంధ్ర కవులలో, మహాకవు లనిపించుకొన్న వాళ్ళలోనే, ఈ దోషాలు ఎక్కువగా కనిపిస్తున్నవి. ఇక తక్కినవారి విషయ మెందుకు!

ఇది కాక, మన దేశములో, ఈ ఉన్న స్థితిని బాగుపరిచే, మార్గాలకు అవరోధాలు, చాల ఉన్నవి. పాండిత్యమందు నిరాదరణ ఏర్పడ్డది. కవిత్వం వేరు, పాండిత్యం వేరు—కవి పాడతాడు గాని వ్రాయడు—కవిత్వం ఒక *Inspiration*—ఈ మొదలైన *Platitudes* తో భాషకు కొంత అపకారము జరిగింది. మరి ఇంకొక అవరోధ మేమిటంటే, ఈ అపరిపక్వస్థితమైన పరిస్థితిలో కవు లెలా పుట్టారో విమర్శకులూ అలాగే పుట్టారు. వారూ వీరూ కూడా చదువుకొన్న వాళ్లూ కారు; చదువుకోని వాళ్ళూ కారు. భాషయందు, పలుకుబడియందు, దృఢదీర్ఘాభ్యాసములేని వాళ్లు. ఇంగ్లీషులోనుండి వచ్చిన గాలియూహాలయందు రమించేవాళ్లే గాని ఈ ఊహా స్వప్రతిపత్తికంగా ఉన్నదని గానీ, ఈ శబ్దము సుపరిష్కృతము కాదు అని గానీ ఆలోచించేవాళ్లు కారు. ఎవరైనా ఈ కవులమీద విమర్శన వ్రాస్తే, ఆ తప్పులన్నీ, ఒప్పులని ముద్దరు వేసేవాళ్లే. దీనికి కారణం పత్రికలే. ఈ పత్రికలు భాషాపోషణముకోసం ప్రయత్నించవు. ఇంగ్లీషు పత్రికలలో తప్పొక్కటైనా ఉంచరు. తప్పు ఉంటే వెక్కిరిస్తారు. తెలుగుపత్రికల తెలుగుభాషలో ఎన్నైనా తప్పులుంటవి. ఈ ఒక్క పరిస్థితి తెలుగు కవిత్వానికికూడా ఉపలక్షకము. ఇట్టి సందర్భములో సద్విమర్శకుడు, సద్విమర్శకోసమే వ్రాయాలి గాని మరి ఇంకొక హేతువు లేదు. ఆ విమర్శకునకే తెలుసు—తనకు ప్రతి విమర్శలు చేస్తారని. తప్పులు ఒప్పులే యని వాదిస్తారని—సంఖ్యాబలం వాళ్లది గనుక చివరకు వాళ్ల మాటే నెగ్గినట్లు పైకి కనుపిస్తుందని. అయినా, భాషాపోషణము, కవితా నైర్మల్యము, ప్రధానంగా భావించే సద్విమర్శకుడు తన విమర్శను మానివేయడు. దాని ఫలితము లేశము కల్గినా అతడు సంతోషిస్తాడు. ఈ లోకాన్ని మరమత్తు చేయటం సాధ్యం కాదు. ఒక మంచి వాక్యాన్ని పట్టుకొని వెక్కిరించే జను లున్నపుడు ఒక ధర్మాన్ని పరిహాసంచేసే జను లున్నపుడు ఒక యాథార్థ్యాన్ని తల్లక్రిందులుచేసే ప్రజ లున్నపుడు ఒక వక్ర పరిస్థితిని ఋజువుచేయటం చాల కష్టము.

ఇంతకూ, భాషాసౌష్ఠవము విచారిద్దాము. తప్పును కూడా ఒప్పుగా చెప్పవచ్చు. అందుచేత తప్పు చూపించ నవసరములేదు. కాని తప్పును ఒప్పుగా సాధించడము వేఱు. అది అసలు ఒప్పు కావటం వేఱు. ఊహా శబ్దం ఆకారాంతము ఎక్కడో యున్నదని చూపించవచ్చు. చూపించినా అది సామాన్యమైన తప్పే. శబ్దంలోనే ఇంత గందరగోళం ఉంటే ఇంక అర్థము—భావము—నిలువవు. ఇంగ్లీషు చదువుతో హేతువాదమునకు నిలువని అనేక భావాలు దేశంలోనికి వచ్చినవి. *Platonic love* ఒకటి. మళ్ళీ ఈ ప్రేమ స్త్రీపురుషుల మధ్యే ఉండాలి. వాళ్ళిద్దరికీ, శరీరసంపర్కము లేదు. ఇదేం కరుణ విప్రలంభమువంటిదా? కరుణ విప్రలంభములో కూడ రతి ఉన్నది. ఇక్కడ రతి లేదు సరిగదా రతిభావనయైననూ లేదు. ఇది ఇద్దరి పురుషులమధ్య ఉన్న స్నేహమూ కాదు. స్త్రీపురుషుల మధ్య ఉండే ప్రణయమూ కాదు. దీనికి తలాతోకా లేదు. ఇది పాశ్చాత్యదేశాలలో పుట్టినది. ఈ పద్యము చూడండి.

కనుల సౌందర్యములను చూచు కొనుటకన్న
మనసు లన్యోన్యరంజన కొనుటకన్న
కౌఁగిరి రమ్మోయియని పిల్చుకొనుటకన్న
చెలుల కిలమీద చెలిమి కావలయును సఖుడ.

తృణకంకణములోని దీ పద్యము. ఇది పై భావమునకు సిద్ధాంతముల్లే వ్రాయబడ్డది. ఈపద్యములో అన్యోన్యరంజన—అన్నమాటకు అర్థము ఇద్దరు స్నేహితుల మధ్య కల్గిన ప్రేమయా—ఇద్దరు స్త్రీపురుషుల మధ్య ప్రేమయా-చెలులు-అన్న శబ్దమునకు వట్టి స్నేహితులన్న అర్థమా-ప్రణయవంతులని యర్థమా—యిది గోడమీది పిల్లివాటపు సిద్ధాంతము. ఈ సిద్ధాంతము తృణకంకణములోని వస్తువు.

"కామములేని మేళన వికాసము నించు లతాసుమమ్ములు—" తీగకు పువ్వునకు మధ్య కామము లేదు. ఈసిద్ధాంతమున కిది ఒక పునాది. తీగనుండి పువ్వు పుట్టుచున్నది. అది తల్లి బిడ్డల ప్రేమ. స్త్రీ పురుషుల ప్రేమ కాదు. పువ్వు రాలిపోవును. వాని మధ్యయున్న కామము మానవకామమువంటిది కాదు. అది ప్రకృతి- దానియందు కామ కల్పన చేసినచో చేయవచ్చును.

మనసుచే వాక్కుచేత కర్మమ్ముచేత
కలుషితములు కాదగినవీ వలపు లవని
తపసుచే తాల్మిచే ధ్యానధారచేత
లీనమై శైక్య మందజాలినది ప్రేమ.

ఈపద్యమునందు వలపు వేఱు—ప్రేమ వేఱు, వలపనగా కామదూషితమైనదనీ, ప్రేమయనగా కామస్పర్శ లేనిదనీ కవి యూహాగా కనిపించుచున్నది. తపస్సు—తాల్మి, మనోవాక్కాయకర్మల యొక్క నియమమని చెప్పవచ్చును. మనస్సు లేకుండ ధ్యానధార లేదు. వలపులు మనోవాక్కాయములచేత కలుషితములగుట ఎట్లు? మనోవాక్కర్మములు—ధర్మానుబంధులగుచో నివి కలుషితములగు టెట్లు? అనగా ప్రేమకు, మనోవ్యవస్థ యే కాని క్రియా వ్యవస్థ లేదని యర్థమా? తపస్సు—'తాల్మి' ధ్యానధారయు భక్తుల లక్షణములు, యోగుల లక్షణములు...ఇది ప్రేమ లక్షణముగా చెప్పిన యీ క్రొత్తనిర్వచన మేమిటి? మనోవాక్కాయముల యునికి కలుషితములగుచో శరీరమే కలుషితము. అవి శరీరధర్మములు. అవి కలుషితములని చెప్పినచో లోకమే కలుషితమనుట, యోగమార్గమే ప్రేమ. తక్కినది కలుషము.

ఆధునిక కవుల ఊహ లిట్లుండును. ఇవి కావ్య వస్తువులు. సంప్రదాయము ఉండదు. భాషలోని మాటలు ఉపయోగించుటయే కాని వాని యర్థముల, లోతులు తెలిసి వ్రాయుటకాదు. గాలిలో దీపము పెట్టి దేవుడా నీమహిమ యనుట. మన భాష ఈనాడు అధోగతిలో నుండుట దేవుని మహిమయేగదా! ఆ దేవుని మహిమవలననే యీ దీపములు వెలుగుచున్నవి.

వలపుల పూలసంకెలలు
బంధములేయగ గువ్వజంట ని
ర్మలమగు వత్సలత్వ మెదరాగిల
వావుల తల్లి బిడ్డలే
కలుషములేని సత్ప్రణయకాంక్షలు
మేళనచేయ మిత్రముల్
మెలగుచురీ రహస్యమె సుమీ
కనుపించెడు సృష్టియందునన్.

గువ్వ జంటయందు—తల్లియావు, దానిదూడ, వానియందు—స్నేహితులయందు—ఈ రహస్యము

న్నదట. ఇందులో సర్వజంతుయందు కామమున్నది. ఆవు దూడలయందు తల్లి బిడ్డల ప్రేమ యున్నది. మిత్రములయందు స్నేహమున్నది. ఇందులో ఆ రహస్యమేమిటి? ఉపాధిరహితమై మనస్సునందుగాని హృదయమునందుగాని కలుగు నొక యార్ద్రమైన స్పందనమా? ఆ స్పందనమే భిన్నోపాధులయందు భిన్నముగా ప్రకాశించును. కామము—ప్రేమ—స్నేహము—వాత్సల్యము—ఇట్టి మాట లుపాధుల నాశ్రయించి పుట్టినవి. ఉపాధి రహితమైనది, యచ్ఛమైన యార్ద్రత. స్త్రీ పురుషుల మధ్య రతి సంబంధమై యది ప్రేమయగును. ఆ మూలవస్తువైన యార్ద్రతయే ప్రేమయున్నచో ఆ యార్ద్రత యుపాధి సంపర్క విరహితమైన మానవ సహజమైన యొక లక్షణము. దాని ప్రేమ యనుట ఎట్లో—సోపాధిక దశయందు దాని కేవలత్వము కేవలత్వముగా నుండి యుపాధ్యపేక్షా సంబంధభావరహితత్వ మెట్లో—ఇది విచారణ కందు విషయము కాదు.

ఈ భేదము, విస్పష్టముగా, నుదాహరణముచేత తెలియును. అనేక వృక్షములున్నవి. అన్నియును పుష్పించును, ఫలించును. పుష్పించుటకు ఫలించుటకు సరియైన ఋతువునందు వృక్షప్రకృతిలో, నొక సంచలనము కలుగునుగదా! ఆ సంచలనము, సర్వ వృక్షములకు సమానమే. కాని మామిడిచెట్టునం దది వాసనలేని పూవులను, రుచిగల పండ్లను ఇచ్చును. ముషిణీ చెట్టునందు విషఫలముల నిచ్చును. ఆ సంచలనము, తియ్యనిదా? చేదుదా?—ఈ మామిడిపండ్లకు, ఆ ముషిణీ కాయలకు భేదము కన్పించుచున్నది. ఆ సంచలనమునందు భేదము లేనట్లుండును. అందుకూడ భేద మున్నదేమో తెలియదు. పరిణతావస్థయందు భేదము, భేదావస్థయం దనుమీయమానమగుచున్నది. అట్లే, తల్లిబిడ్డల ప్రేమ, స్త్రీపురుషుల ప్రేమ, స్నేహము, మొదలైన వికారముల కాద్యమైన, ప్రథమ హృదయస్పందనము, నిజముగా వికార రహితము కాదు. తర్కబుద్ధికి ఈ ప్రేమ సిద్ధాంతము నిలువదు. దానియందు సామంజస్యము లేదు సరిగదా అర్థము చేసికొనుటలోని అవ్యక్తత కనుపించును.

విషయ మయమైన సంభోగ విధి జగాన
క్షయమయియ్యు, రూపాంతర సంగ్రహమున
సుప్రజా తంత్ర నిర్వాహ సూత్రమనుట
తలచెదరు దంపతీ నిష్ఠ ధర్మముగనె.

సంభోగవిధి విషయమయ మనుటయేమి? విషయము లనగా పంచేంద్రియములకు లక్ష్యములు. సంభోగము నందీ సర్వేంద్రియ లక్ష్యత్వ లక్షణమేమిటో? పూర్వులీట్లనినట్లు లేదు. అది క్షయ మనుట యేమి? అది గ్రహించెడి రూపాంతర మేమిటి? ఇది యంతయు రససిద్ధాంతమా?

మాధు లిచ్ఛయించెదరు సంభోగసుఖము
నే వియోగ మాధుర్య లీలా విపాక
మనుభవింప నతాడెవనడె యాంధ్ర
రసిక కులరాజు పండిత రాజు తలచి.

పైన సంభోగ సుఖము—క్రింద వియోగ మాధుర్యం. సంభోగ సుఖమనుటచేత దానియందు రసత్వము లేదు. వియోగమాధుర్య మనుటచేత రసత్వమున్నది. వియోగ మాధుర్య మాస్వాదింప తగినది. సంభోగ సుఖమనుభవించతగినది. లాక్షణికులు, సంభోగ శృంగారముకంటె, విప్రయోగ శృంగార మధి కాస్వాద్యమనిరి. రెంటియందు స్థాయిభావము రతియే. ఇది (*Platoinc Love*) కి సంబంధించినది గాదు. ఆ సిద్ధాంతము ప్రతిపాదించువారికి, సహాయకారియు కాదు.

రసములకు నెల్ల శృంగారరసముతల్లి,
యనిరి పూర్వులు, సంభోగమవధి గాగ
అక్షరానంద సిద్ధి లక్ష్యముగ నెంచు
నవ్యులకు నది అప్రధానంబయయ్యె.

అనగా, శృంగార రసాస్వాదనమునందు అక్షరానంద సిద్ధిలేదనియా? అయినచో రస సిద్ధాంత మంతయు వ్యర్థము. శృంగారరసమునకు, సంభోగ మవధి కాదే! రతిస్థాయి భావము. ఆ రతి సంభోగము కాదు. ఈ రీతిగా బహువిషయములకు స్పష్టమైన అర్థము విచారించక చేసిన చేత యిది. ఇవి యన్నియు నిగూఢ విషయములు. చర్చనీయ విషయములు. శాస్త్రీయవిషయములు. సామాన్యులు విమర్శించ లేనివి. అందుచేత నిది కవిత్వముగా దలామణి యగుచున్నది.

మఱియు పదియేండ్ల పిల్లను నాయికగా చేయుట. ఆమె "పూతకురాని పసి మొక్కలమడి". కొన్ని పరిస్థితులుకలిగి ఆమె చనిపోవును. అక్కడ కథ ఏమియు లేదు, కొన్ని పరిస్థితులున్నవి. ఈ కథ కావ్యముగా వ్రాసినచో, దానియందు, రసముండదు. ఒక

భావ ముండవచ్చును. "ప్రకృతిగూడ ఈ వికారమును చక్కబెట్టుటకన్న సమాప్తము చేయుటకే తొందరపడుచున్నట్లు తోచుచున్నది. ఈ భావవిన్యాసమందలి కష్టశేఖరమే యీ కృతికి బీజము." ఈ భావముకోసము కథయని చెప్పతగని యీ కథ, కావ్యముగా వ్రాయబడినది. దీనికి కావ్యత్వము పట్టునా? కావ్యమనగా నేమి? పంచసంధులు, —లేకపోయినచో వానిలో కొన్ని—కథను చేయును. ఇది నాటకలక్షణము కాని కథాలక్షణము కాదని కొందఱందురు. ప్రబంధమనగా నాటకము కాదని కొందఱి యుద్దేశ్యము. నాటకము దృశ్యప్రబంధమని, కావ్యము శ్రవ్యప్రబంధమని చెప్పబడుచున్నవి. నాటకము—కావ్యము—రెండునూ ప్రబంధములే యనుటకు నింతకన్న నేమి చెప్పవలయును? నాటకమునకు, సంభాషణ, నాటకాంగములు, వేఱుయుండును. అది యొక్కటియే భేదము. కథాకల్పనాదులన్నియు సమానములైనవే.

ఒక కథకు బీజమాత్రముగా, నిలువదగిన కొన్ని పరిస్థితులు లోకమునందు తోచి యవి విఘటితము లగును. మొక్క వేసితిమి. చచ్చిపోయినది. అది వృక్షము కాలేదు. మధుమాసము రాలేదు. పూయలేదు. ఫలించలేదు. దాని సౌందర్యము చూడలేదు. కథా దశ ఆస్వాదనా పరమార్థముగలది మొక్కగానే చనిపోయినపుడు, ఆ మొక్క వేసికొనినవానికి దుఃఖము కలిగించినది. దానికి పుష్పఫలములు లేవు; అనుభవమూ లేదు. అట్లే, పదియేండ్ల పిల్ల చనిపోవుట. దానికి కథాత్వములేదు, ఆస్వాదనాయోగ్యమైన రసములేదు. ఆ స్థితిలో చనిపోయినదన్న విచారమున్నది. ఈ విచారము రసస్పర్శ కలది యనవచ్చును. అది కరుణ రసము కావచ్చుననవచ్చును. పరిస్థితులయందు, శృంగారరసము వ్యజ్యమానము కావలసిన స్థితియుండగా, రసవిఘటనము జరుగుచున్నది. కాని అన్యరసోత్పత్తి కలుగుటలేదు. క్రౌంచద్వంద్వ వియోగముకూడ నిట్టిదే యనవచ్చును. కాని, అచ్చట మూర్తి గట్టిన రససామగ్రి విచ్ఛిన్నమైనది. ఇక్కడ రససామగ్రి అవిస్పష్టదశయందున్నది. ఈ రెంటికిని లోకమునందును భేదము కలదు. వివాహమగువఱకు భార్యాభర్తలు కారు. తత్పూర్వము వచ్చిన సంబంధము చెడిపోయినచో, ఆ పిల్లకు వాని యందు ప్రేమయున్ననూ, నామె విధవరాలు కాదు. తద్విచ్ఛిత్తినుండి కరుణ రసముదయించుటకు నిచ్చట రసత్వదశయేలేదు. కరుణ రసమునకు, తద్విచ్ఛిత్తియే అక్కఱలేదన్నచో, నొక పదియేండ్లపిల్ల, యుయ్యెల యూగుచు మెడ కురిపోసికొని చనిపోయినదని చెప్పుట చాలును. ఆమె యొక పుణ్యవానిని ప్రేమించినది అని చెప్పుటవలన విశేషములేదు. ఆమె పసిపిల్ల. ఆమెకు ప్రేమయొక్క స్వరూపమే తెలియదు. ఆమె యందు మన్మథోదయమే కాలేదు. లోకములో పసిపిల్లలు "నేను శావనే చేసికొందు"నందురు. అది యొక క్రీడా చమత్కారము. బాల్యమునందలి అమాయికతమీద, లోకాచారముయొక్క ముద్ర. అందుచే, నీ కరుణ రసము కలగడానికి, పూర్వముచేసిన కల్పన యంతయూ వృథా.

తనతోటలోన వేసిన యుయ్యేలనూగ
నుల్లాసపడుచు పో
యె కమలాంబ, పిలుదులు రాయు వేణి
కన్నె సింగారమున కొక వన్నెనీయ."

ఆమెకులాసాగా నుయ్యేల నూగుటకు వెళ్లినది. ఆమెలో ప్రేమభావమే లేదు. ఆడుకొనుటయందలి ఉత్సాహమే కాని, అనుభావసంచారి భావముల స్పర్శ గూడ లేదు. వెనుక కల్పించిన పరిస్థితుల యొక్క యనవసరత్వము దీనియందే తెలియుచున్నది. ఆమె వేణి పిలుదల రాయుటయేమి? పదియేండ్ల పిల్లలనుగూర్చి, పిలుదులని చెప్పవచ్చునా? ఈ రీతిగా, నేది కథకు యోగ్యమైన వస్తువో, ఏది అయోగ్యమో, ఏది అవసరమో, ఏది అనవసరమో, తెలియని తనము చాల కన్పించుచున్నది. మఱియు నుయ్యాల నూగుటలో వేణి యెట్లు పెనవేసుకొన్నది? ఎంత బిగువుగా వల్లినను, జడ అంత యురి వేయునా? ఉయ్యేల ఆపి తీయువరకే పిల్ల చనిపోవునా? ఎక్కడనైనా ఇట్లు జరిగినచో జరుగవచ్చును. ఊహింపరానివి కూడ సృష్టిలో కొన్ని జరుగును గదా! అట్టి దొక యాశ్చర్యవిషయముగా చెప్పవలయును గాని కథాగత విషయము గాదు. అప్పుడు కలుగునది అద్భుత రసము. కరుణ రసము గాదు... ఇది కష్టకములయను కావ్యములోనిది.

మఱి కన్యాశుల్కమును గుఱించిన యొక విషయమును తీసికొందము. దీనియందు రసము పుట్టదు. భావమే కల్గును. భావోదయమునకైనను రసోదయమునకైననూ, అవి కలిగించుటకు- కవి నేర్పు కావలయును. స్నేహలత యను కావ్యమును పరిశీలింతము. ఒక

బాలిక యున్నది. ఆమె తల్లిదండ్రులు ఆహితాగ్నులు. వాళ్ళది పూరిపాక. ఆ పిల్ల యొక్క సంధ్యాకాలమున నెక్కడికో పోవుచున్నది. ఒకర్తు బ్రాహ్మణి నవ్వు పల్లవము మెఱయగా నీ యుషస్సంజ నెక్కడికి పోయెదవని యడిగెను. ద్వారబంధమ్ము వఱకు తిరుగు కొని వచ్చెను. ఆ బ్రాహ్మణియే తల్లి. ఈ పదునైదు యేండ్లు నిండని బాలపేరు స్నేహలత, ఆమె చెలి ప్రియంవద—ఇద్దరు గంగానదికి వెళ్ళుచున్నారు—తల్లి నవ్వుచు తిరుగుకువచ్చుట యేమిటి? మరలింప జాలకపోవుటయేమిటి? ఎక్కడకు వెళ్ళుచుంటివని యడుగగా గంగకు పోవుచున్నానని ఆమె యనెను. ఇప్పు డెందుకమ్మా యనవచ్చును. కాదు వెళ్ళివత్తునులే యని ఆమె సమాధానము చెప్పును. సరేలే యని తల్లి యూరకుండును. ఇంతేకాని తల్లి తిరుగుకు వచ్చుట — మరలింపజాలకపోవుట — ఈమాటలకు ప్రయోజనము గనుపించదు. ఆ సామాన్య పరిస్థితిని అంత పెద్దమాటలతో చెప్పకూడదు. ఆ తిరుగుకు వచ్చుటలో నవ్వు పల్లవము మెఱయనక్కరలేదు.

వారిద్దరు గంగానదికిపోయి కొంతసేపు మాట్లాడు కొనిరి. ప్రియంవద, స్నేహలతకు సంబంధము వచ్చుట — అంతకట్నము స్నేహలత తండ్రి ఈయ లేకపోవుటనుగుఱించి చెప్పినది. ఇంతవఱకు కథ యేమియు లేదు. ఈ స్నేహలత చచ్చిపోవునని సూచించుటకు కొన్ని వ్యంగ్యోక్తులు కలవు. ఆ రాత్రికి స్నేహలత బయలు పరిశీలించును. "బ్రహ్మాండము గూచుచుండె తనయామణి యో తారక శ్రీ యరుంధతీ మండలికోసమో యన క్రమక్రమ భిన్నమనోవికారయై" అరుంధతీ నక్షత్రము చూచెడి స్త్రీ ఆకాశము చూస్తే చాలు. బ్రహ్మాండమంతా చూడనవసరము లేదు. ఆరాత్రికి స్నేహలత యొక్క ఉత్తరము వ్రాసి పెట్టి తాను నిప్పు ముట్టించుకు చచ్చిపోయెను. ఆమె కింకను పెండ్లి కావలసిన చెల్లెళ్ళున్నారు. తాను చచ్చిపోయినచో తన చెల్లెళ్ళకు మాత్రము కట్నమీయవలదా. అట్లే తన చెల్లెళ్ళు కూడ చావవలయునా?

"రాజరాజ కుమారికారత్నములును
ననుభవింపరు నేను పొందిన సుఖంబు"

అన్నోదకమునకు లోపములేని సంసారములె కనపడుచున్నది.

"మొన్న నపరాహ్ణమున చాలప్రొద్దు నీవు
కాళ్ళు వాయగకట్టిన కడపలెల్ల
తిరిగి తిరిగి వేసారి యేతెంచినట్టి
విసదు నాతలపు"

అతడు విచ్చమెత్తుచున్నాడా? ఆ పూర్వభావమునకు, దీనికి, పరిపోదు. పెండ్లిసంబంధమునకు గడప గడప తిరుగుకురా? లేనితో నప్పు పుట్టించుకొనుటకు తిరిగెనా? ఈ చివరిదియైనచో విస్పష్టముగా చెప్ప తగినది. ఏది విస్పష్టముగా చెప్పవలయునో, యేది స్ఫూర్తికి వదలిపెట్టవలయునో జాగ్రత్తగా విచారింప వలయును. ప్రధాన కథాంశములు చెప్పబడవలయును. కాళ్ళు వాయగకట్టిన కడపలేమిటి?..కాళ్ళు వాయగ తిరుగుటయైనచో కట్టిన కడప లేమిటి? కడపలు పెట్టుదురుగాని కట్టరే. ఆ తండ్రి "గుణకులీనుడైన భర్త కొరకు సలిపితింత యత్నములు నిష్ఫలసమాప్తి" "గుణకులీను" డేమిటి? గుణముచేత కులీనుడా? విగ్రహముగను సమాసము కుదురదు. నిష్ఫలసమాప్తి ఎట్లు? నిష్ఫలముగా ననుటతోడనె యర్థము కలుగుచుండగా "సమాప్తి" దేనికి? ఇట్టి కుదురని సమాసములతో పొసగని యర్థములతో కావ్యమంతయు వ్రాయబడి యాపిల్ల చనిపోయెను.

అనఘ శుల్క కళంకము నంటకుండ
ఆ పవిత్రమనః కన్యకా పథంబు
రక్షణము చేసినట్టి ఈ దక్షిణాగ్ని
కలుషితాచారముల గాల్చి వెలుగుగాక.

అని చివరి పద్యము. దక్షిణాగ్ని యనగా నేమి? త్రేతాగ్నులలో నదియొకటి. కట్టుకొన్న చీరమీద కిరసనాయిలు పోసి ముట్టించుకొన్నచో నది దక్షిణాగ్ని యగునా? దక్షిణాగ్ని యనగా దయగల యగ్ని యని యర్థము చెప్పినచో "యూథికోత్సగాద్బలి యష్టి" అలాగుంచినా, ఆ అగ్నియందు దాక్షిణ్య మేమియున్నది? దాని సహజలక్షణమునందు దాక్షిణ్య మారోపితమా? ఆ అగ్ని యేమిచేసినది. శుల్క కళంక మంటకుండ, ఆ పవిత్రమనః కన్యకాపథంబును రక్షణము చేసినది. శుల్కకళంక మామె కెట్లంటును? శుల్క మెవరు గ్రహింతురో వారి కంటును. ఈమెకు కూడ అందులో కొంతభాగ ముండునన్నచో అది పాటింపులోనికి రాదు. ఒకవేళ నీమె, లేపమైన నంటినచో నది శుల్కకళంకము కాదు. తండ్రిని ఋణగ్రస్తుని చేసిన కళంకము. అది శుల్కకళంకము కాదు. అపుడు శుల్కకళంక మన్నచో అది మధ్యమ పదలోపి సమాసముకూడ కాదు. ఆదిమ పదలోపి,

మధ్యమ పదలోపి. బహు వాక్యలోపి సమాసము. పవిత్రమనః కన్యకా పథ మేమిటి? పవిత్ర మనస్కురాలైన కన్యకయని అన్నచో నిర్దుష్టముగా నుండును. కన్యకాపథము అనగా ఆమె మార్గము. ఈ మార్గము నగ్ని రక్షించినాడు. అది యేమిమార్గము? జీవిత మార్గమా—శీలమార్గమా? ఐనచో జీవితమనియో శీల మనియో చెప్పవలయును. మార్గమన్నచో చాలదు. ఇంగ్లీషులో కొన్ని ఇట్టి విచిత్రప్రయోగములున్నవి. అక్కడి భాషాస్వభావమువలన అర్థము పుట్టిన పుట్టు గాక. తెలుగులో పుట్టదు. ఈ కావ్యములో గంగకు వెళ్ళుట—గంగదగ్గిఱ సంభాషణము వ్యర్థములు. దాని వలన ఒక *Atmosphere* కలిగించవలయునని ఊహ యైనచో ఆ *Atmosphere* కలుగుటలేదు. లోకాభిరామాయణమువలన *Atmosphere* కలుగదు. ఉన్న పరిస్థితి చెప్పి ఆ పరిస్థితి కనుకూలమైన లోకాభిరామాయణము చెప్పినచో కలుగవచ్చును. మొదట పరిస్థితియే చెప్పబడలేదాయెను. ఇద్దఱు స్నేహితురాండ్రు కలిసి గంగకు వెళ్ళిరి. అక్కడ యేవో మాటలు చెప్పికొనిరి. ఆ మాటలలో విషాదవార్తలుకూడ కలవు. సూచ్యార్థ సూచనము ప్రసిద్ధ కథలయందు భాసించును. అందు కనే "కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము" లన్నది.

మఱి యింకొక కథ చూతము. ఇది స్వప్న కుమారమన్న కావ్యములోనిది. కుమారుడని యొక డున్నాడు. ఒక యడవిలో వానిదగ్గఱకు ఒక స్త్రీ వచ్చినది. ఆమె దోసెడు మల్లెమొగ్గలను తెచ్చి వానిని వాసనచూడమంచు బలవంతము చేయుచున్నదట. ఆమె యతనితో మాటాడదు. ఇత డామెతో కొన్ని మాట లనెను. ఆమె, మాటాడకుండ బలవంతమెట్లు చేసెనో తెలియదు. మొగమెత్తి చూచి తన్నను గ్రహింపుమనెను. ఆమె, మాటాడకుండ వెళ్లిపోవును. ఇత డామె వెంటబడిపోవును. ఆమె నావెంటబడి యేలవత్తువనును. ఇతడు మరల బ్రతిమాలును. ఆమె ఈతని చేతి కొక బంగారుగిన్నె నిచ్చును. తరువాత నితని ఒడ లితనికి తెలియలేదు. మరల నామె చేయి పట్టుకొని "కనులయెదుట నిరాశచే కాల్పవలెనె" అన్నాడు. ఆమె "కనులయెదుట నాదు రూపంబు కష్టమేని, అవలబోయెద, సుఖముండుము" అన్నది. అతడు "నీ హృదయలీనుజేసి మన్నింపుము" అన్నాడు. ఆమె "తాళు మిప్పుడు మంచి సమయము గాదు కుమార" అని వెడలిపోయెను. అప్పు డతని కొక ధ్వని వినిపించినది. అది జలప్రపాతధ్వని. ఇతడు మఱి కొంతసేపు దుఃఖించును. ఇత డామెకోసము "అనపత్యహారిణము"వలె చూచుచున్నాడు. అనపత్యహారిణమనగా బిడ్డలులేని లేడి. ఈతడు బిడ్డలు లేని లేడివలె నామెకొఱకు చూచుట యేమిటో తెలియదు. అప్పు డతనికి "పలుకరించె సీతాకోక చిలుక యొకటి" సీతాకోక చిలుక పలుకరించుట యేమిటి? అది ఎట్లు పలుకరించునో తెలియదు. "వెంటనే విన బడె నొక్క పలదివాణి" ఈ వినబడిన వాణి ఒక పంద్రెండు పద్యాలున్నది. చివరకు తూర్పువంకను జూచినాడు. "చేయి తలాడ చేసికొని చెమ్మట గ్రమ్మిడి నవ్వుమోముతో నాయెడ నాకుపచ్చని శయానముపంచున పవ్వళించి పాలీయ ప్రసన్నయైన జనయిత్రి యొకర్తుక దోచె నంత నమ్మాయని గొగలించితిని ఆయమకంఠము బాలు పోలికన్"— పచ్చని శయానము—శయనము అనగా శయ్య. శయానము అని ఇట్లు ప్రయోగించరాదు. శయానుడు— పండుకొనినవాడు అని యర్థము. మహాత్ముడు— బిభ్రాణుడు—దధానుడు—ఇలాంటి శబ్దము. అయినచో పండుకొనినది యని యర్థమగును. శయ్య యను నర్థమురాదు. ఇది కథ.

ఈ కథయొక్క సారాంశ మేమి? ఈ కథ యెందుకు వ్రాసినట్లు? దీనిలో నేదో యొక మహార్థ మున్నదని కవి చెప్పినచో ఆ అర్థము గోచరించవలయునా? వలదా? ఏ యర్థమును గోచరించుటలేదు. కాని పుస్తకమునిండా ఏవో ధ్వనులవలె భాసింపచుటకు ప్రయత్నము చేయబడిన భావము లున్నవి. ఏదియు మూర్తి కట్టదు. తక్కిన గ్రంథములలోవలె దీనిలోకూడ అర్థదోషములు—శబ్దదోషములు వందలకు వందలు. "అమ్మతోంపడుకూడ ప్రసూన జాతిబాలసు లయియున్న పుష్పవతులం తెరపట్టగరాదు" అప్పుడు చంద్రుడు లేడు. ఉన్న చంద్రుడు ఆ పని చేయుట లేదన్న దానిలోనున్న ఔచిత్యము లేని చంద్రుడాపని చేయుటలో లేదు. ఎందుచేతననగా చంద్రుని కది నియతిలక్షణము కాదు కనుక. ఆ వచ్చిన స్త్రీని కుమారు డిట్లనుకొనుచున్నాడు. "వలచిన ప్రాణవల్లభు దెవం డయినం బ్రతిమాలవచ్చితో, నిలుపగరాని కాంక్ష నవనీత దయాగుణశాలి నొక్కనిన్ పిలిచితో ఈవనం బునకు" ఇందు రెండు వితర్కములు — ఎవ్వరైనా ప్రాణవల్లభుకు బ్రతిమాలితే వచ్చితివా? — నీవే ఎవ్వనినైనా యిచ్చటకు రమ్మంటివా? దీనిచేత తాను వాడు కాడు. మఱి స్త్రీననుసరించుట వ్యభిచారము. ఆమెతో మరియు ననుచున్నాడు. "అర్ధరాత్రివేళలను రహస్యపీఠ లిటులఁ కదలించితివేల నోలతై" అర్థ

రాత్రివేళ లనరాదు. అర్ధరాత్రవేళలని యుండవలయును. రహస్యవీణెలు కదలించుట యేమిటి? ఏమి యర్థము చెప్పఁగొనవలయును? కుమారుని హృదయములో కామోద్రేకము కలిగించుటయా? అసంకేతికార్థములైన యిట్టి శబ్దములు అసత్కవులకు ప్రథమ లక్షణములు. ఆమెను "వైభవశాలినీ" యని సంబోధించును. ఆమె దేమి వైభవము? ఆమెను "ఇచ్చకాల యింతీ"యని పిలచును. ఏమిటీ పిలుపు? ఆమె యేమి యిచ్చకము లాడెను. ఎవరితో ఆడెను. తనకోసము గాక మఱి ఎవరికోసమో అచ్చట, కామె వచ్చి యుండెనని ఇతడనుకొనెను. మరి ఎవరియందో ఆమెకు ప్రేమయున్న యెడల నది యిచ్చకాలు కలిగి యుండుట ఎట్లగును? ఇచ్చకాలనగా — ఎవరినైనా సంతోషము పెట్టుటకు మనము మాట్లాడెడి మాటలు. ఇక్కడ సందర్భ మేమీ పొసగదు.

"పూలుగ్రుచ్చిన సంపూర్ణ పుణ్యశీల
వేని వనమూచి ప్రేమింపు విందువదన
మాలికలను త్రెంచిన అభాగ్యురాలవేని
రమ్ము పోద మీ హతమనోరథునితోడ"

పూలు గ్రుచ్చుట — మాలికలు త్రెంచుట' ఈ రెంటికి సంకేతితార్థమేమి? ఇది యేదైనా కవిసమయమా? అర్థములేని రచన యిట్లుండును. "నీవు కన్యవో కళత్రమవో తెలియదు, చిరమునోవ్యాధి వశమయి చివికి-చివికి నవయు ననుడాసి లేపితానందము గను,దానకాంక్షింతు సాప్తపదీనమైత్రి." - చిరమునో వ్యాధివశమైనదేది? ఉన్నచో వ్యాధివశుడనై యని ఉండవలయును. సాప్తపదీనమైత్రిని కాంక్షించుట యేమిటి? పెండ్లిచేసుకొమ్మని యర్థమా? జారత్వమా యిందలికథ? "స్నాయురుచ్ఛేదము"ని యొక సమాసము. ఇది సకారాంతశబ్దము కాదు. స్నాయూచ్ఛేదమని యుండవలెను.

"చేతిమీదు గా త్రవ్విన చిన్నిచరపి
మునిగితేల కదృశ్యుడౌ పుణ్యదేవకు"
అదృశ్యుడనగా అర్థము కుదురదు.

ఇట్లు ప్రతిపద్యము దోషయుతముగా నుండును. "గాయములు లేని నెత్తురుగడ్డలైన, ఈ వగపుగంటులెటు శమింపగలవు" నెత్తురుగడ్డలకు గాయములేమిటి? గాయములు కాని నెత్తురుగడ్డలైనను అర్థము చెప్పికొనవచ్చును. "కన్నెవిరులు సమర్తాడు కాలమందు" పూవులు సమర్తాడవు. తరులు సమర్తాడినచో పూవులనవచ్చును.

"మదవదలిపుత్రు మేల్కొలుపు మధుసుగంధ
ములల యూతని చెఱకు బాలవు వితాన"

మదించిన తేటిని తీయని సువాసన మేల్కొలుపును. తరువాత, నా తేటి ఆ సుగంధమును చెఱపట్టును. తుమ్మెద సువాసనలను చెఱపట్టుట యేమిటి?

"మెలమెల్లన నా చిగురాకుబోణి యడుగుల గవయంబో నిట్టులంటి గద్గద భణితిన్"—ఆమె యడుగుల కవయబోగా నిట్లన్నాడు. కవయబోగా నిట్లంటి ననియుండునా? కవయ పోవుచు—అన్నను కొంత కుదురును.

"కాంతరూపమే రసవదాకర్షణమ్ము"—ఆకర్షణమునకు రసవద్విశేషణ మేమిటి? ఆకర్షణమూ—రసవల్లక్షణమూ రెండూ సమానాధికరణములా? విశేషణ విశేష్య భావలక్షణ లక్షితములా? వాడు నన్ను రసవంతంగా ఆకర్షించా డన్న వాక్యముండునా? ఎవరో సమాధానము వ్రాయుచు నట్లే యుండునని వ్రాయును. ఆయనకూ—నీయనకూ ఇద్దఱికీ నమస్కారము చేసి యూరకుండవలయును.

"చెలియ ముసుంగు తీసి కయిసేయదుగాని మొగంబు" ముసుగుదీసి మొగము కయిసేయుట అంటే అర్థము? కయిసేయుట యనగా నలంకరించుట, లేదా పూజించుట. ఏ యర్థమును పొసగదు.

"అసుటయు నింపుక శాపము వినబడవచ్చి యించె నిటుల్" శాపమెట్లు వినబడును. ఈ నాయకుడు పూర్వ మెవ్వతెనో ప్రేమించెను. ఆ ప్రేమ ఇతనికి దక్కలేదు. ఇప్పు డీమె వెంటబడినాడు. ఈ కావ్యమెందుకు వ్రాసినట్లు? దీనిలో కథయేమిటి? యేమియు తెలియదు. ఏమాట కెంత అర్థమువచ్చునో ఈ కవికి తెలియదు.

"కన్నె మనుతయు కన్నుల కన్నకాంక్ష
కఱకు చెడబాటు గొడ్డంత్రు వఱకి వేయు"

గొడ్డలికి బహువచనము గొడ్డండ్రా? ఎడబాటు కన్న మమతను, కన్నుల కన్న కాంక్షను నణకిపె చెను. దీనికి అర్థమేమిటి? కన్న మమత తల్లిదండ్రుల కుండును; ఆ మమత యెడబాటువలన చెడిపోవుట తల్లిదండ్రులు చెప్పకోదగ్గ విషయము. ఇది ఎట్లు చెప్పకొనును? అది సాకాంక్షవాక్యము. ఈ ఆకాంక్ష, యిక్కడ కుదురదు. ఇట్లు భాషాస్వభావమే తెలియని స్థలము లనేకములుండును.


"చప్పిగొని చేరిన మిళిందతనయులకును
పూలపాలిచ్చి చీకట్ల బోవకుండ
కడుపులో దాచుకొనదె పంకజము ప్రియుడె"

మిళింద, పంకజముల యెడను స్త్రీ పురుష భావము కల్పించుట కవిసమయము, సంప్రదాయము. ఇది తల్లిబిడ్డల కల్పన—సమయవిచ్ఛేదము కల్గుచున్నది. సంప్రదాయము నశించుచున్నది. పూలపాలు—మధువు. ఇది ఈ కవి క్రొత్తగా కల్పించి వాడెనని ప్రశంసించువారున్నారు. ఆ యర్థము పొసగునా? 'పంకజము' అనగా తామరతీగె. దీని పూవుల యందున్న పాలు ఇచ్చుచున్నది. పూలపాలనగా అనేక పుష్పములలో నున్న పాలు. ఈ మిళిందము బహుపుష్పములయందు వ్రాలుచున్నదని యర్థము వచ్చును. ఒక పూవే యైనచో పూవు పాలు అని యుండవలయును. పూవుయొక్క పాలు లేదా పూవునందలి పాలు—మధువునకు పాలుశబ్ద ముపలక్షకమైన కావచ్చును గాని, పూలపాలనగా మధువని అర్థమేర్పడుటకు వీలులేదు. ఇట్లు అర్థకల్పన చేసికొనుట అధిష్ఠాన విశేషజ్ఞానరహితముగా వారోప్య జ్ఞాన విశేష సత్తా తెచ్చికొనుట.

పసికటిలు చూచి యేడ్చు జవ్వని యొకర్తె
చనిన దెస చూచి యేడ్చు జనని యొకర్తె
తన సొగసు చూచి యేడ్చు సుందరి యొకర్తె
యేడుపు ప్రియంబుగా వచియింపరేమి?

'చనిన దెస చూచి యేడ్చు జనని యొకర్తె'— —— ఎవరు చనిన దెస చూచి? చూడగా మూడు భిన్నాంశములు ఒకదాని కొకదానితో సంబంధము లేదు.

ఇట్టి కథలచేత—ఇట్టి దోషబహుళత చేత— పేరు ప్రసిద్ధులైన కవులయొక్క కావ్యములే అగ్రాహ్యములుగా నున్నవి. ఇవియే అపమార్గములు. సుపరీక్షకులు గాని పాఠకులు నిండియున్న ఈ దేశములో ఇవి చెలామణి యగుచున్నవి. మాకు దోషములే ఇష్టములు, మేమీ కావ్యములనె గౌరవింతుము, కాదన్న వారితో పోట్లాడుదుము, చివరకు పైచేయి మాదే— అనెడివారున్నంతవఱకు ఇట్టి వాఙ్మయమునకు భద్రమే.



సోమనాథుఁడు

★

శ్రీ అప్పల వీరవెంకట జోగయ్యశాస్త్రి

రణథేరీ నగరోపకంఠమున గ,
    ర్వస్ఫూర్తిగర్జించె, వా
రణకంఠారవశ్రీ ప్రయుక్తపద ని
    ర్ఘాతిక్షురా పాంసువుల్
గణియింపంబడె, నీయకాలవిలయో,
    ద్ఘాతంబు సంధిల్లు కా
రణమేమో యొక ప్రాణికిన్ దెలియదో,
    రా! కాల లీలా విధుల్.

పర్యస్తప్రవివేక శాంబరకళా
    వైదుష్య చారక్రియా
పర్యాలోకనముల్, స్వధర్మనిరతి
    వ్యాపార సంరంభముల్
కార్యోత్సాహ నిరంకుశ ప్రతిభట,
    స్వైరఘ్న హంకారముల్
కార్యాసక్తి దొసంగె నెల్లెడ వ్య
    గ్రంబౌచు నవ్వీటిలోన్

పట్టణమంతయున్ కలక
    బారిన దా గజనీ మహమ్మ ది
ప్పట్టున దాడివచ్చెనను
    వార్త క్రమంబయినంత—"పీనికిన్
గొట్టినపిండి యీ ధరత
    కుంభిని, యింతటి ధూర్తమూర్తి మున్
బుట్టఁడు, తప్ప దెట్టయిన,
    పోరని యాత్మఁదలంచి రందరున్.

*   *   *   *

నాగరకోటలోఁ దగిన,
    నాథుఁడు లేఁడ? కనోజిగజ్జఁ జే
రోష్మగిన జోదు లేఁడ? ధన
    మోహితుఁడే గుడిదోపుకొంగ కా
ల్నాగిన యంతమట్టుకు సమ
    శానసదృశు మెవర్వ, లేఁడె యి
యోర్మగడ మడ్డగింపఁగల,
    యోధుఁడు? మేదిని గొడ్డువోయెనె?

పెస్తురుకూటి కానిలి త్వ,
    శీకృత నిర్మల ధర్మబుద్ధి దం

డెత్తిన నాడు లేగి యెదు
    రేగిన నాటి యనంగ పాలరాట్
సత్తము దుర్నివార భుజ,
    శక్తికి జాగి పలాయనమేసి, నో
రెత్తక పారిపోయి, యిపు,
    డే క్రియ పిగ్గరి వచ్చె నాజికిన్,

పరులట హైందవుల్, నిగమ,
    వార్థిలు ధూనురు లెల్ల పట్టి కా
ఫరులట, విగ్రహార్చన ప
    పర్యలు పాపములంట, తానె నా
గరకత నేర్పునంట, కొర
    గాని కుతర్కము లుగ్గడించి యీ
పరుపు గ్రసించు నీచురక,
    వాహిని కడ్డిడు జోదు లేడు కో?

లేదపకారచింత, లవ,
    లేశము హైందవజాతి యెందు మ
ర్యాద నతిక్రమింప, దప
    రాధ మొనర్పది కెందుకీ మతో
న్మాద దురాగ్రహోను గతి,
    మారణ దారుణ కర్మకాండ? మా
మూదును పట్టుకొన్న ధన,
    మోహపిశాచము వీడలేదొకో?

ఎక్కడి సోమనాథపుర,
    మెక్కడిదా గజనీపురంబు? ఏ
డెక్కడ దాపురించె ధర,
    కెందిరకున్ సయితాను రీతి?- వే

రెక్కని పీనికిన్ దగిన,
    రీతి విదారణ హేతి ఘాతపుం
జక్కలి గింతతో సలిధి,
    సత్కృతి సల్పుఁడు కాలరుద్రుడై

రోసము గల్గి నేని ప్రతి,
    రోధవిరోధి వయాధినీ మహో
ద్వాపన మాచరించి, నిజ
    ధాత్రికళంకము బాపి, బోడిరా

కౌసుల మచ్ఛనావ్రుఁ డటు,
గానియెడన్ రణయజ్ఞవాటి వి
శ్వాసముతోడఁ జచ్చి, సుర
సద్మసుఖంబులు జూరగొండి కన్.

అనుచుఁ బురికొల్పికొని, నిరాస, లల్లద్రిప్పి,
కన్నుగవనుండి విస్ఫులిం, గములు గురియ
పురుష సింహంబులు ప్రతిజ్ఞఁబూనినారు
నగరరక్షణకై సోమ, నాథుఁ బ్రోల।

"శంభోశంకర ! సోమనాథపురవా,
హా ! పాహిమా"యటంచు, ని
ర్గంథ ప్రక్రియ సాగిలంబడుచు భ,
క్తశ్రేణికేలోడ్డి సం
రంభం బేర్పడ, కత్తిముట్టి సమర,
ప్రత్యుద్ధమా రంభ వి
స్రంభంబచ్చు పడంగ గైకొని ప్రతి,
జ్ఞల్, సాగి రొక్కుమ్మడిన్.

బిడ్డలఁ జిచ్చికొట్టి, తమ,
ప్రేయసులం గని బుజ్జగించి, క్రూ
వృద్ధ స్వమాతృదేవి చర,
ణద్వయమున్ స్పృశియించి మ్రొక్కి, పైఁ
ఖడ్గ చమూ సమూహ బల,
వద్భుజ దర్పతమాల పాళికిన్
గొడ్డలిపెట్టుగా యువని
కుంధకదంబము లేగ నాటికిన్

కేరుచు గీరగా మెల బి,
గించిన కాపెలఁ దొంగి చూచుకై
జారులు, ప్రక్కలన్ జెలికి,
జార్చిన ఖడ్గము, లంపసీములన్
తీరుగ వ్రేలు ఖేటము, లు
దీర్ఘరుచి ప్రథలుద్దిగొల్ప, శౌ
రీరము వీరగంధ పరి,
లేపితమై చనఁదోచి రెల్లరున్.

మెలువని మీసలన్ పుణికి,
ముట్టుచు, నోడుబిగించికొంచు, చూ
పులఁ జరు విస్ఫుకల్ గురియఁ,
బొంతెలఁ జేతులకందు నస్త్రముల్
దలకువఁ జాల్చి, శౌర్యరస,
దర్పితులై, వడి బాలురాహవ
స్థలికిని దూఁకి రాతురక,
దండులబెం డడగింప ధీరులై.

పోరటు ఘోరమై యురుచమూ
నివహంబుల ధూరివీర హుం
కారము దిక్కుటంబ గిరి
గహ్వరసీముల మారుమ్రోగ, ర
క్తారుణ కాయకాంతి విని,
ధాయుక దీప్తులు మేళవింప, సం
హారవృషు క్రియాచణ వి
హారము దారుణమయ్యె నంరటన్.

పోరున ధీరులా ధరల,
పుత్రులపాలి యదృష్టరేఖ తా
రాస్తమయిపోయె, వెంట్లసిగి,
రాల్ సలిలంబులఁ దేలిపోయె, దు
ర్వార పరాక్రమంబు గతి
రాము నిరర్థకమయ్యె మ్లేచ్ఛనా
సీరము సోమనాథపుర,
సింహ కవాటము జేరు పట్టునన్.

మోసమొ దోసమో జరిగి
పోయిన దాహవకేళి, దానికై
పీసము చింతలేదు, మారి,
విక్రమ లెందరో వీరధూమికై
లాసముగా శయింప రుధి,
రప్లవనీయ ధరాపిదండి లే
దీసడి, సోమనాథ నగ,
రేసుని రక్షణకే విచారమా !

గోచీపెట్టిన దాది శౌర్యరస ము,
ద్ఘోషించు సుశ్లోకిత
ప్రాచీనార్య కథా విన శ్రవణ సం,
ప్రాప్త ప్రతాపంబె నే
డాచారంబు స్వభావమై మిగిలె నీ,
యాబాల గోపాల ముం
దే చేతన్ దిగజార దీ గుణము బొం
దన్ జీవుఁ డున్నంతకున్.

ప్రోతస్స్రంధ్యల వెల్లకాల ముదధి,
వ్యగ్రోర్మికాజాల ను
స్నాతంబౌ నల సోమనాథ నగరీ,
సాధిష్ఠితోద్యన్మహో
జ్యోతిర్లింగము మ్లేచ్ఛనాయకుని స
ద్యో దృష్టికిన్ రాక నే
రీతి న్నిల్చ్పెటన్న సందియమె స
ర్వన్ భక్త హృత్పీఠములన్.

(సశేషము)

బాబు

శ్రీ ఆకుంది నారాయణమూర్తి

★

నిద్రమైకంనుంచి బయటపడి తలెత్తి పైకి చూసేడు. 'ఇకముందేం చేస్తావ'న్నట్లు ప్రత్యక్షమయింది కేలండరు. భయంకరంగా కనిపించిందా తేదీ!—ముందుకు చకచకా పోతున్న కాలం తనమీద కసితీర్చుకొనే సమయం ఆసన్నమయిందనుకున్నాడు ప్రకాశం. ఇంకా ఉద్యోగం చేసేందుకు కలవిలో ఓపికుంది. అవసరంకూడా ఉంది. కానీ తనలోని ఓపికనూ అవసరాన్నీ గుర్తించవలసిన ఆవశ్యకత ప్రభుత్వానికి లేదని అతనికి తెలుసు!—ఏమయినా సరే ఆరోజున తనను ఉద్యోగంలోంచి ప్రభుత్వం "రిటైరు" చెయ్యక తప్పదు. ఇకముందు తనగతి?—తను తప్ప ఇంకెవరూ లేని తన ఆశల కొడుకు భవిష్యత్తు?—ఏం చెయ్యాలో తోచని పరిస్థితిలో పడ్డాడు. ఎంత ఆలోచించినా భవిష్యత్ దారులు అగమ్యమయే యతనికి. పోనీ మరో పదేళ్లపాటయినా తనకా ఉద్యోగం ఉండినంటే అంతగా విచారించి ఉండేవాడు కాడు!—అప్పటికి కొద్దో గొప్పో కొడుక్కి చదువు చెప్పించుండేవాడు. ఏస్థిరాస్తీ లేకుండా కేవలం ఉద్యోగంమీదే ఆధారపడున్న తను, ఉద్యోగం లేకపోయిన తరువాత కనీసం స్కూలు ఫైనలు వరకైనా కొడుక్కి చెప్పించగలడా?!—ఒట్టిమాట!—పోనీ "ప్రావిడెంటు" ఫండయినా లావుగా వస్తుందా అంటే, అంతాకలసి వెయ్యిరూపాయలకు మించదు. ఆ వెయ్యిరూపాయలతోనూ ఎన్నాళ్లు కాలక్షేపం చేయడం?!—

ఆ తల్లితోపాటు వాడూ ఆ పురిటిలోనే చచ్చుంటే ఏబాధా లేకపోయేదనే కుళ్లు ఉద్దేశ్యాన్ని అతనిలో కల్పించిందా పరిస్థితి!—తనకు మరింత బాధ కల్గించడానికే వాడు బ్రతికున్నాడేమో అనుకున్నాడు ప్రకాశం!...

—కానీ మళ్ళీ బాగా ఆలోచించేడు. బ్రతికుండడమే వాడి తప్పుగా భావించకపోతే, వయస్సుమళ్లేక రెండో వివాహం చేసుకొని పిల్లణ్ని కనడం తన తప్పే అవెందుకనుకోకూడదనుకున్నాడు. కానీ ఆ రోజుల్లో అంటే, మొదటిభార్య పోయినతరువాత కొన్నాళ్లకి తనలో ఏర్పడ్డ ఉద్రేకాలవల్లా, ఇంట్లో తనకు వండిపెట్టే అందుకుకూడా ఎవ్వరూ లేకపోవడంవల్లా పెళ్లి చేసుకోవడం అవసరమనిపించింది!—మొదటిభార్య కూతురు రమణమ్మ 'పెళ్ళీవయస్సులో చేసుకోవద్ద'ని ఎంతచెప్పినా వినకుండా ఓ సుభముహూర్తాన తాళికట్టేసేడు. పిల్లణ్ని కని తన కప్పు చెప్పి హాయిగా చచ్చిపోయిందది!

కన్న మమకారాన్ని ఎలా చంపుకోవడం?—వాడిని బాగుచెయ్యాలి. వాడు బ్రతికి బాగుంటే చూచి ఆనందించాలి తను!—కాని వాడు బ్రతికి బాగుండడం ఎలా?—బడిపంతులుపనయితేనేం?! —ఏదో ఉద్యోగం అంటూ ఓటుంది గనక వాడిని అంతవరకూ అయినా పెంచగలిగేడు తను!...'ఇక ఆపైని?—గడ్డుసమస్యగా ప్రత్యక్షమయింది భవిష్యత్తు!...అంతులేని ఆలోచనలో పడ్డాడు ప్రకాశం!—

అంతట్లో వీధిసమ్మంలోంచి కొడుకు పరిగెత్తుకొచ్చి—"బడి కందరూ పోతున్నారు నాన్నా!—నాకు వేగిరం చద్దన్నం పెట్టు!" అన్నాడు.

"ఇవాళ్టికి మవ్వే పెట్టేసుకొని తినేయ కూడదూ?" అన్నాడు ప్రకాశం చుట్ట అంటిస్తూ.

"ఆ గూడు నా కందదు నాన్నా!—ఎలా కుండ క్రిందకు దించడం?" తన చేతకానితనాన్ని వ్యక్తపరుస్తూ అన్నాడు బాబు.

ఔను! తనకు కావలసినవి సంగ్రహించుకో లేని చిన్న వయస్సులో తన కొడుకు ఇంకా ఉన్నాడు. తనమర్చిపెట్టాలి. తనే లేకపోతే?!...అతని హృదయం త్రుళ్ళిపడింది. "సరే! పెడతాలే!—పళ్లెం కడిగి తెచ్చుకో!" అన్నాడు మంచంమీంచి క్రిందికి దిగుతూ.

"పళ్లెం ఎక్కడుంది నాన్నా!"

"వంటింట్లో మంచినీళ్ల కుదురువారుంటుంది బాబూ!" అన్నాడు.

బాబు వంటింటిలోకి పరుగెత్తేడు. కుదురు వారున్న పళ్లేన్ని పట్టుకొచ్చేడు. "ఇదుగో పళ్లెం!" అన్నాడు.

"పెరట్లోకి పోయి కడిగి తెచ్చుకొని వేసుకో!" అన్నాడు ప్రకాశం అటకదగ్గరున్న నిచ్చెన ఎక్కుతూ.

"అట కెందుకెక్కుతున్నావు నాన్నా!—నన్నూ ఎక్కించవూ?" అనడిగేడు బాబు.

"ఇంత మీదికెక్కితే కళ్లు తిరుగుతాయి తెలుసా!—పెద్దవాడివయితే ఎక్కొచ్చు." అన్నాడు.

"మరలా అయితే వెల్లుల్లిపాయలు లావుగా తియ్యి!" అని గునుస్తూ చెప్పి పెరట్లోకెళ్లిపోయేడు పళ్లెం కడుక్కొనే అందుకు.

మీదికి పోవాలనే అభిలాషతో ఉన్న బాబుని అధఃపాతాళంలో ఉంచేయడమేనా? ఎంతో ముద్దుగా పెరుగుతున్న బాబుని ఓ కష్టజీవిగా తయారు చెయ్యడమేనా? ఎందుకూ పనికిరాని వ్యక్తుల జాబితాలోకి చేర్చడమేనా?...—ఆ ఆలోచనలలో పడి బాబు కోరిన వెల్లుల్లిపాయలు తియ్యడం మరచిపోయి ఒట్టి అవకాయమాత్రం పట్టుకొని దిగిపోయేడు ప్రకాశం.

అప్పటికింకా బాబు పళ్లెం పట్టుకొని రాలేదు. ఇంకా ఎంచేత రాలేదా అని పెరట్లోకి వెళ్లేడు ప్రకాశం. బాబు నూతిదగ్గర నిలబడి లోపలికి చూస్తున్నాడు.

"ఏం బాబూ అలా నిలబడ్డావు?" అనడిగేడు ప్రకాశం.

"గోలెంలో నీళ్లులేవు నాన్నా. నూతిలో ఉన్నాయి. నే తోడలేను."

అట్టడుగున ఉన్నవాటిని బైటికి తీసుకొనే అంతటి శక్తి బాబుకు వచ్చేవరకూ తను పెంచాలి. ఎలా?—నీళ్లు తోడేడు. తనే పళ్లెం కడిగేడు. "రా లోపలకి." అన్నాడు.

పీటవేసి పళ్లెం వేసేడు. ఉప్పూ వామూ వేసేడు. చల్దిగూడు దగ్గరకెళ్లి కుండదించేడు. అన్నం వడ్డించబోతూ ఉంటే అందులో ప్రత్యక్షమయింది చచ్చిపోయిన పాలెపురుగు!—"నయం!—గుడ్డిగా వడ్డించేసేను కాదు. లేకపోతే......" అని తండ్రి అంటూ ఉండగానే కొడుకు అందుకొని—

—"ఏం నాన్నా?!" అనడిగేడు ఆశ్చర్యంతో.

"చూసేవా పాలెపురుగు?!—మహా విషం!—లే!—ఇవాళ్టికి హోటల్లో టిఫిను తిందువుగాని." అన్నాడు.

ఆకల్తో ఉన్న బాబు అన్నం తినకుండానే లేచిపోయేడు. కాని ఆ ఆకలిబాధ హోటలు కెళతాం కదా అనే సరదాలో కొంత లోపించింది.

తండ్రి పొందుతున్న మనోవ్యాకులత బాబుకేం తెలుసు?!—ఆ దిన ప్రారంభంలోనే ఓ అపశకునం!—తనొడ్డించబట్టిగానీ, బాబే ఆ అన్నం పెట్టేసుకొనుంటే ఏమయ్యుండేవాడు?!—వచ్చే ప్రమాదాన్ని గుర్తించలేనంతటి చిన్న వయస్సు. ఉద్యోగం లేకపోతే నేం?—ఇంకా తను బాబుకోసం ఎలా అయినా బ్రతికుండా లనుకున్నాడు.

చినిగిన లాల్చీ తొడుక్కున్నాడు ప్రకాశం. ఆ తొడగడంలో మరింత చిరిగిపోయిందా లాల్చీ!—బాబా సంగతి చూసేడు. "నాన్నా! వడ్డిమీద బాగా చిరిగిపోయింది చొక్కా!—కుట్టించకూడదూ?" అనన్నాడు.

"అలాగే!" అని మాత్రం అన్నాడు బాబుతో!—ఇంకొన్నాళ్లలో లాల్చీలు చిరగడం, వాటిని కుట్టించడం అనే బాధే ఉండదు. లాల్చీ అంటూ ఓటున్నప్పుడు కదా అది చిరగడం, దాని కతుకు లేయించి కుట్టించడం ఆ బాధంతాను!...అప్పుడు జీవితంలో బాహ్యంగా కనిపించని ఓ చిరుగు మాత్రం ఉంటుం దనుకున్నాడు.

బాబు పుస్తకాలు సర్దుకోడం పూర్తయింది. గుమ్మం దగ్గరకొచ్చేడు. మళ్ళీ వెనక్కి తిరిగి తాళాల కోసం వెతుకుతున్న తండ్రిదగ్గరకొచ్చి—"నాన్నా

ఈ ఏడాది పాసయితే మళ్ళీ ఏడాది నీ క్లాసుకొస్తాను కదూ?" అనడిగేడు.

ఏమని సమాధాన మివ్వాలో అర్థంకాలేదు ప్రకాశానికి. "సరేగానీ, తాళాలు కనిపించడంలేదు. మంచంక్రింద పడిపోయేయేమో చూడు." అన్నాడు.

బాబు మంచంక్రిందకి దూరేడు. "ఇవిగో నాన్నా!" అని అంటూ తాళాలను గలగలా ఆడిస్తూ బయటకు వచ్చేడు.

—ఏదో పెద్ద ఘనకార్యం సాధించినవాడిలా తాళాలు పట్టుకొని ఘనంగా నిలబడ్డ బాబు ముఖంలోకి చూసేడు ప్రకాశం. అతని కళ్ళల్లో నీళ్లు తిరిగేయి. "పద స్కూలుకి పోదాం." అన్నాడు గిరుక్కున వెనక్కు తిరిగి.

తలుపులు వేస్తూఉన్నప్పుడు తలంపు కొచ్చిందా లేదీ!—కేలండరువేపు చూసేడు. తనవేపు చూసి వెఱ్ఱిగా వెక్కిరించినట్లనిపించిందా లేదీ!—అటు మరి చూడలేకపోయేడు. తలుపులేసి తాళం వేసేసినా తలంపులొంచిపోలేదా లేదీ!—బయలుదేరేడు.

గొడు గవసరం అంతగా అప్పట్లో లేదుగానీ; చినుకులుమాత్రం కొంచెం పడుతున్నాయి. క్రింద బురదా; మీదనుంచి చిటచిటమని చినుకులూ!—బాధగాఉన్నా భరిస్తూ ముందు కడుగులు వేస్తున్నారా తండ్రీ కొడుకు లిద్దరూ.

బడికిపోయే విద్యార్థుల సంఖ్య చాలా పలచగా ఉండడంచేత—అప్పటికప్పుడే బడివేళయి పోయుంటుందని ఊహించేడు ప్రకాశం.

"నాన్నా ఇవాళ బడికి మనం ఆలస్యంగా వెళుతున్నాంకదూ?" అనడిగేడు బాబు.

'ఔను!—నిన్ను కనడంకూడా ఆలస్యంగానే జరిగిం దందామనుకున్నాడు. బాబుతో అలా అనడం తెలివితక్కువతన మనిపించి—"పద గబగబా!" అని మాత్రం అన్నాడు. చిన్న చిన్న అంగలేసుకుంటూ బాబు తండ్రితో సమానంగా పోతున్నాడు.

అప్పుడు సరిగ్గా ఆవూళ్లో క్రొత్తగా పెట్టిన హైస్కూలుప్రక్కనుంచి పోతున్నారు. సరిగ్గా హైస్కూలు గేటుదగ్గర కొచ్చేసరికి బాబు తమాషా అయిన ప్రశ్న అడిగేడు. "ఈ పెద్దబడిలో నన్నెప్పుడు చదివిస్తావునాన్నా?" అని.

"నువ్వు చక్కా అయిదోక్లాసు పాసయితే అప్పుడు!" అన్నాడు తండ్రి.

"అప్పుడు మరి నువ్వూ ఈబడిలోకే పనిచెయ్యడానికొస్తావా?!" అనడిగేడు తండ్రిముఖంలోకి చూస్తూ.

బాబు అమాయకంగా అడిగిన ఆ ప్రశ్న అతనిలో కల్లోలాన్ని లేపింది. తన జీవితంలో ఉద్యోగపర్వం అదివంతో సమాప్తమవుతున్నట్లు బాబుకేం తెలుసనుకున్నాడు. లోకం అంటే ఏమిటో తెలీని బాబు ఎన్నెన్నో ఊహల్ని సృష్టించుకుంటున్నాడు. వయస్సు హెచ్చవుతున్న కొద్దీ ఊహించిన ఒక్కొక్క ఊహ ఊహించలేనంతలో క్రిందికి పడిపోతున్నప్పుడు బాబుహృదయం ఎలా బాధపడుతుందో!—ఊహించడానికి భయం వేసింది ప్రకాశానికి. భవిష్యత్తు భయంకరంగా ప్రత్యక్షమయింది.

స్కూలు దగ్గిర పడింది. "నాన్నా కాఫీ హోటలుకి వెళదాం అన్నావు?" అన్నాడు బాబు.

"అయ్యో! — నామతి మండా! — మరిచిపోయేను—" అని మళ్ళీ వెనక్కు తిరిగి "విశ్వేశ్వర" హోటలులోకి తీసుకెళ్లేడు బాబుని. జేబులు తడువుకున్నాడు. ఫరవాలేదు. నిబ్బరంగా తినగలిగినంత టిఫిన్ తిన్నా రిద్దరూ. బిల్లు చెల్లించి బయటపడ్డా రిద్దరూ—

పాఠశాల ఆవరణలోకి అడుగు పెట్టే రిద్దరూ!—మెట్లెక్కుతూ ఉంటే కాళ్లు తడబడ్డాయి ప్రకాశానికి. వణుకుతూఉన్న కంఠంతో బాబుతో అన్నాడు. "నాయనా నీక్లాసుకి నువ్వెళ్ళిపో!" అని. బాబెళ్లిపోయేడు.

సంతకం పెట్టడానికని హెడ్మాష్టరి గదిలోకి వెళ్లేడు ప్రకాశం.

"ఏంమాష్టారూ!—ఇవాళ ఇంత ఆలస్యంగా వచ్చేరు. ఎలాగూ ఈబడితో ఇక సంబంధం తీరిపోతుందనా?" అనడిగేడు హెడ్మాష్టరు.

"అబ్బే!—లేవడం కొంచెం ఆలస్యంఅయింది"

"సరే!—సంతకంపెట్టి క్లాసులోకి వెళ్లండి. ఆఖరు పిరియడుఅయేక రిలీవు చేసేస్తాను. మధ్యాహ్నం స్కూలు లేదుగా మరి!" అన్నాడు.

చాలా కఠోరంగా వినిపించాయా మాటలు ప్రకాశానికి. కానీ ఏంచేస్తాడు? ఆవిషయంలో ఆ హెడ్మాష్టరు చేసే నేరం ఏముంది?—అతని విధి అతను నిర్వహించుకుంటున్నాడు. సంతకం చెయ్యడానికి పెన్ను తీసేడు. చెయ్యి ఒణికింది. ఏదో గొలికేసేడు.

క్లాసులోకి వెళ్లేడన్న మాటేగానీ ప్రకాశం మనస్సు మనస్సులో లేదు. ఒకటో గంట వినిపించింది. అతని గుండె జల్లుమంది. మరి గంటలు కొట్టకుండా ఉన్నా బాగుండు ననిపించింది. కానీ అవాళ కాలం చాలా వేగంగా పయనిస్తున్న ట్లనిపించింది ప్రకాశానికి.

రెండూ, మూడూ గంటలుకూడా పూర్తయేయి. ఆఖరిగంట సమీపించింది. ఆ వేదన ఎక్కువయింది ప్రకాశంలో!— అదీ పూర్తయింది. తడబడుతున్న అడుగులతో హెడ్మాష్టరుగదిలోకి ప్రవేశించేడు.

అప్పటికప్పుడే సంతకం మినహా తక్కిన తంతంతా పూర్తిచేసేసుంచేసేడు ప్రకాశాన్ని రిటైరు చెయ్యడానికి.

“మిమ్మల్ని రిటైరు చెయ్యడం చాలా బాధగా ఉంది. ఈ పాపిష్టి చేతులతో చేస్తున్నా! — ఏం చెయ్యడం మరి!” అని సానుభూతి తెలియజేసేడు.

మిగతా సహోపాధ్యాయులుకూడా తమతమ సానుభూతుల్ని తెలియజేసేరు.

“మీరింకా ఈ ఊళ్లోనే ఉంటారు కదూ? చెక్కొచ్చినవెంటనే కబురంపిస్తాను. ఈనెల ఇంతవరకూ రావలసిన జీతాన్ని తీసుకుందురుగాని!” అన్నాడు హెడ్మాష్టరు. ప్రకాశం సంతకం చేసేడు. ఇక అయిపోయింది ఉద్యోగం ఆనాటితో!—

“వస్తా, ఇంకా ఇంటికి పోయి వంటచేసుకోవాలి. దయ ఉంచండి. ఏదో ఇన్నాళ్లూ నన్నెంతో అభిమానంతో చూసేరు. అందుకు నా కృతజ్ఞతాపూర్వక అభివందనాలు” అని కుర్చీలోంచి లేచేడు. మిగతా సహోపాధ్యాయులందరికీ వందనాలర్పించి ఆఫీసు గదిని దాటేడు. గేటుదగ్గర తనకోసం కాచుకూర్చున్న బాబుని కలసేడు.

“అంతసేపటి క్రిందట గంట కొడితే, ఇప్పటివరకూ ఏంచేస్తున్నావు నాన్నా?—” అనడిగేడు.

“ఏంలేదు బాబూ! — హెడ్మాష్టరిగారితో మాట్లాడుతున్నా” అన్నాడు.

ఆకలిబాధ ఎక్కువగా ఉండేమో దారిలో మరి బాబేం మాట్లాడలేదు. మాట్లాడే పరిస్థితిలో లేడు ప్రకాశం. ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు.

బాబు కొంతసేపు ఇటూ అటూ తిరిగి ఎక్కాల బుక్కు తీసేడు.

ప్రకాశం నడుం వాల్చేడు బల్ల మంచంమీద. కొంతసేపయినా ప్రపంచాన్ని మరచి నిద్రపోదామని అతని ప్రయత్నం. కానీ భయంకరమయిన లోకంలో కంటకావృతమయిన భవిష్యత్ దారులు ప్రత్యక్షమయేయి. నిద్ర పట్టలేదు.

అంతట్లో అకస్మాత్తుగా అనుకోకుండా ఒచ్చిపడిందో వైరు మొదటిభార్య కూతురయిన రమణమ్మ దగ్గరనుంచి!—భర్తకు చాలా సుస్తీగా ఉన్నట్లూ వెంటనే బయలుదేరిరమ్మనమని. ప్రశాంతంగా జీవితం గడుపుతున్న కూతురి సంసారంలో ఒచ్చిపడ్డ విపత్తు అతనికి మరింత బాధ కలిగించింది.

ప్రకాశం రెండోవివాహం చేసుకున్నాక రమణమ్మ ఓసారయినా రాలేదు సరికదా, రెండు ఉత్తరాలు తప్పిస్తే మరి రాయలేదు తనెన్నిసార్లు రాసినప్పటికీ!— పెళ్ళికి రాలేకపోయినందుకొకటీ; సవతితల్లి చచ్చిపోయేక సానుభూతి ఉత్తరం ఓటిన్నూ!

తను రెండో వివాహం చేసుకున్నాక కట్టుకట్టి ఒక్కమారయినా, కూతురు రాకపోయినప్పటికీ ఆకష్టసమయంలో తను వెళ్లక తప్పదనుకున్నాడు. భర్త తరఫున ఆమె కెవ్వరూ లేనేలేరు. ఇక ఆమెకు మిగిలిన ఆత్మీయుడు తనొక్కడే!— మొదటి భార్య కూతురు; రెండో భార్య కొడుకూ అనే భేదం మినహా ఇస్తే ఇద్దరూ తనకొక్కలాంటి అపత్యాలే! — ఎవరిని తను ద్వేషించడం?—

కానీ విశేషం ఏమిటీ అంటే, తను పునర్వివాహం చేసుకోడంవల్ల కూతురిదృష్టిలో తను నేరస్తుడయిపోయేడు! — ఏదో ఆమె అదృష్టం బాగుండి బాగా డబ్బున్న భర్త లభ్యం అవడంవల్ల, కొత్త గర్వం అహంభావం హెచ్చయాయి. పైగా అత్తగారివంక వాళ్లెవరూ అడ్డుగా లేరు! — అదే ఏ బీదకొంపలో నయినా ఉంటూఉన్నట్లయితే ఇంతగా తనను ద్వేషించుండేది కాదేమో అనుకున్నాడు. ఓ సంబంధంవల్ల తనంటే ఆమె కభిమానం, ఇంకో సంబంధంవల్ల తనంటె జుగుప్సా ఆమెలో ఏర్పడ్డాయనుకున్నాడు.

మొత్తాని కెలా అయితేనేం, కూతురికి తనమీద ఏరకంభావం ఉన్నప్పటికీ ఆసమయంలో తవెళ్లక తప్పదనుకున్నాడు. “బాబూ! ఇలారా!—” అని పిలిచేడు.

బాబొచ్చేడు. “చూడు నాయనా! — నీబట్ట లెక్కడెక్క డున్నాయో వెతికి తీసుకురా! — అక్కయ్యగారూరు వెళదాం!” అన్నాడు ప్రకాశం.

“‘అక్కయ్య, అక్కయ్య’ అని అంటూ ఉంటావుకదా, అక్కయ్య ఎలాగుంటుంది నాన్నా!—

కిష్టిగాడూ వాళ్ళ అక్కయ్యలా నుంటుందేంటి?" అనడిగేడు.

"కిష్టిగాడూ వాళ్ళ అక్కయ్యకన్నా చాలా పెద్దది. నీఅంత కొడుకుకూడా ఉన్నాడక్కయ్యకి. చక్కా నవ్వు వాడూ అనుకోవొద్దు!"

"అయితే వెళదాం నాన్నా! — రైలుమీదా, బస్సుమీదా?"

"రైలుమీదే వెళ్ళాలి. చాలాదూరం వాళ్లూరు!"

"నేరైలు ఒక్కమారూ ఎక్కలేదు. వెళదాం నాన్నా. అయితే నాన్నా!... అక్కయ్య మనూరు ఓమారూ రాలేదేం?"

ఏమని సమాధానం ఇవ్వడం?! — బాబే లేక పోయుంటే ఒప్పుండేదేమో! — "మరి వాళ్లూరు చాలా దూరంకదూ! — అందుకు!" అని సమాధాన మిచ్చేడు.

"మరయితే కిష్టిగా డక్కయ్య ఎప్పుడూ వస్తా ఉంటుందేం?!"

బాబుగా డడిగే ప్రశ్నలు విసుగునీ దుఃఖాన్నీ ప్రకాశానికి కలుగజేసేయి. అందుకు మరి సమాధాన మివ్వలేదు. "సరేగానీ, ముందు నీ బట్టలన్నీ వెతికి తీసుకురా. పెట్టెలో సర్దుతాను." అన్నాడు.

"అయితే మనం అక్కడెన్నాళ్లుంటాం నాన్నా?"

"బావకి జబ్బుగా ఉందిట! — అది తగ్గిపోయేక వచ్చేస్తాం మళ్ళీ!"

"బావెలా ఉంటాడు నాన్నా?"

"బాగుంటాడు! — వస్తున్నాంగా! — చూద్దువు గాని. మొదట నీ బట్టలన్నీ వెతికి తీసుకురా?" అన్నాడు పెట్టె తెరుస్తూ.

బాబు పరుపుదగ్గర కెళ్లేడు. అందుమీదున్న తన రెండు చొక్కాలూ పట్టుకొచ్చేడు. "మిగిలినవి దండెంమీదున్నాయి. నా కందవవి!" అన్నాడు.

"సరే! — నీ పుస్తకాలన్నీ సర్ది పట్రా; అక్కడున్నన్నాళ్ళూ చదువుకుందువుగాని!" అన్నాడు.

కొంతసేపయింది. సర్దడం పూర్తయింది. పర్సు తెరచి చూసేడు. నలభైఒక్క రూపాయీ నాలుగణాల అర్ధణా ఉంది. ఆ నెలజీతం, ప్రావిడెంటు ఫండూ ఒచ్చేవరకూ అతనికున్న ఆస్తంతా అదే! — ఎలా కాలక్షేపం చెయ్యడమో అర్థంకాలే దతనికి! —

దారి ఖర్చులు మినహాయిస్తే కూతురింట్లో తనకి భోజనప్రఖర్చుండదు. ఇక తన దుబ్బలకిమాత్రం కొంత ఖర్చవుతుంది. అంతే! — తిరిగొచ్చేటప్పుడు కూతురు దారిఖర్చులకయినా డబ్బివ్వదా ఏమిటి?! — కానీ ముందుముందు ?? ఆ విషయంగురించి ఆలోచిస్తూ ఉండగా — "నాన్నా! — మనం అన్నం తినేసి బయలుదేరుదామా, తినకుండా బయలుదేరుదామా?" అనడిగేడు బాబు.

"తినేసే బయలుదేరుదాం. రైలులో రెండు రోజులపాటు ప్రయాణం చెయ్యాలి మనం."

"అయితే రైలులో మన కాకలేస్తేనో!"

"ఏదో ఫలహారం కొనుక్కుతిందాం!"

"అక్కడ అమ్ముతారేంటి నాన్నా?"

"ఓ! — నీకొక్క వలసినవి కొంటాను" అంటూ వంటింటిలోకెళ్ళేడు. పొయ్యి రాజేసేందుకు.

అన్నం వండేడు. తిన్నారిద్దరూ. కూలివాడిని మాట్లాడేడు. సామాను వాడి నెత్తిమీద కెక్కించేడు. కేలండరు వేపు చూడకుండానే తలుపువేసి తాళం వేసేసేడు. బయలుదేరేరిద్దరూ!

2

వీధి మలుపు తిరిగేసరికి అల్లుడి ఇల్లు ఓ ఫర్లాంగు దూరంలో కనిపించింది. గుమ్మంముందు కొంతమంది జనం మూగుండడంచేత ప్రకాశంలో ఆందోళన హెచ్చయింది.

"ఇంకా చాలాదూరం ఉందికదూ అక్కయ్యగారిల్లు?!" అనడిగేడు బాబు. అలా అడగడంలో బాబుద్దేశ్యం ఏమిటో అంటే, అలా ఇంకా చాలా దూరం అక్కయ్యగారిల్లు ఉంటే, చాలాసేపు సరదాగా రిక్షాలో కూర్చోవచ్చుకదా అని! — కానీ బాబు సరదా మాయమయిపోయేటట్టు — "ఇదుగో వచ్చేసేం! — ఇంకెంతో దూరంలేదు. ఆ మనుష్యులు మూగున్నారే అక్కడే!" అని సమాధాన మిచ్చేడు ప్రకాశం.

రిక్షా ఆ ఇంటిదగ్గరకు చేరుతున్నకొద్దీ ప్రకాశంలో ఆందోళన హెచ్చుకావడం మొదలెట్టింది.

బాబులోనూ ఆందోళన లేచింది — "అమ్మో! — ఇంత వేగిరం రిక్షా దిగిపోవడమేనా?" అని.

ఇంటిముందు రిక్షా ఆగింది. తండ్రీ కొడుకు లిద్దరూ దిగేరు. రిక్షాలోంచి సామాను దింపడం,

లోపల మంచంమీంచి శవాన్ని దించడం ఒక్కమారే జరిగింది. ఘొల్లున ఏడుపులు వినిపించేయి. ప్రకాశం లోపలకు పరిగెత్తేడు. ఇంకేం ఉంది?!—పూర్తిగా దించేసేరు క్రిందకి!—

గుండెలు బాదుకుంటూ బావురుమని ఏడుస్తున్న కూతురిముఖంలోకి కన్నీరు కారుస్తూ చూసేడు ప్రకాశం.

"నాన్నా!-అంతా అయిపోయేక వచ్చేవా?!" అంటూ భర్త గుండెలమీద ముఖంపెట్టి కన్నీళ్ళు కార్చింది కూతురు.

—"ఇంక నా కెవరు దిక్కు నాన్నా!—ఈ చంటివాడిని చూడు నాన్నా!—ఇంక వీడు "నాన్నా" అని ఎవర్ని పిలుస్తాడు?!—అయ్యో నాయినా! ఎంత పనయింది నాయినా!...... .." ఆమె ఏడుపుకి మరి ఆనకట్టు లేదు. అదే ధోరణి!—

"ఇంత చిన్న వయస్సులోనే......ఇంతకీ ఇదంతా మన దురదృష్టం!—ఆ భగవంతుడు......" పూర్తిచెయ్యలేక పోయేడా వాక్యాన్ని. కన్నీళ్ళొత్తుకున్నాడు. "ఆఖరిసారిగా అల్లుడితో మాట్లాడలేక పోయేను. ఇలా అవుతుందని అనుకోలేదమ్మా!—ఈ ప్రపంచంలో......" ఇంకా ఆ వాక్యం పూర్తవకుండానే జనకను నిలబడున్న బాబు—"నాన్నా! నా కిక్కడ భయంగా ఉంది. మనం వేగిరం పోదాం రా నాన్నా!" అన్నాడు.

రవణమ్మ బాబువేపు తలెత్తి చూసింది. దుఃఖంలో దుఃఖం కలిసిపోయింది!!!

తండ్రిని ఏదో అడుగుదామని బాబు నోరు తెరచేడు. కానీ అంతమంది మధ్య ఆ వాతావరణంలో అడగడానికి భయపడ్డాడు. ఈ అనంతమయిన జగత్తులో చావుపుట్టుకల అంతర్యం, మనిషికీ మనిషికీ గల సంబంధాల సన్నిహితత్వం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో తెలీని బాబుకా పరిస్థితంతా భయానకమయింది. ఇంకా అక్కడే కాలం ఉంటే ఏం ప్రమాదమొస్తుందో అని భయం వేసింది!—కానీ తండ్రి తన భయాన్ని తెలుసుకోలేని పరిస్థితిలో ఉన్నాడని బాబు గుర్తించేడు. తండ్రి కళ్లంట నీళ్లు కారుస్తూ ఏడ్వడం చూసి తనూ బావురుమన్నాడు. ఎందు కేడవాలో బాబు కంతగా బోధపడలేదు గానీ తండ్రి ఏడుస్తున్నాడు గనక, అసలు ఆ దృశ్యమంతా ఏడుపుల మయమయింది గనక తనూ ఏడ్చేడు!—

పచ్చిబద్దల పల్లకీ తయారయింది. కర్మకాండ పూర్తయింది. రవణమ్మ తెలివి తప్పిపోయింది. అదే సమయమని శవాన్ని భుజాల కెత్తుకున్నారు మోతగాండ్రు.

రవణమ్మకు తెలివొచ్చేసరికి భర్తశవం మరక్కడ లేదు. బాబు మాత్రం కళ్లెదుట పడ్డాడు. ఆ ప్రక్క నిలబడున్నా డామె కొడుకు వానిగాడు. "నాన్న నెక్కడికి తీసుకెళిపోతున్నార?"ని వాని ఏడుస్తూ అడిగేడు బాబుని. కొడు కడిగిన ఆ ప్రశ్న విని మళ్ళీ తెలివి తప్పిపోయింది రవణమ్మ.

3

పన్నెండు రోజులూ గడిచేయి!—"ఇంక నే వెళిపోతానమ్మా!" అన్నాడు ప్రకాశం కూతురితో

"ఎక్కడికి నాన్నా?" అనడిగింది రవణమ్మ.

ఎక్కడికా అనే సంశయం ప్రకాశానికి కలిగింది. ఎక్కడికి వెళిపోతే మాత్రం తనకేముంది గనక!—ఉద్యోగమా ఏమన్నానా?!—

—ప్రకాశం ఇంకా ఏ సమాధానం ఇవ్వకముందే—"నీ కక్కడ ఉద్యోగం అయిపోయిందిగా!" అంది.

"ఔను!— అక్కడి పని పూర్తయింది. కానీ—"

"మరయితే అక్కడి కెందుకూ?!"

"ఏమీలేదూ; ఏదయినా ప్రయివేట్లు చెప్పుకొని జీవితం గడపొచ్చు కదా అని!—"

"ఆ బాధంతా ఎందుకు?—ఇంక నా కెవరున్నారు గనక!—ఇక్కడే ఉండిపో నాన్నా. ఈ పసివాడితో ఏ వెనకదిక్కూ లేకుండా ఒక్క దాన్నీ ఎలా బ్రతకడం చెప్పు?" అని కొడుకు వానిగాడి తలమీద నిమురుతూ కన్నీరు కార్చింది రవణమ్మ.

అదీ నిజమే అనుకున్నాడు ప్రకాశం. అల్లుడు బ్రతికున్నట్లయితే తన అవసరం కూతురి కంతగా లేక పోయేది. అశక్తి పరసహాయాన్ని ఆశిస్తుంది!—ఆకారణంచేతే కూతురు తనని ఉండిపొమ్మంటున్నదనుకున్నాడు!—మరే ఇతర ఆస్కారం జీవనోపాధికి లేని తండ్రిని అలా చూస్తూ పొమ్మనే అందుకు ప్రేమానుబంధం అటంకమవడంవల్ల అలా ఉండి

పొమ్మంటావని ఎందు కనుకోకూడదని కూడా అనుకున్నాడు.

మొత్తానికి, ఉద్యోగంతో ఉండిపొమ్మన్నప్పటికీ, అక్కడ తను శాశ్వతంగా తిష్ఠవెయ్యడంవల్ల ఏవయినా వికృత సమస్యలు ఉత్పన్న మవుతాయేమో అనే భయం వేసిం దతనికి. తనొక్కడూ ఉండిపోయినట్లయితే ఏ వికృతసమస్యలూ ఉత్పన్నం కావు!—కానీ తనతోపాటు బాబుకూడా ఉండిపోయినప్పుడే గొడవ!—ఎలా?!—బాబు నెక్కడ ఉంచడం?—తనతోపాటే బాబుండాలి!—అయితే ఎక్కడుండడం?—ఎవ్వరికీ బాధ కలగనిచోట!—ఆ చోటెక్కడ?—అర్థమయింది కాదు ప్రకాశానికి!...

"ఇంతగా ఆలోచించాలా నాన్నా!—అక్కడ నువ్వు లేకపోతే మన ఇళ్ళూ వాకిళ్ళూ ధూళిలా పోతాయని భయమా?—ఇంతకీ నిన్నుండి పొమ్మంటున్నది నీ కూతురు!—మరేం పరాయిది కాదు!—ఆయన శాశ్వతంగా వెళ్ళిపోయేరు. నువ్వు బ్రతికుండీ కూడా నాకు దూరంగా వెళిపోతావా నాన్నా" అని బావురుమంది రమణమ్మ.

"అలాగే లే అమ్మా!—ఉంటాను!" అన్నాడు ప్రకాశం బరువుగా ఓ నిట్టూర్పు విడుస్తూ.

"తాతయ్యా!—నువ్వు చక్కా ఇక్కడే ఉండిపోతావుకదూ!—మరి వెళ్ళకేం?! మరి నాన్న రాలేదు చూడు." అన్నా డమాయకంగా మనుమడు నానిగాడు.

"నాయనా!" అంటూ నానిగాడిని ఎత్తుకుంటూ కన్నీరు కార్చేడు ప్రకాశం. రమణమ్మ కొంగుతో కన్నీళ్లొత్తుకొంది.

"అయితే నాన్నా!—మనం మరి మనూరు పోమా?" అని ఆందోళనతో అడిగేడు బాబు. ఎంచేతో అక్కడుండడం బాధనిపించింది బాబుకి. వచ్చినదగ్గరనుంచీ ఏడుపులూ మొట్టుల తోనే నిండిపోయిందా ఇల్లు. ఇక అక్కయ్య తనను చేరదీసి ఆదరించడం లేనేలేదు. పైగా తండ్రి కూడా అదోలా గున్నాడు. అదంతా ఓ అసహ్యకరమయిన వాతావరణంగా అనుపించింది బాబుకి. అక్కడుండడం చాలా బాధనిపించింది. ఎంతవేగిరం అక్కణ్ణుంచిపోతే అంతబాగుండు ననిపించింది బాబుకి!—

—బాబలా వచ్చినదగ్గరనుంచీ 'పోదాం పోదాం' అని అంటూఉండడం వింటూనే ఉంది రమణమ్మ. ఆమెకు ఓ ప్రక్కనుంచి కోపం, మరో ప్రక్కనుంచి దుఃఖంకూడా వచ్చేయి!—ఆ పోయేవాడు అతనితో పాటేపోయుంటే బాగుండిపోయే దనుకుంది!—"ఎక్కడికిరా పోతవు?!—వచ్చిన దగ్గరనుంచీ "పోదాం నాన్నా!" అంటూ ఒకటే గొడవ!" అని గట్టిగా కసిరిపట్టింది రమణమ్మ.

రమణమ్మ అలా అనడంతోనే బాబు భయంతో అదోలా ముఖం పెట్టేసేడు. పైకి ఏడవలేదుగానీ లోపల్లోపల ఏడ్చేడు!—

"వీడి నెలా చూస్తావో మరి!—తల్లీ తండ్రీ నేనేఅయి ఇంతవరకూ పెంచేను. ఆఖరికి వీడివల్ల నాకు దుఃఖమే మిగులుతుందో, సంతోషమే మిగులుతుందో!—ఆబాధ్యత నీలోనే ఉంది." అన్నాడు ప్రకాశం బాబుని ముందుకి తీసుకొని తలమీద నిమురుతూ.

రమణమ్మ ఆవిషయమై మరేమీ అనలేదు. మాటలు మారుస్తూ—"నాన్నా!—ఈ నానిగాడు ఒక్కపేపరయినా చదవకుండా ఉన్నాడు. వీడికి చదువుమీద శ్రద్ధ కలిగించే పూచీ నీకే!" అంది.

"చిన్నపిల్లడుకదమ్మా మరి!—ఒక్క నెలరోజులలో మీ తమ్ముడితో సమానంగా చదివేస్తాడు!—ఏరా నానీ!" అన్నాడు.

"వాడికన్నా నాకే బాగా ఒచ్చు తాతయ్యా!" అన్నాడు నానిగాడు ఒక్కగంతేసి తాతయ్యదగ్గరకొచ్చి.

"ఆఁ!—నేను రెండో క్లాసు పుస్తకం చదివేస్తా!—ఏం నాన్నా?!" అన్నాడు బాబు తన ఘనతను వ్యక్తంచేస్తూ.

బాబలా అనేసరికి రమణమ్మకు కొంచెం ఉడుకుమోత్తనం కలిగింది. తనకొడుకూ, సవితితమ్ముడూ ఒకే వయస్సువాళ్ళని ఆమెకు తెలుసు!—అయినా బాబుగాడు తన కొడుకుకంటె తెలివి తేటలతో ఉన్నాడు. వాడు తన స్వయం తమ్ముడే అయున్నట్లయితే ఆమెలో ఆరకమయిన ఈర్ష్యకు తావుండేది కాదు. కానీ సంబంధం దూరం అయింది. సవతి తల్లి కొడుకయిపోయేడు బాబు! వాడు బాగుంటే చూసి ఆనందించడం ఎలా?—

"చూస్తూఉండు ఒక్క నెలరోజుల్లో నీకన్నా వాడు బాగా చదవగలుస్తాడు." అంది రమణమ్మ.

"నేనూ ఈలోగా మరికొన్ని క్రొత్తవి నేరుస్తాను." అని గొణిగేడు బాబు.

"ఒరేయిబాబూ! — నువ్వు మా ఊళ్ళో ఎప్పుడయినా సర్కస్సు చూసేవామరి; ఇన్ని కబుర్లు చెప్తున్నావుకదా!" అనడిగేడు నానిగాడు.

"చూడు నానీ! — వాడు నీ కేమవుతాడో తెలుసా? — మామయ్య అవుతాడు. ఇకనుంచీ 'మామయ్యా' అని పిలువు." అన్నాడు ప్రకాశం నానిగాడితో.

"మరయితే వాడు నన్ను 'నానీ' అని పిలవొచ్చేమిటి?" అని గొణిగేడు నానిగాడు.

"ఇంతకీ ఎలాగో ఓలా పిలుచుకోనిద్దూ నాన్నా!—ఎలా పిలుస్తే నేం?" అని అక్కణ్ణుంచి వంటింటిలోకి వెళిపోయింది రమణమ్మ.

బాబుగాడిని "మామయ్యా!" అని పిలవమని నానిగాడితో తను చెప్పినప్పుడు కూతురిముఖం అదోలాగుండడం చేత, మనస్సులో ఏదో ఆమెబాధ పడుతున్నాదని ఊహించేడు ప్రకాశం. బాబుమీద అభిమానం ఆమెకు రవ్వంతయినా లేదేమో అనే అనుమానం వేసిందతనికి. ఔను మరి!—సవతితల్లి కొడుకుమీదభిమానం ఎలాగుంటుం దినుకున్నాడు.

"ఒద్దు, ఒద్దు"ని కూతు రెంతిచెప్పినా వినకుండా రెండో పెళ్ళి చేసుకున్నాడు తను! — చేసుకున్నందుకు అనుభవించాలి మరి!—ఇంకా నయం!—అదికూడా బ్రతికున్నట్లయితే తను పెళ్ళాంతో సహా బాబుని పెట్టుకొని ఎలా బ్రతుకగలుస్తాడు? అది చచ్చిపోడంకూడా ఒకందుకు మంచిదేమో అనుకున్నాడు!-పైగా అల్లుడు కూడా చచ్చిపోడం ఒరకంగా తన మంచికే ఏమోనని అనుకున్నాడు. అల్లుడే బ్రతికున్నట్లయితే తనను ఉండిపొమ్మని కూతు రంటుందా అసలు!—అలా ఇంట్లో ఉండిపొమ్మని పట్టు పడుతుందా?—అప్పుడు తనేంచేసేవాడు — బాబునెలా పోషించగలిగేవాడు?—ఏదో అల్లుడు చచ్చిపోబట్టి, ఆమెకు మరే మొగదిక్కూ లేకపోబట్టి ఉండిపొమ్మంది! — తిండిసుఖం లేక దేవులాడ నక్కర్లేదనుకున్నాడు. ఎంతిదయినా రమణమ్మకి తను తండ్రివుతాడు. కూతురిదృష్టిలో తనెంత నేరస్తుడయినప్పటికీ తిండి పెట్టకుండా తగిలేదు!—తనముఖంచూసి బాబుని కూడా పోషిస్తుంది. తను చచ్చిపోయేక ఏమో?!—తన చావు సంగతి జ్ఞాపకాని కొచ్చేసరికి ప్రకాశానికి ముచ్చెమటలూ పోసేయి. బాబుసంగ తేమిటనే భయంకరసమస్య ఎదురయిం దతనికి. ఆలోచించడానికి భయం వేసింది! — అంతా "భగవత్ కృప" అనే సిద్ధాంతంలో కొచ్చేసే డాఖరికి.

4

"చూడు నాన్నా!—నానిగాడికి అక్కయ్య అణా ఇచ్చింది. వాడు పకోడీలు కొనుక్కొని తిన్నాడు. నా కిమ్మంటే ఇచ్చేడు కాడు. నివ్వయ్యి నాన్నా!" అనడిగేడు బాబు ఉడుకుమోత్తనంతో.

"అక్కయ్యను నువ్వు అడగలేక పోయావా మరి?!" అన్నాడు ప్రకాశం.

"నాకు భయం నాన్నా!— నే నడిగితే కసురుతుంది."

బాబు తండ్రితో అంటున్న మాటల్ని ప్రక్కగదిలోంచి వింది రమణమ్మ. ఒళ్లు మండిం దామెకు. తనెప్పుడు వాడిని కసిరింది గనక?!—ధ్రుఱున అక్కడి కొచ్చింది. "ఔనురా! — నిన్నెప్పుడు కసిరేనురా నేను?—వెధవబద్ధాలూ నువ్వూను!"అంది బాబు వేపు కోపంతో చూస్తూ.

"ఏదోనమ్మా చిన్నపిల్లడు! — " అన్నాడు ప్రకాశం.

"ఆఁ!—చిన్నపిల్లడు!—ఇలా అబద్ధాలు చెప్పడంలో మాత్రం పెద్దవాడేలే! నే నెప్పుడూ వాడిని కసరలే దసలు!—ఎలా చెప్తున్నాడో చూడు. నా కెందుకు వాడిగొడవని ఇంతవరకూ వాడి జోలే వెళ్లలేదు నేను."

"చూడు రమణా!—తల్లి నెరగ నే ఎరగడు. వాడిని వాత్సల్యంతో చూడమ్మా!"

"నువ్వు మరీ ఇదిగా మాట్లాడుతున్నావు నాన్నా!—ఇప్పుడు నేను వీడి నేమన్నాను గనక?" అని రమణమ్మ అంటూ ఉండగానే నానిగాడు రివ్వున వీధిలోంచి పరిగెట్టుకొచ్చి తాతయ్య ఒళ్లోకి దూకేడు. "ఔరా నానీ!—మరి మామయ్యకు పకోడీలు ఇచ్చేవు కావేం?—నువ్వొక్కడివే తినేయడం తప్పు కదూ?" అనడిగేడు ప్రకాశం నానిగాడిని.

"వాడి కెందు కివ్వాలీ మరి?!—వాడి కిమ్మనమని అమ్మ చెప్పిం దేమిటి?" అని గొనిగేడు నానిగాడు.

"నే చెప్పకపోతే మాత్రం?—వాడికి కూడా ఇవ్వలేక పోయేవురా?" అనంది రమణమ్మ.

"మరయితే వాడికోసం మరో అణా నే నడిగితే, 'అక్కర్లేదు. వాడికి కనిపించకుండా తినేయ్!' అన్లేదూ నువ్వు?" అనడిగే డమ్మని అమాయకంగా నానిగాడు. అలా అడగడంవల్ల వచ్చే ఫలితాలు నానిగాడి కేం తెలుసు?!—

వానిగాడి చంపమీద కోపంతో ఛెళ్లున లెంపకాయ కొట్టింది రమణమ్మ!—"అబద్ధాలు కూడా నేర్చేవ్!—నే నలా నీతో అన్నానురా?" అని మరోటి కొట్టింది.

"అయ్యో!—పసివాడినలా ఎందుకు కొడతావమ్మా!" అని అడ్డుకున్నాడు ప్రకాశం.

"అదికాదు నాన్నా, 'నే నొక్కణ్ణే తినేస్తా'నని వా డనుకుంటూ వెళిపోతూ ఉంటే—పని తొందరలో 'నీ ఇష్టం' అని అనేసేను కాబోలు!" అంది రమణమ్మ తన తప్పు లేదని సమర్థించుకుంటూ.

—తాను చేసిన తప్పుని అవతలవాళ్లమీద త్రోసేసి తమాషాగా తప్పించుకొనే అంతటి శక్తి వానిగాడికింకా రాలేదు. అమ్మ కొట్టినందుకు ఏడుపుకి లంకించుకున్నాడు. బాబు బిక్కచచ్చిపోయేడా దృశ్యాన్ని చూసి!—తననీ ఎప్పుడయినా అక్కయ్య అలా కొట్టేస్తుందేమో నని భయం వేసింది బాబుకి. తనవల్లే వానిగాడు దెబ్బలు తిన్నాడేమో అని బాధపడ్డాడు!—

—ప్రకాశం కూడా బాధపడ్డాడు; అలాంటి చిన్న విషయంలో మనస్పర్థలు బయటపడ్డందుకు!—తనే గుప్ చుప్ గా ఓ అణా బాబుగాడి చేతులో పెట్టేస్తే ఏతంటా లేకపోయేదిగా!—బాబుగాడి భవిష్యత్తు ఎలా ఉంటుందా అనే బెంగపట్టుకుంది ప్రకాశానికి.

5

అవాళ ఓ ఉత్తరం అందుకున్నాడు ప్రకాశం అతను 'రిటైర'యిన స్కూలు హెడ్మాష్టరు దగ్గర్నుంచి. ఆ క్రిందటి నెలజీతం వచ్చినట్టూ, తీసుకొనే అందుకు వస్తారా, లేక మనియార్డరు చేసేయమంటారా అని.

తను ఎలానూ వెళ్ళాలనుకున్నాడు ప్రకాశం. సామాను చాలావరకూ అక్కడే ఉండిపోయింది. పైగా ఆ అద్దెఇల్లు ఖాళీచేసేయాలి. తను ఎలా అయినా వెళ్ళవలసి అవసరం ఉంది. కానీ అతని కొక్కటే సమస్య ఎదురయింది!—బాబుని కూడా తోడ్చుకొని వెళ్లడమా లేక తనొక్కడూ వెళ్ళడమా అని. చిన్నప్పటినుంచీ తనను విడిచిపెట్టి ఒక్కనాడూ ఉండలేదు బాబు!—మరి విడిచిపెట్టితే బెంగపెట్టుకోడూ?—రమణమ్మ వాడిని సరిగ్గా చూస్తుందనే నమ్మకం ఏమిటి మహా!—

చెప్పేడు కూతురితో—"నే నూరికి వెళ్లాలి. అక్కడి ఇల్లు మొదట ఖాళీచేసి సామాను తీసుకొని రావడం, క్రిందటినెల పనిచేసినంతవరకూ నాకు రావలసిన జీతం పుచ్చుకోడం, ప్రావిడెంటు ఫండు త్వరగా వచ్చే అందుకై తగు ఏర్పాట్లు చెయ్యడం చెయ్యాలి. ఇప్పటికే ఆలస్యమయిపోయింది."

"సరే!—వెళ్లిరా నాన్నా!—నీ కెంత డబ్బు కావాలో చెప్పు. ఇస్తా!" అంది కూతురు.

"డబ్బు మాటకేంగానీ, బాబుగా డొక్కడూ ఇక్కడుండగలడా అని నా అనుమానం. వాడినీ నాతోపాటు తీసుకెళదా మనుకుంటున్నాను." అన్నాడు.

"బాగు బాగు!—అయితే ఇక్కడ నే నేమయినట్టు?—వా డొక్కడూ ఉండవలసిన ఖర్మేం?—అయినా బాబుగాడి విషయంలో మొదటినుంచీ నువ్వు నన్ననుమానిస్తూనే ఉన్నావు!—ఇంతకీ బాబుగాడు నాకేం ద్రోహం చెయ్యలేదు. వాడివల్ల తప్పు రవ్వంతయినా లేదు. ఓ రకంగా ఆలోచిస్తే వయస్సు దాటిన తరువాత పిల్లల్ని ఎలా పోషిస్తావనయినా ఆలోచించకుండా మళ్లీ పెళ్లిచేసుకోడం నీతప్పు!—అంతే కానీ వాడిదికాదు. అప్పట్లో నీమీద కోపం ఒచ్చిన మాట వాస్తవం!—కానీ ఆకోపం ఇప్పుడు తగ్గిపోయింది. నీకేం భయం లేదు నాన్నా!—వాడిని నేను జాగ్రత్తగా చూస్తాను. నువ్వెళ్లు. ఇవాళంటే నువ్వు బ్రతికున్నావు. ఇకముందు నేనేగా వాడికి దిక్కు!—అంచేత మరేం ఫరవాలేదు. నాలుగు రోజులపాటు వాడు నా దగ్గర నువ్వు లేకుండా ఉంటే క్రమేపీ చనువేర్పడుతుంది. ఇప్పుడెంచేతో వాడు నన్ను చూసి భయపడుతున్నాడు." అంది రమణమ్మ.

ప్రకాశం మరేం మాట్లాడలేకపోయేడు. బాగా ఆలోచించేడు. తనొక్కడూ వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు.

ఆ సాయంత్రం కొడుకునీ, మనవడినీ బజారుకి తీసుకెళ్ళి మిఠాయి కొనిచ్చే డిద్దరికీ. బాబు మిఠాయి తింటూ ఉన్నప్పుడు చెప్పేడు—"చూడు నాయనా! నే నూరు కెళ్ళి రేపే వచ్చేస్తాను. మరేం భయపడకు. అక్కయ్య నీ క్కావలసినవన్నీ ఇస్తుందిలే!" అని.'

"ఊహూఁ!—నేనూ వస్తాను. నా కిక్కడ భయం!" అని సణిగేడు.

"మరి చూడూ నాతో వచ్చేస్తే రేపు బడిలో పాఠాలు పోవూ?—మేష్టారు కోప్పడతారు. చక్కా

నానిగాడున్నాడు; నీకు భయమేంటి చెప్పు?—అదీ కాక సినిమాకెళ్ళడానికి డబ్బులిస్తాను, చక్కా ఇద్దరూ చూద్దురు గాని. మనింటిదగ్గరే హాలుకూడాను." అని ఓ రెండురూపాయలు తీసి చెరొకటి చొప్పున ఇద్దరికీ ఇచ్చేడు ప్రకాశం.

సినిమా కెళతాం కదా అనే సంతోషంలో ఒప్పేసుకున్నాడు తండ్రి ప్రయాణానికి.

"నువ్వు తప్పకుండా రేపొచ్చేస్తావు కదూ?" అనడిగేడు బాబు.

"ఓ తప్పకుండా!" అన్నాడు ప్రకాశం. తిరిగొచ్చేసరికి ఓ వారం రోజులవుతుందని అంటే ఒప్పుకోడు కదా అని అబద్ధం ఆడేసేడు. ఆ రాత్రి ట్రైనుకే ప్రయాణమయేడు ప్రకాశం.

6

ఆ మర్నాడు బాబుకి పూర్తిగా మతిపోయినట్లయింది. తన నేదో మహా ప్రమాదకరమయిన ప్రదేశంలో ఉంచేసి తండ్రి వెళిపోయినట్లు ఫీలయేడు. బెంగతో అతి కష్టంమీద ఆరోజు గడిపేసేడు.

ఆ మర్నాడు బడిలో నానిగాడిని అడిగేడు. "మా నాన్న ఇంకా రాలేదేం?—నిన్నటికే వచ్చేస్తా నన్నాడు కదా!" అని!

"ఏమో నాకేం తెలుసు!—అయినా ఎందుకురా ఆ బెంగ?!—మా నాన్న ఇప్పటివరకూ రాకపోయినా నే భయపడుతున్నా నేంటి?!" అని నానిగాడి సమాధానం.

"మీ నాన్నెప్పుడూ రాడు మరి!—చచ్చిపోయిన వాళ్ళు మరి రారని మా నాన్న చెప్పేడు!" అన్నాడు బాబు.

"నిజమే నేంటిరా?!—అయితే మరి మా నాన్న రాడూ?"

"ఊహుఁ!—"

"పోనీలే!—మా అమ్మ ఉంటూ ఉండగా నాకు భయమేంటి?" అన్నాడు నాని.

"నా కసలు అమ్మ లే నే లేదు!"

"అసలు ఎప్పుడూ లేదన్నమాట!"

"లేదు. నా కొక్క నాన్నే ఉన్నాడు. ఆ నాన్నిప్పుడింకా రాలేదు చూడు!"

"మా నాన్నలా, చచ్చిపోయేడేంటో!—లేకపోతే నిన్న రాత్రికే వచ్చేసుండేవాడు." అన్నాడు నాని.

బాబుగుండెల్లో రాయిపడింది. "నిజమే అంటావా?—" అని కళ్ళంట నీళ్లు కార్చేడు బాబు. బెంగపట్టుకుంది బాబుకి.

"తాతయ్య చచ్చిపోయినా, కళ్లలమీద కట్టి ఇక్కడికే ఎవళ్లయినా తీసుకొస్తారులే!—భయంలే దేనికట. అయినా మా అమ్మ ఉంటూ ఉండగా నీకు భయమేంటిరా!" అని నానిగాడు అంటూఉండగానే బెల్లు మ్రోగింది!—అంతా క్లాసుల్లోకి వెళిపోయేరు.

బాబు మరేం మాట్లాడలేదు. ఆ లేత హృదయం బెంగతో నిండిపోయింది. ఈ ప్రపంచంలోకల్లా నాన్నొక్కడే మంచివాడని బాబు నమ్మకం. అలాంటి నాన్న లేకపోతే తన గతేం కానని బాబు భయం.

క్లాసులో మేష్టరు లెక్కలు చెపుతున్నాడు. బాబు పరధ్యానంగా వింటున్నాడు.

"రెండూ, మూడూ కలిపితే ఎంతరా?" అని చటుక్కున మేష్టరు బాబు నడిగేడు.

"ఆరు!" అన్నాడు బాబు. ఛడేలున లెంప మీద కొట్టేడు మేష్టరు.

బావురుమన్నాడు బాబు!—ఆ ప్రక్కనే ఉన్న నానిగాడి నడిగేడు మేష్టరు. "అయిదు." అని సమాధాన మిచ్చేడు నానిగాడు. బాబుని తెగతిట్టి, నానిగాడిని మెచ్చుకున్నాడు మేష్టరు.

బాబు తెగ ఏడిచేడు. ఆ ప్రశ్న సరిగ్గా వింటే సరయిన సమాధానం చెప్పేసేవాడే!

ఇంటికొచ్చేక నానిగాడు అమ్మతో చెప్పేడు బళ్లో జరిగిన సంగతంతా.

"ఓరి బడ్డూ!—రెండూ, మూడూ కలిపితే ఎంతవుతుందో తెలీదూ?" అని గట్టిగా రమణమ్మ అడిగింది బాబుని.

బాబు బిక్కచచ్చిపోయేడు. మరేం మాట్లాడలేదు. ఇక అక్కయ్యకూడా తిడుతుందేమో అని భయపడ్డాడు. నాన్నే ఉంటే? — అలా ఎవరయినా తననంటే ఊరుకుంటాడూ, అనుకున్నాడు.

"పోనీ, ఏడూ, ఎనిమిదీ కలిపితే ఎంత?" అనడిగింది రమణమ్మ.

"పదిహేను." అని బాబు సమాధానం.

"ఇది చెప్పగలిగేవాడివి ఆమాత్రం చిన్న ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయేవురా?"

"నే సరిగ్గా వినలేదు." అని నసిగేడు.

"సరిగ్గా ప్రశ్న వినకపోడం నీతప్పే?—అతిరి బజనుకున్నా వేమిటి?—కోదండం వ్రేలకట్టి డొక్క

చీల్చేస్తా తిక్కడి మేష్టర్లు!—సరేగానీ, తిండికి పద!" అని వంటింట్లోకి వెళిపోయింది రవణమ్మ.

అంతా మహాభయంకరంగా కనిపించిందా వాతావరణం బాబుకి. అక్కయ్య ఓ పెనుభూతంలా అగుపించింది!

ఆవాళ అన్నందగ్గర బాబు కూర్చున్నాడన్న మాటేగానీ ఒక్క మెతుకూ నోట్లో వేసుకోలేదు బాబు.

"ఏంరా అలా తింటున్నావేం?" అనడిగింది అక్కయ్య.

"నాన్న......" అని గొణిగేడు. కళ్లంట అప్రయత్నంగా నీళ్ళు కారేయి బాబుకి.

"ముందట అన్నం తిను!—నా న్నొస్తాడులే. నీకిక నే నిప్పుడేం తీసేను." అంది రవణమ్మ కటువుగా.

బాబు తినబోయేడు. కానీ అనోట్లో వేసుకున్న రెండు మెతుకులూ వాంతిద్వారా బయటకొచ్చేసేయి!

"ఛీ! — అపసంతి వెధవా!" అని చీదరించుకుంటూ అంది రవణమ్మ.

చెయ్యి కడుక్కున్నాడు బాబు. ఒంటిమీద తెలివంగా లేదు. గదిలో ఓమూలకెళ్లి కూలబడ్డాడు.

మధ్యాహ్నం బడివేళ అయింది. "ఏరా వెళ్దువా!—ఏమిటా నిద్ర బడివేళయింది." అని బాబు భుజంమీద తట్టి లేపింది రవణమ్మ. బాబుశరీరం వేడిగా తగిలింది. ఒళ్లుముట్టుకొంది, కాలిపోతున్నాది శరీరం!— "ఏరా!—ఒళ్లు వేడిగా ఉందేం?" అనడిగింది.

"తలనొప్పి!" అని మూలిగేడు బాబు. మరోమారు శరీరాన్ని తాకింది. మరిగిపోతున్నాది శరీరం. అయాసంతో మూల్గుతున్నాడు బాబు!—

"మాడుబాబూ! — తలనొప్పి ఎక్కువగా ఉందా?" అని ఆప్యాయంగా అడిగింది.

అంత మంచిగా అక్కయ్య అడుగుతుందనుకోలేదు బాబు, "ఊ!" అనిమాత్రం అన్నాడు—"మరేం భయంలేదు నాయనా! అదే తగ్గిపోతుంది," అని, పందిరిమంచంమీద ప్రక్క దులిపి, బాబునెత్తుకొని అందిమీద పడుకోబెట్టింది. అక్కయ్య అంత సదుపాయం చేస్తుందనుకోలేదు బాబు.

"నాన్నింకా రాలేదూ?!" అని మూలిగేడు బాబు.

"వస్తారు నాయనా! — నువ్వు పడుకో. ఈలోగా నీ క్కావలసినన్ని పళ్ళు తెప్పిస్తాను." అంది.

బాబు ప్రక్కకొత్తిగిల్లేడు—

— అమాయకంగా జ్వరంతో పడుకున్న బాబువేపు చూసింది. అదేమంచంమీద తనభర్త కూడా జబ్బుతో ఉన్నన్నాళ్ళూ పడుకున్న సంగతామెకు జ్ఞాపకానికొచ్చింది. ఆ మంచంమీంచే చంపేసేరు. ఆవిషయం జ్ఞాపకానికొచ్చేసరికి భయంకరమయిన అనుమానం కలిగిందామెకు! — కొంపతీసి బాబు చచ్చిపోతుకదా అని!!—బా జబ్బుల్లో చచ్చిపోతే తనెంతటి అపనిందకు అనవసరంగా గురవుతుందో ఊహించలేక పోయింది. తనే ఏదో మందిచ్చి చంపేసుంటుం దని తండ్రి అనుమానించడూ? — లోకులుకూడా అలానే తీర్మానించరూ? — తనకూ బాబుకూ ఉన్న సంబంధం అరకమయిన అనుమానానికి అవకాశ మివ్వడంలో అసహజముంటుందా? — అనవసరమయిన నిందకు తను గురి కావలిసిందేనా?—

—అసలలాంటి నిందే ఒకవేళవస్తే అది అసందర్భమయిన నిందవుతుందా అనే అనుమానం కలిగిందామెకు. ఆరోగ్యంగా ఉన్న బాబు కవాళ జ్వరం రావడానికి కారణం? — బాబుపట్ల తన ప్రవర్తనే ఏమో!—అసలు బా బాఇంటిలో కాలుపెట్టినదగ్గర నుంచీ, వాడినో రకమయిన ఈర్ష్యాభావంతో చూస్తూ ఉండేదికానీ, దగ్గరకు చేరదీసి లాలించలేదు. వాత్సల్యంతో చూడలేదు! — పైగా తనభర్త పోయేడనే దుఃఖంలో, ఏడుస్తూ వాడిముందు ప్రత్యక్షమయిందే కానీ, చిరునవ్వుతో వాడిని చేరదియ్యలేదు. మాతృత్వపు ప్రేమపాశాల మధ్యనుండే వాత్సల్య మాధుర్యాన్ని రుచిచూడని బాబుకి తన ప్రవర్తనవల్ల స్త్రీఅంటే ఓ భయంకరమయినమనిషనే భావం ఏర్పడ్డంలో అసహజం లేదేమో ననుకుంది. చిన్నప్పటినుంచీ నాన్న దగ్గర పెరిగేడు. నాన్న నెప్పుడూ విడిచిపెట్టుండలేదు! — అసలే నాన్నింకా ఊరునుంచి రాలేదనే బెంగతో ఉన్న బాబుని మేష్టరు కొట్టేడు. పైగా ఇంటికొచ్చేక తను తిట్టింది!—ఇక చిన్నవయస్సులో ఉన్న బాబు బెంగపెట్టుకొని జ్వరం తెచ్చుకోడంలో ఆశ్చర్యం ఉందా?—ఆ పరిస్థితిలో తను వాత్సల్యంతో చూసున్నట్లయితే బాబా జ్వరానికి గురయుండేవాడా అనుకుంది.

— తనకు వాడు సవతితల్లికొడుకయిన మాట నిజమే!—సవతితల్లి తన నేరకంగానూ బాధించలేదు. అసలామెను తను చూడనేలేదు. పిల్లణ్ణికని చచ్చిపోయింది!—కుళ్లూ కపటంలేని ఆ అమాయక పిల్లడిమీద తన కీర్ష్యందుకూ? అర్థంలేని ఈర్ష్య!—తనతో పాటే తనతండ్రి రక్తాన్ని పంచుకున్నాడు. ఏమైనా

వాడు తనకు తమ్ముడే!—వాడి ప్రాణా లెలా అయినా కాపాడాలనుకుంది.

ఆసాయంత్రం డాక్టరికి కబురంపించింది. డాక్టరొచ్చేడు.

"గుండెకాయ కొన్నాళ్లయి చెడినట్లుంది. దానిమీద ఏదో విపరీతమయిన భీతి కలగడంవల్ల ఈ జబ్బొచ్చింది." అన్నాడు డాక్టరు బాబు శరీరాన్ని పరీక్ష చేసినతరువాత.

"మీ రెలా అయినా రక్షించాలి బాబూ!—మీ రెంత బిల్లుచేస్తే అంతా ఇచ్చుకుంటాను." అన్నాది రవణమ్మ ఆందోళనతో.

"ప్రయత్నిస్తాను." అని డాక్టరు అని, ఓ ఇంజెక్షన్ ఇచ్చి—"నిద్ర బాగా పట్టేస్తుంది. గడి గడికీ పిలవకండి!—నిద్ర లేచేక ఓ కప్పు కాఫీ ఇవ్వండి. ఆ తరవాత మందు కెవరినయినా పంపించండ'ని చెప్పి ఫీజు పుచ్చుకొని వెళ్ళిపోయేడు.

రవణమ్మలో ఆందోళన బయలుదేరింది!—కొంపతీసి బాబు చచ్చిపోతే! తండ్రి తనింట్లో ఇకుంటాడా?—లోకులు తనమీద నింద మోపకుండా వుంటారా?—కనీసం తండ్రి వచ్చే అంతవరకూ అయినా బ్రతికుంటే బాధలేదు. ఈలోగా బాబుకి సేవచేసి 'అక్కయ్య మంచిదే' అనే అభిప్రాయం కలుగజేయొచ్చు. వాడు తండ్రితో తనగురించి మంచిగా చెప్పి చచ్చిపోయినా బాధ లేదనుకుంది!—ఇంతకీ బాబు అమాత్రం జ్వరానికే చచ్చిపోతాడని ఎందు కనుకోవాలి?—ఏమయినాసరే వాడు చచ్చిపోడానికి వీల్లేదు. తనకు తమ్ముడొకడుండాలి!—అందుకోసం వాడు బ్రతికి ఆరోగ్యంగా ఉండాలని ఎందు కనుకోకూడ దనుకుంది.

ఎందుకయినా మంచిది; తండ్రికి వైరిస్తేనో!—ఇంతకీ తన పిచ్చిగానీ, ఏదో మామూలుగా జర్వం వచ్చినంత మాత్రంలో తనకా కంగా రెందుకు?—ఎంతమందికి జ్వరా లొచ్చిపోలేదు?!—కానీ డాక్టరు "ప్రయత్నిస్తా న"న్నాడే గానీ "ఫరవా లేద"నలేదే!—అలా అంటెనే గానీ ఎక్కువ డబ్బు ముట్టదనే ఉద్దేశ్యంతో అన్నాడేమో నని సమాధాన పడింది'—

ఆవాళ తండ్రిదగ్గర్నుంచో లేఖ వచ్చింది రవణమ్మకు. ఇంకా అక్కడి పనులు పూర్తికాలే నట్టూ, వచ్చేసరి కింకా ఓ మూడురోజులపైని పట్టొచ్చనీ; బాబుని వాత్సల్యంతో చూడమనీను!—

ఉత్తరం చదవడం పూర్తయేసరికి—"అక్కయ్యా!—నాన్నిం...కా రాలేదూ? చచ్చిపోలేదు...క...దా?!" అ నడిగేడు మెల్లగా.

అప్రయత్నంగా కన్నీరు కార్చింది రవణమ్మ. "వస్తారు నాయినా!—మధ్యాహ్నం రైలులో వస్తారు. నువ్వు చాలా మంచివాడివి. ఈ మందు త్రాగేయి బాబూ! నీకు మంచి బిస్కత్తు లిస్తా!" అని మందు నోట్లో పోసింది. గుటుక్కున మింగేసేడు బాబు.

మందు త్రాగేసేక బాబుకి మగత క్రమ్మినట్లయింది!—ప్రక్క కొత్తిగిల్లేడు.

బాబు బ్రతకాలని దేముళ్లందరికీ నమస్కారాలు పెట్టింది రవణమ్మ. తీరా తనకి వాడిమీద వాత్సల్యం జనించే టప్పటికి దక్కకుండా పోతాడేమోనని ఆమె బెంగ!

7

తండ్రికి వైరుచేసిం దవాళ రవణమ్మ!—

ప్రకాశం గదిలోకి కాలుపెడుతూ ఉండగానే—"నా...న్న...అ...క్క...య్య..." అని గొణిగేడు బాబు.

"వచ్చేను నా...యి...నా" అన్నాడు ప్రకాశం బాబు నుదురుమీద ఆందోళనతో చెయ్యి వేస్తూ.

బాబు మరి తండ్రిని చూడలేకపోయేడు! ఆగిపోయిందా పసిహృదయం!!—

"అనుకున్నంత పనీ...అయిం...ద"ని బావురుమన్నాడు ప్రకాశం.

తండ్రిఏడుపుతో శ్రుతి కలిపింది రవణమ్మ!—ఆమె ఏడుపు చాలా అసహ్యంగా వినిపించింది ప్రకాశానికి!—

శవాన్ని తీసుకెళిపోయేరు.

"తప్పంతా నాది. ఈ బాధకోసమే రెండో పెళ్లి చేసుకున్నాను. ఒకళ్లమీద నిందవేసేం ప్రయోజనం?" అని తనలో తాననుకున్నాడు ప్రకాశం.

8

ఆ మర్నాడుదయం తండ్రికోసం ఇల్లంతా వెదికింది రవణమ్మ!—గట్టిగా పిలిచింది "నాన్నా" అని!—ప్రత్యుత్తరం పొందలేకపోయింది!—

ఆరోజల్లా నిరీక్షించింది తండ్రికోసం!—మరి రాడని ఆతరవాత తెలుసుకుంది.

కేవలం చివరదాకా బాబుమీద ఈర్ష్య అసూయలతో నేఉండి, వాడు చస్తేనే చాలనే దృక్పథంలో రవణమ్మ ఉండిన్నట్టయితే లోకులు వేసిన నిందకు అంతగా బాధపడుండేదికాదు!!!—

శశాంకరేఖ

★

బూరుగడ్డ కందాళ లక్ష్మీ నరసింహాచార్యులు

నవ్య మధుకాల కోకిలా నాద స్నిగ్ధ
సీమ సీమల దాటిన జీవనామృ
తాల, జిమ్మెడి ప్రేమ గీతాలతోడ
నెవ్వరోహో ! పిలచువార లీనిశీథి!

క్షిప్త కల్లోల మాలికా ఘాత క్షుబ్ధ
ఘోర కార్శ్యాబ్ధి మగ్నమై క్రుంగిపోవు
దళిత మజ్జీవ నౌకను దరిని జేర్చ
నెవ్వరోహో ! ధ్రువచ్ఛవి నిచ్చువారు!

ఆకల రాగముల్ హృదయమందున జేటి యెదో పురాకృత
శ్రీకర పుణ్యమేఘ ప్రకరిన్ గురిపించె నవానురాగము
ల్లీకుసుమోజ్జ్వల స్మృదు పరీమళ పూర్ణ మరంద ధారలన్
నాకవితా ప్రపంచమున నవ్యకళామయ జీవమొప్పగన్!

ఏదో ఇట్టి దటంచు జెప్పుటకు వీలే లేని దేదో మహా
నాదమ్మొక్కటి విస్మృతమ్మయిన స్వప్నమ్మాచు నాచిత్తమున్
మోదావేశ విలాస వీచికలలో ముంచెత్తి తేలించె; బా
ధాదాహాగ్ర్య నిరస్త నిర్దళిత హృత్తాపమ్ము జల్లార్చుచున్!

పొంగి, మొగసిన నాయెద పోల్కినున్న
ఆ కొలంకున వాస్తరంగాల నడుమ
విశద వ్రీడా వినమ్ర తన్వీలలామ
యెవ్వరోహో! స్ఫురించునదీ నిశీథి!

అళిబృందాల్ చెలరేగ మంద్రశ్రుతి గానాలాపులై చంచలత్
జల కల్లోల కులాలు తాళగతి గూర్చ మంజుమార్దంగి కో

జ్వాల నాదమ్ము ధ్వనించె; బూర్ణవిలసత్సాంద్రాగ విభ్రాజినై
లలి వెల్గుల్ వెదజల్లు మాకు ముదిసీ లావణ్యమ్ముగా దోచెడిన్.

విరితావుల్ విరబోసి చిమ్ముచును విన్వీథిం జరించేటి క్రాం
జిలుగాలుల్ నను తేనెతేనెల యువించే ప్రేమగీతాలలో
నరగంటంగను కల్వకన్నె దరహాసాశ్లిష్ట మాధ్వ్యమ్ము లం
బరవీథిం జిలికించె చంచల తటిన్మాలా సహస్రమ్ములన్!

కలువ దాయకడింది కళుకు కొండలలోన,
  గాలి పోయెడిమేని గాలసీక
దిన దినాన గుదించి దిగదీయు రుగ్మతన్
  నశియించు మేన ప్రాణాలు నిల్పి
కేతురాకాసి పెంగేర్పుతో వెన్నంటి
  పిరుపీకు సేయు దప్పించుకొనుచు
గరళ కంఠ కరాళ కాళ భీకరవ్యాళ
  దంష్ట్రా విఘాతాల దప్పుకొనుచు
ఘోరతా మిస్రబంధాల గోసికొంచు
నీ నును పిసాళి లేనవ్వు నిచ్చగించి
పరుగు పరుగున నుప్పొంగి వచ్చుచుంటి
గలువ కన్నెరో! నీదు సంకాశమునకు!



స్త్రీల పారమార్థిక గేయాలు

★

'కృష్ణశ్రీ'

చారిత్రిక గేయములు ఏ రెండు మూడో కనబడుతూన్నప్పటికీ, స్త్రీల గేయాలన్నీ మొత్తముమీద పౌరాణికాలూ, పారమార్థికాలూ అనే అనాలి. ఈ పాటలలోని సీతా, రాముడూ, కృష్ణుడూ వంటి పాత్రలు మన లోకములోని వారివలెనే వర్తించినా, కొంచెము అవసరము వచ్చిందంటే అతిలోక శక్తితో దివ్యవ్యక్తులై నిలబడతారు. 'కాళింగ మడుగులో దాహము త్రాగి ముఖము తిరిగి పడిపోయిన గోగోపక సమూహాన్ని కామధేనువు పాలు కురిపించి లేపి తీసుకుపోతాడు బాలకృష్ణుడు. హాస్యాలూ, ఎత్తిపొడుపులూ చేస్తూ అతి మాటకారిగా కనపడే సీత, రావణుని యింటనుండిన నేరానికని రాముడు తన్ను విడిచి కనకరథముమీద వెళ్లిపోతూంటే "భూదేవి కూతుర్ని శ్రీరాము నాలిని, నాయాన" అని ఆజ్ఞాపించి రథము నిలిపేస్తుంది. రాముడు మంత్రించి కాకాసురునిపై ప్రయోగించిన గడ్డి పుడక బ్రహ్మాస్త్రమై పోతుంది 'సీత అనవాళ్ళలో'. కాలి బొటనవ్రేలితో నేలనురాచి అగ్ని పుట్టించుకుని 'దక్ష యజ్ఞ' శాలలో అగ్నికాహుతి అయిపోతుంది సతీదేవి. 'నీ బంటును గానా' అని సత్యభామ పాదములపై వరిగిన పద్మనాభుడు 'కొండపాడవు ధనమెల్ల కుప్ప పోసి తూచినాను తూగడాయెను.' ఈ రకపు అతిలోకత స్త్రీలపాటలలో లేకుండినట్లయితే స్త్రీలపాటల రచయితలు అతిలోక చిత్రణమే కోరి చేశారనీ, మహత్తులూ దివ్యత్వమూ కడిగిపారేసి పౌరాణిక వ్యక్తుల్ని మనవంటి వారుగనే చిత్రించి, 'మనముకూడా వారి స్థాయిని అందుకోగలము' నే నమ్మకని మనలో పుట్టించాలని ప్రయత్నించారని అనుకోడానికి వీలుండియుండును. ఈ మహత్తులు ప్రవేశించేసరికి, అంతసేపూ మన లోకములోని కథలాగే కనపడినది పురాణ గాథ అనీ, అవతార మూర్తులకు అడ్డేలేదనీ అనిపిస్తుంది. ఆ కథలు అవతారమూర్తుల కథలు గనకనే రచయితలు వాటిని రచించారేగాని, అందపు కథలన్న అభిప్రాయముతో కాదని నమ్మిక పుట్టుతుంది. లేకుంటే, సీత చాగిలియూతలూ, సీతఘడియా, సీత వేవిళ్ళు, సీతాకల్యాణము, సీతను అత్తవారింటికి పంపుటా, సీత అనవాళ్ళు, సీత సమర్త, సీత గుధగోష్ఠి, సీత వామన గుంటలాట, సీత సురటి, సీత అగ్నిప్రవేశము, సీతామ్మవారి అలక, సీతమ్మ వసంతము,—ఇన్నీ కథా సౌందర్యాన్ని చూపించడానికే రచించారా?

తక్కిన పాటలుకూడా దివ్యవ్యక్తుల, అవతార మూర్తుల, కథలే. 'కౌసల్య వేవిళ్ళు' అష్టమీదినమున ఆదివారమున భువిసంతసిల్ల కొడుకు ఉదయించిన కథ. కౌసల్య జిహ్వాచాపల్యమూ, నెలలు పెరగడమూ, ప్రసవవేదనా, రాఘవోదయమూ, జోలపాటా, అన్నీ చేరి 46 ద్విపద పంక్తులతో ఫలశ్రుతితో కూడా పూర్తిఅయింది పాట! 'రుక్మిణీదేవి వేవిళ్ళు' లో రుక్మిణికి వేవిళ్లు ఎక్కువవడమూ, గౌరీ, అరుంధతీ, సరస్వతీ, గంగాదేవి, రుచులుగల పద్దులు కలుపుకుని రుక్మిణిని చూడవెళ్ళడమూ, ఆమె ఈ భక్ష్యభోజ్యాలన్నింటినీ రుచిచూచి 'సుగ్రువ త్రేన్చడమూ, వారంతా పసుపు కుంకుములుగొని మళ్ళి పోవడమూ, రుక్మిణీదేవి ప్రద్యుమ్నుణ్ణి కనడమూ వర్ణితములు. ఈ పాట నెందుకు రచించారూ? అన్న

ప్రశ్నకి జవాబిది: 'వేడుకతో యీ పాట వెలదు లంతా పాడి సకలసంపదలిచ్చు శ్రీ కృష్ణుడూ.' 'మేనకాదేవి నొప్పులు' లో 'నగరాజు పట్టణముకా దివినుండి విరుల వానలు కురిసెనూ, తరులు చిగురించె పూచె బాలికా మెరుగు తీగెలు మెరసెనూ' అన్న మెరుపును మినహాయిస్తే తక్కినవి మామూలే—మేనకాదేవికి నడిచిన ముచ్చట్లూ, చెలికత్తెలు 'యత్రగా గాచిన యత్రావు పాలు' జాగ్రత్తబెట్టుటా, నొప్పులకు తాళలేక మేనకాదేవి పరవశము జెందుటా, సింహలగ్నమునందు సప్తమి బుధవాసరమ్మున సర్వ కాముదాదేవి జననమందుటా, ఇవే వర్ణితాలు. అయితే ఎందుకీ పాటా? "ఈ పాట పాడినా విన్నగాని సకల సంపదలిచ్చి రక్షించు శంకరుం డెల్లప్పుడూ." మరి శంకరుని కేమి? "ముఖము వీక్షింపరమ్మా, యీ బాల కౌమారి (!) పాముసుమ్మ; అమ్మరో వినగదమ్మా శివునికి పట్నంపు రాణిసుమ్మా" అని కదా పాడేరు కలవాణులు? మరి అంతపాటి దాక్షిణ్యము ఉండక పోతె ఎలాగ ఆయనకి? ఎవరింటనైనా ఆడబిడ్డ పుట్టి నప్పుడు పాడుకోవచ్చునని 'కాబోలు' దీనిని లాలి పాటల వరసలో రాశారు. ఇది కృష్ణజననపు పాటకి ప్రతి.

ఈ చిన్నపాటలవల్ల పెద్ద వినోదమేమి సమ కూడగలదూ? ఇవి దివ్యుల వినోదాలు. వీటిని పాడు కోడము సత్కాలక్షేపమూ, జీవితాల్లోని మధుర ఘడి యల అందపు స్మృతీని. పైగా 'పాడినవారికి బ్రహ్మ లోకమూ విన్నవారికి విష్ణులోకమూ'ను. ఇంక కావలి సిన దేమిటి? స్త్రీల గేయాల్నన్నిటినీ పారమార్థికా దర్శమే నడిపిస్తుంటుందనడానికి ఈపాటి సాక్ష్యము చాలుననుకుంటాను. అయితే కేవలము వినోదమే కలి గించడానికి రచించిన పాటలు అసలు లేకపోలేదు. 'సుభద్ర కల' వినండి. అవివాహిత సుభద్ర ఒకరాత్రి నిద్రపోయిలేచి కలగంటినన్నది. 'ఏమి కలగంటివే ఇందీవరాక్షీ' అని చెలికత్తె అడిగింది. 'దేవిన్నీ దేవర కలగంటి నేనూ, ఆదినారాయణునీ కలగంటి నేనూ, నిత్యమల్లితోట కలగంటి నేనూ, నిండిన్న ముత్యాలు కలగంటి నేనూ, పట్టెమంచము పరుపు కలగంటి నేనూ, పల్లేరాల పచ్చిపసుపు కలగంటి నేనూ...' అని ఇలాగ కలగన్న దన్నీ చెప్తుంది సుభద్ర. చెలికత్తె ఆ కలని విరుస్తుంది. 'దేవిన్నీ దేవరనీ తల్లిదండ్రీ, ఆదినారా యణులూ నీ యత్తమామా, నిత్యమల్లెతోట నువు పుట్టి నిల్లూ, నిండిన్న ముత్యాలు నీ కడుపు సుమ్మీ, పట్టె మంచము పరుపు నీ ప్రాణవిభుడూ, పల్లేరాల పచ్చి పసుపూ ఐదువతనమూ' అని విరుస్తూ సుభద్ర కల్యా ణాన్ని చక్కగా ఇంపుగా సూచిస్తుంది. (సరిగ్గా ఇలాంటిదే జానపదుల 'అనుమంచి చరిత్రము. అది ఆవులన్న చెల్లెలు అక్కమ్మ కన్నకలకు వీరగంగ వివ రణము.) ఇది ఒక ఖండకావ్యములాగ గోచరిస్తుంది. ఇంకా అందంగా వుంటుంది 'లక్ష్మీదేవి వర్ణనము' చూడండి. "ఒప్పులలో ఒప్పులకుప్ప చక్కని చుక్క వంటిది, కోరి కొలిచినవారికి కొంగుబంగారమయినది. తొలకరి తొలిమెరుపులబోలు చిలుకకొలికివంటిది—హేమవర్ణపు సంపెంగ పూబంతి వంటి దేవికి మంగ ళమే శుభమంగళమే." ఈ పాటంతా వర్ణనే. 'కందు కుందులేని నిండు చందమామ తెగడు మొగమున, నల్ల కొండలమీద ఉదయచంద్రుని రేఖపాడిచినరీతి, సన్న మయిన పాపిటిలోని చంద్రవంక కదలకున్నది' ఇలా సాగిపోయింది లక్ష్మీ (రుక్మిణీ) దేవి వర్ణనము. ఇది పూర్తిగా ఖండ గేయకావ్యమే...గుమ్మడుపాట ఖండగేయకావ్యమునకు చక్కని ఉదాహరణము. యశోద పెరుగు తిరుస్తూండగా కృష్ణుడు 'అమ్మ వెన్నా' అని కవ్వము వంచి పట్టుకుంటాడు. 'వద్దురా కృష్ణమ్మ పెరుగుకు వదుము గుమ్మడు తిరుగులాడును, నమ్మకున్నను ఘుమ్ముఘుమ్మను నాద మిటువినుమీ' అని 'కాటబోయిన వారి పాపడు కడివలోపల గెయ్య మంచెను కాటుపాడిచీ కరచె గుమ్మడు' అని భయ పెట్టింది యశోద. 'గుమ్మ డేడే కన్నతల్లీ గుమ్మడిని బోడజూపగదవె యమ్మ గోపమ్మా' అని ప్రాధేయ పడ్డాడు దుష్టశిక్షకుడు ప్రభువు. తన అవతారా లన్నిటిలోనూ దుష్టులను ప్రత్యేకంగా అన్వేషించి శిక్షించావనీ గుమ్మణ్ణి ఎక్కడా చూడలేదనీ చెప్పి 'బ్రహ్మండ మిదిగో, చూపించు గుమ్మణ్ణి' అని నోరు విప్పేడు. ఇంకేరిగో పెమ్మ 'చరాచరంబుల పాడగని 'కన్నబలిమిని గుమ్మడంటిని కరుగజూడుమి దేవమణినను' అని చేతులు జోడించింది. 'మన్ను తిన్నావా?' అని తల్లిగద్దిస్తే నోరువిప్పి బ్రహ్మాండాన్ని

చూపించిన చిలిపి (భాగవత) కృష్ణుడికంటె, దుష్టశిక్షణచేసే ఆదుర్దాలో పరాకుపడి నోరు విప్పిన 'దేవుడే' పూజనీయుడు. ఈ కథ శ్రోతని చివ్వరిదాకా లాక్కుపోతుందీ, చివ్వర చక్కని ఆశ్చర్యం కలిగిస్తుంది. కాలక్షేపమాత్రమే కాదు ఈ పాట చేసేది; విన్నవారి నరాల్ని దువ్వి జల్లుమనిపించగలదు కూడాను. అయితే పారమార్థిక వస్తువు అవతారాల ప్రశంస ప్రవేశించి పాటని పలచగా సాగగొట్టింది. మొత్తముగా చూచినప్పుడీ సాగదీతకంటె కథావస్తుసౌందర్యమే బలీయమనిపిస్తుంది. కనక దీనిని ఖండగేయ కావ్యమంటున్నాను. 'సుభద్రకల', 'సుమ్మకు పాట'వంటి ఖండకావ్యాలు స్త్రీలపాటలలో చాలా తక్కువ. ఇలాటివాటిని ఏ రెండింటినో పట్టుకుని పారమార్థికాదర్శముకోసముకాక, కేవలము ఆనంద మివ్వడముకోసమే స్త్రీలకావ్యాలు వెలిశా యనుకోడము పొరపాటే అవుతుంది. స్త్రీలు రాసుకుని పెట్టుకునే పాటల పుస్తకాలలోంచి ఏరి సేకరిస్తే వేలకొద్దీ అవుతాయి స్త్రీలపాటలు. కథాగేయాలే కాదు, మంగళహారతులూ, పారువేటకథలూ, బువ్వము పాటలూ, కందార్థాలూ, తత్త్వకీర్తనలూ, అధ్యాత్మాలూ, చాలా రకాలున్నాయి. వీటిలో తొంభయితొమ్మిదిపాళ్లు పారమార్థికాలే—పరమేశ్వరాంకితాలూ, రాముడూ కృష్ణుడూ కథలూ, శివకీర్తనలూ, తత్త్వకీర్తనలూను. ఇంటికి బయట హరికథలూ, పురాణ కాలక్షేపమూ ఎలాంటివో ఇంటిలో — ఏదో పని నడుపుకుంటూ కలిసి కూర్చోగల—స్త్రీలకి ఈపాట లలాంటివే.

అందుకే స్త్రీలపాటని ఏపాటనివిన్నా దానిలో పారమార్థిక వాతావరణ ముండి తీరుతుంది చూసుకోమంటున్నాను. శిష్టాచారము ప్రకారము ఏకొంత పూజార్హతిలేని స్త్రీలకు అటు వీరశైవము నోములు కల్పించి కొంత పూజాపురస్కార అధికారము కల్పించింది. ఆ వ్రతాల కథలు పాటలుగా తయారయినవి. వాటికి చేరి ఇటు ఈపాటలు అసంఖ్యాకంగా బయల్దేరి మొత్తముగా స్త్రీలజీవితాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంచాయి. మరి పారమార్థికాలుగాక లౌకికాలు ఎలాగౌతాయీ ఈపాటలూ? 'నక్షత్ర మంగళహారతి' నక్షత్రాల పేర్ల నిమిడ్చి — ఎవరో సుబ్బాభక్తుడట—రచించిన శ్రీశైలవాసహారతి. అవకాశము దొరికితేచాలు అవతారాల కథల నన్నిటినీ విసిరేపాటలెన్నో? ఇరవైయేడున్న నక్షత్రాల పేర్లున్న హారతీ, కేశవాదినామాలున్న మేలుకొలుపులూ, నక్షత్రాల్నీ కేశవనామాల్నీ జ్ఞాపకముంచడానికి నిర్మించారని సమర్థించుకున్నా, పదిమాత్రమే ఉన్న అవతారాల్ని జ్ఞాపకముకోసమే అయితే వీలైనప్పుడల్లా విసరనక్కరలేదేమో. 'అశ్వత్థ ప్రదక్షిణం' అనే రావిపాట ఒకటుంది. ఎన్నో పాఠాంతరాలతో ఉన్నా ఆపాట ఉద్దేశముమాత్రము అశ్వత్థవృక్ష విభూతిని — వేదములని యేటివేళ్ళూ; మోక్షమ్మని యేటిమొగ్గలూ; శ్రీకృష్ణుడనియేటి చిగుళ్ళూ; చిలుకలూ, కోవిలలూ; ఆ రావినీడను విక్రంద ముఖ్యపు పురాణాలూ, నాతి పురాణాలూ, ఆదిత్యవేదములూ, వేదపురాణాలూ చదివే వేలాది విద్వాంసులూ; ఘనాపాఠీలూ; ఆ రావివల్ల లభించే నిర్వృతీ; వీటినే — వర్ణించడమే. 'సూర్యుని సుక్తాలు'లో 'ప్రొద్దుప్రొద్దున ఛాయ ప్రొద్దున్న ఛాయ, ప్రొద్దున్న పొడిచితె అద్దమ్ము ఛాయ, పొడుస్తున్న భానుడూ పొన్న పువ్వు ఛాయ, ఝాముకు దేవరా జవ్వాది ఛాయ, జామయిన అటు మీద జాజిపూఛాయ, యామద్వయంబున స్ఫటికమ్ము ఛాయ,' అని సూర్యగతిని రంగులలో వర్ణించినా, 'దేవరా', 'స్వామీ' అన్న పదాలూ, సుక్తాల ఎర్ర, వెండి, నీలి, నానా, పసరిక, అతినల్లనా, కృష్ణ— వర్ణాలు వర్ణించేతీరూ చూస్తే ఈ పాట సూర్యదేవుని కంకితముగా, ఒకవిధమైన పూజగా సమర్పణ అయి వుంటుందని తెలుస్తుంది. అచ్చైనపాటకి పాఠాంతర మున్నది. కాని వాలకము రెండుపాటలదీ ఒకటే. 'ప్రయాగనవశం' ప్రయాగయాత్రావిషయంతో క్షేత్రాలన్నిటినీ ఒక కుటుంబము తిరిగినకథ. (అది 'కిటతక' ఆవృతాలు గల పాదాలతో వుంది. యక్షగానాల్లో వున్న ధవళాలు ఈ వరసలోనే వుంటున్నాయి. అప్పకవి ధవళమునకు ఉదాహరణంగా ఇచ్చిన 'అక్షరహారిణిక చాంబురుహాక్షా యక్షపక్షు' అన్న పాదము అక్షరాల్ని సాగదీసీ, కుంచించీ పాడితే నేగాని ధవళము వరసకి కుదరదు. మరి అలాటి ఉదాహరణ మిచ్చిన ప్రయోజనమేమిటో నాకు తెలియదు.) 'తులసీదళపటలాలు' 'తులసీమహాత్మ్యము విస్తరించు' పాటలు మొత్తము నాలుగూ. సువ్విసువ్వి సువ్విసువ్వి అనే

తకట తకిట వరసలో ఉన్నాయి. వీటన్నిటిలోనూ పదానికి సంబంధించినవస్తువే కనబడుతుంది.

పారువేట కథలని, స్వామివారు వేటకి వెళ్ళి తిరిగి వచ్చినప్పుడు స్వామికి అమ్మవారికీ జరిగిన వాదనలు చిత్రించే కథల పాటలు చాలా కనపడుతున్నాయి. వీటినే తలుపుదగ్గర పాటలు' అనడము కూడాకద్దు. ఈ పాటల్ని దేవాలయాల్లో పాడుతూంటారట కూడాను. దేవుడికి నిత్యమూ జరిగే 'సేవ'లలో ఇది ఒకభాగము. 'వెంకటేశ్వర్ల వేట' వీటికి చక్కని ఉదాహరణము. వెంకట నాథుడు గాబోలు దీని రచయిత. దీనిలో కోనేటయ్య వేట సన్నాహాన్ని వర్ణించినంతగా, అలమేలుమంగాదేవి చేసే ఉపాలంభాన్ని వర్ణించలేదు కవి. కాని ఉన్న నాలుగు పాదాలలోనూ, దేవి ఖండితనాయిక అయి కూర్చుంటే స్వామి తన వంటిమీది చిన్నెల్ని ఏదో విధంగా సర్ది చెప్పుకోడము కనిపిస్తుంది. 'తలుపుదగ్గిర పాటలు' పారువేట కథల్లోని పతిపత్నుల సంవాదాన్ని పెంచిన పాటలు. 'చిటపట చినుకులు దుప్పటి తడిసెను తలుపుతీయవే భామా నీ—తలుపుతీయవే భామా' అనే 'కిటకిట' అవృతాలతో వుంటాయి ఇవి. దేవకి సుతుడూ, శ్రీరాముడూ, చెంచెత కృష్ణుడూ, వెంకటేశ్వరులూ, పరమేశ్వరుడూ, విష్ణూ, — వీరందర్నీ నాయకులను చేసి రచించిన తలుపుదగ్గిరపాటలున్నాయి. వీటన్నిటిలోనూ స్వామి నామవిభూతీ, స్వామి అమ్మవారిని ఉల్లాసపరచడానికి తెచ్చిన కానుకలనైనమూ, స్వామివేషంపు సొంపూ, ఆయనవంటిమీదిచిన్నెలూ, స్వామి వీటిని సర్దిచెప్పే వింతతీరూ, వర్ణించబడతాయి. సత్కాలక్షేపానికి దేవాలయాల్లో చేరుకునే భక్తులకు ఈపాటలు కొంత వినోదము కలిగిస్తాయి. కాని ఎంతసేపూ స్వామివిభూతిని తెరవేసి కీర్తించే యత్నాలేగాని లౌకిక వాతావరణము స్ఫురింపజేసి రసానందము సమకూర్చే యత్నాలుమట్టుకు కావు ఇవి. ఇమిడ్చిన కాస్త లౌకిక శృంగారము భక్తులు లోకులు కనక ప్రవేశించిన శృంగారమేగాని వేరుకాదు. పారువేట కథల్లో ప్రాపంచిక విలాసము పరమేశ్వరుని ఆలయములో ప్రవేశించి మానవ భక్తుల లోకానుభవాల్ని పారమార్థిక మట్టానికి ఎగదొయ్యడము కనబడుతుంది.

సంవాదాలరూపంలో వున్న పాటలు ఇంతకంటె మరొకమెట్టు పైకెక్కుతున్నాయి. పండితులు నిందాస్తవము చెయ్యడానికి ఉపయోగించే వస్తువుచే నాటకీకరించి సంవాదాలపాటలు రచించారు కవులు. 'పార్వతికీ, లక్ష్మికీ వాదము'ఒకటున్నది. 'గౌరిదేవినీ శంభుదేవునికి గళమున నలుపేమమ్మా, గళమున నలుపేమమ్మా'అని లక్ష్మి అడిగితే, 'నారీమణి నీ విష్ణుదేవుడు నల్లగాడటే కొమ్మా, నల్లగాడటే కొమ్మా' అని పార్వతి సమాధానముచెప్తుంది. ఇలాగే భిక్షము, జంక, అర్ధనారిరూపము, బ్రహ్మకపాలము, పాములు, వృషభము, ప్రశంసలు రాగా పార్వతి విష్ణుగాథలు ఎత్తి చూపుతుంది. శివకేశవుల సమానత్వమును ప్రతిపాదిస్తుంది ఈపాట. గోర్తి రామదాసరావు రచించిన 'ఈశ్వర - భృంగి - పార్వతిసంవాద' మొకటున్నది, చాలా వినోదంగా ఉంటుంది. రాజమహేంద్రవర కోటిలింగేశ్వరుని కంకితమిది. తలుపుదగ్గర పాటకిది చక్కని మార్పు. అక్కడ దేవీ దేవరానూ ఇద్దరే వ్యక్తులు. ఇక్కడ భృంగిగా డొకడు పుల్లలు పెట్టడానికి తయారయాడు.

'బంగరంపూ బొమ్మవలెనూ, పార్వతీ నీవుండగాను, గంగమాంబను తోడితెచ్చుకు, పొంగి శిరమున పెట్టుకున్నా, డెరుగవా పార్వతి యెరుగవా॥' అంటాడు భృంగి. 'యేమయా స్వామీ యేమయా' అని అడుగుతుంది పార్వతి. "నిండు వేసవికాలమున జల, ముండునో లేకుండునో యని, దండిగా నదితెచ్చి జడలో, దాచియుంచినాను గాని, యెరుగనే పార్వతి యెరుగనే' అని స్వామి మభ్యపరుస్తాడు. భృంగిగాడు 'మోము' కనపడుతోందనీ, 'విశాల నేత్రము లున్నాయనీ, నల్లని కురులున్నాయనీ, కంఠము మెరుస్తోందనీ, కుచముంపెల మున్నదనీ, పన్నుగా గారున్నదనీ, పుల్లలు పెడితే, నదులలో పద్మాలూ, మీనములూ, తుమ్మెదలూ, శంఖములూ, జక్కవలూ, పన్నగములూ ఉంటాయని స్వామి జవాబు చెప్తాడు. చక్కని పద్ధతిని గంగమాంబను వర్ణించాడీ పాటలో రామదాసరావు.

'సేతు మాహాత్మ్యము' శ్రీరాముడు రామలింగేశ్వరుని ప్రతిష్ఠించి అయోధ్యకు మళ్లినగాథ. 'ఇక్ష్వాకు

చరితంబు యింపుగా చెపుదు, పాపంబులా బోను పదవియును గలుగునని' ఉపక్రమించాడు రచయిత. సుహాభరతుల అగ్నిప్రవేశమునకు ప్రాతిపదిక అనదగిన మొదటి పంక్తులీ పాటలో ఉన్నాయి. రెండింటినీ ఒక కవియే రచించియుండునేమో ననిపిస్తుంది గాని ఈ రచయిత భాషలక్షణయుతము. కల్పనలుకూడా సేతు మాహాత్మ్యము నిండా మిలమిల మెరుస్తున్నాయి. లక్ష్మణదేవర నవ్వులాగ సేతుమాహాత్మ్యము కూడా ప్రారంభములో చెప్పడమువల్లనే ఈ పేరు స్థిరపడి పోయింది దీనికి. 'సంక్షేప రామాయణము' 'యేను కొండాలెల్ల విప్పి చెప్పకను। ఆరగించావని' పలికిన పార్వతమ్మకు మహాదేవుడు చెప్పిన కథ. స్త్రీల పాటలలో ఎందులోనూ ఒకటి రెంటికి మించి కనబడని కీర్తనలు ఈ పాటలో చాలా కనబడుతున్నాయి. ఈ కీర్తనలలో ఒకదానిలో 'సుత్తిన దీవి హనుమంతుడా నంటినీ' అన్న మాటలు చివ్వర ఉన్నాయి కాని సుత్తైన దీవి రామాయణ కీర్తనలకీ దీనికీ పోలికలు లేవు. ఇంకొక కీర్తనలో 'శేషగిరి దాసవరదుడయిన' అన్న మాటలు మకుటము లాగ ఉన్నాయి. రచయిత 'శేషగిరి' కాబోలు.

'తిరుమంత్రము' పూర్తిగా పారమార్థిక రచనే. ఈ కథలో వైష్ణవభక్తి సంప్రదాయములోని మార్జాల కిశోర మర్కట కిశోర న్యాయాలు రెండూ కనబడుతున్నాయి. తిరుమంత్రమును కోరి గురుసేవ చేసే హరి దాసుకు నానాతంటాలూ పడినతర్వాత గాని అతనికి తిరుమంత్రము దొరకలేదు గురువు దేహము విడిచిన చోటుకి ప్రక్కనుంచి యదాలాభంగా వెళ్లుతూండిన యీటెపానికి భగవత్కటాక్షమువల్ల ఆ మంత్రము అయాచితముగా లభించింది. అయితే హరిదాసుని పురుష ప్రయత్నాన్నే ఎక్కువగా వర్ణించడాన్ని బట్టి, ఈపాట రచించిన నెల్లూరి (హరిపురమట) హరి దాసు వేదాంత దేశికుల సంప్రదాయము వాడేమో ననిపిస్తున్నది. తెలుగు పాటగల వడగల్ సాంప్రదాయపు వైష్ణవులు అరవమును కాక సంస్కృతాన్నీ ఆంధ్రాన్నీ అభిమానించడానికి దీనికీ సరిపోతున్నది. ఈపాట కిటతకిట, కిటతకిట, కీ..., కిటతకిట। కిట తకిట కిటతకిట కీ...కీ...॥ అని ఎనిమిది అయిదక్షరాల ఆ వృత్తాలతో 'ఊర్మిళాదేవి నిద్రావలె నడుస్తోంది. 'రామ మానసపూజ' అన్ని మానసపూజలలాగే మామూలు వ్రతకల్ప విధానాన్ని తెలుగు పదాలలో ఇమిడ్చి రచించిన పాట. శ్రీరాముని వర్ణనా, ప్రత్యంగ పవిత్రతా, పంచాయతనమూ, సభాసౌందర్యమూ, అలంకారమూ, అంగపూజా, ఉన్నాయిందులో. ఇది తులసిదళము వరసని 'తకిట తకిట' ఆ వృత్తాలు ఎనిమిదింటితో నడుస్తోంది. మానసపూజ మామూలు పూజకంటే ఏమో పవిత్రమైనదనే పిచ్చి నమ్మక మొకటి ఉన్నదిగాని ఈపాట ఏమంత ఉదాత్తముగాలేదు. 'భ్రమరగీతల'ని ధవళాచలపు ప్రతివాది భయంకర వేదాంతాచార్యులు రచించిన పాట, ఎనిమిది 'కిటతక' ఆ వృత్తాల పాదాలతో నడిచేదియుంది. ఈ పాటల ఆశయమును "కొందరు గీర్వాణ భాషల కొనియాడుదురెపుడూ। కొందరు తెనుగునమూ హరినీ కోర్కెతో పొగడుదురూ। కొందరు గానములా సరసులు కోర్కెతో పాడుదురు। కొందరు పాటలుగా చేతురు కోమలులకు తెలియ। యేవిధమున నయినా కృష్ణుని భావములో దలచి। సేవయొనర్చినవా సుగతికి చేరుదురది నిజమూ" అని రచయిత చక్కగా వివరించినాడు. వైష్ణవుడు 'శ్రీశైలాధి పునీ మదమున చిత్తంబున దలచి' అని ఉపక్రమించడము వింత. కంసవధానంతరము కృష్ణుడు సాందీపుని కడ విద్య గఱచి, గురుదక్షిణనిచ్చి మధురాపట్నానికి తిరిగివచ్చి, ఒకనాడు చంద్రకాంత శిలావేదికమీద పున్నమ వెన్నెలలో కొలువుదీరి, తాను వ్రేపల్లెలో విడిచి వచ్చిన గోపికలను తలచి విచారించాడు. 'పతి సుత హితబంధూ గురువుల తలిదండ్రుల విడచి, గతియని నను నమ్మినా వ్రేతకాంతలు యేమైరో' నని ఉద్ధవుని ముందు 'కన్నీరొలయగ' బల్కినాడు. 'అజరుద్రాదులునూ మనమున నరయగలేనట్టి బ్రహ్మాండనాయకుడు వ్రేతలకు పరతంత్రుడు ఏమయ్యో'నని ఉద్ధవు డాశ్చర్యపడి స్వామిని అడిగినాడు. స్వామి 'ముక్తిని పొందేటి జీవముతూ కులవిద్యైశ్వర్యాదులు లేవనీ, 'తన్నే నమ్ముకున్న జనుల కెప్పుడూ ఆశ్రితుడనే' నని, 'దేహమనిత్యము, ఆత్మకు చేటు లేద'నీ, 'మాయ తగిలి (జీవుడు) వాడని మనుజను జేరుచూ ఎప్పుడు ననుగతిగా తలచునో అప్పుడె విడిపోవున'నీ, 'భూత దయాపరులై నాతో క్రీడించు జనములు నన్నే

చేరుదురనీ, 'కల్పాంతమునందు నాలో కలసిన భూతములా! కల్పాదిని నేనూ దయచే కల్పింపుచు నుందుననీ, 'ఱెప్పకు తను తానుకోసునో అప్పుడె కంటికి ఱెప్పవలె కాతుననీ 'యెండమావులు గనుగొని నీరను చుండి చెడినరీతి మెండుగ సంసారం బందున యుండిన నష్ట'మనీ, 'విశ్వములో నేను నాలో విశ్వం బయివుందు, విశ్వము నేగాను తలచిన విశ్వము నే నగుదున'నీ, 'స్నాన సంధ్యా దేవోపాసనములకు దొరకను పాదుకొన్న భక్తికే దొరకుదున'నీ, 'యిట్టి మార్గములు గోపిక లేపగిదిని గనిరో నన్ను కొనదగుదుర'నీ చెప్పి తన యోగమునమును త్రేపల్లెలో దెల్పుమని పంపెను. త్రేపల్లెలో గోపిక లతనిచుట్టి కృష్ణుడు తమ్ము మరచినందుకు ఎత్తిపొడుస్తూంటగా ఒక గోపిక హరి పదారవిందముపై మదిగల్గి, మనస్సును భ్రమరా అని సంబోధించి కృష్ణుని ప్రణయచాంచల్యమును వివరించి భ్రమరము నుపాలంభించినది. 'వాని పేరె కాని వేరొక వార్తాడదు జిహ్వ, వానిరూపె గాని కానగ నోచవు మా కళ్లు' అన్న పలుకులు విని యుద్ధవుడు కృష్ణుడు తనకు చెప్పిన మాటలు—భక్తియోగ సంబంధములు—వారికిచెప్పి కృష్ణుడు వస్తున్నా డన్నాడు. గోపికలంతా తన్మయులై 'మారజనక నిమ్మగాజని మానుషత్వమేలా | సూర్యచ్ఛాయబోలు నిను చూడని యూడ్కుల ఫలమేమి' అని ఇలా పరిదేవనము పొందినారు. ఉద్ధవుడు తిరిగి మధురాపురమునకు వెళ్లినాడు. ఈ పాటలో భక్తియోగ లక్షణమును ముందు కృష్ణునిచే చెప్పించి తరవాత (భక్తుల) లక్షణమును చూపించినాడు రచయిత. అందువల్ల గోపికల మధురభక్తి ఉజ్వలంగా కనబడుతోంది.

'వైకుంఠ వర్ణనము' అన్న పాటలో భక్తుడు 'అజ్ఞాన దేహమ్ము నెరుగక యున్నాను పొంసకూ వున్నాను చెప్పుమీ కృష్ణా | శంకలేక వైకుంఠపురముకు తోవ చేరేటి ఉపాయం నాకుచెప్పుమీ కృష్ణా' అని ఆర్తుడై, 'వెతలు పెట్టక చీకటికోణం దాటేటి మతము యెట్టిదో నాకుచెప్పుమా కృష్ణా'అని దాసుడై, బలిచక్రవర్తినీ పాతాళాని కనిచినా చిన్నపాదము జాడచెప్పుమాఅనీ,పాంచాలి కక్షయవలువలుఇచ్చిన హస్తములు చూడజెప్పుమాకృష్ణాఅనీ, పలికేటిసిరితోటి పలికేటివన్నెలా కలికివయనములుజాడజెప్పుమా కృష్ణా అనీ వేడుకుంటే, భక్తవత్సలుడు "తప్పున గాళ్లతో పరసములు వద్దు, కుచ్చిత పదులతో కూటములు వద్దు, అర్థమెంత సంగ్రహించిన ముక్తిపరిరాదు, తక్కిన చుట్టాలు తగిన బంధువులు ఇక్కడె మితము జెంది యేగి పోగానె అక్కడికి పోరి వారడ్డుపడరారు" అని బోధించి, సత్యహరిశ్చంద్రుని చరిత్రా, రాముని చరిత్రా చెప్తాడు. మొత్తానికి కథ పొందిక గాలేదు. వైకుంఠవర్ణనము వస్తురూపంగాలేకపోయినా గుణరూపంగానైనా లేదు. ఈ పాటను మంగు రంగనాథ రావుగారు తప్ప ఇంకెవరూ అచ్చువేసినట్లు లేదు. కనక పాఠాంతర మున్నదేమో తెలియదు.

'లక్ష్మణ వుపదేశము'ని అద్వైతపరమైన పాట లిఖిత ప్రతి నొకదానిని చూచినాను. ఇది లక్ష్మణ స్వామి కోరికమీద పంచవటిలో రామచంద్రుడు చెప్పినది.

శ్రీరాముడు మొదట మాయాస్వరూపము చెప్పెను. ఆమీద జ్ఞానసాధకాలూ, పరమాత్మస్వరూపమూ, మాయకు గల విక్షేప, ఆవరణశక్తులూ చెప్పెను. "వివేకంతో వాదించిమాస్తే బ్రహ్మకి వికృతమైనది ఏదీలేదు. సంసారవృక్షానికి దృఢమైన మూలము శరీరమే. దారాపుత్రాదులు ఆత్మకేమీ కారు. జీవాత్మ పరమాత్మలు పర్యాయపదాలు. వారి భేదము అజ్ఞాన కల్పితము." చాలేమో అద్వైతప్రతిపాదన కింతపాటి. 'వేదాంతి కుచ్చెల కథ'లో జనకుడు పంచశిఖుడనే మునీంద్రుణ్ణి, పదిప్రశ్నలడిగేడు. "జగములు లేవందురు కనబడుచున్నవి కాదనదగునే" అశరీరులు కలరని విందును విశదపరచు డావిధమంతెయును; గిట్టినవారలు పుట్టెదరనుచు చెప్ప విందునది సిద్ధంబవున; 'ఎప్పటికిని ఆయవు జన్మములు' అది వినిపింపుడి విశదముగాను; అది తానను టకు అర్హతగలదే; బ్రాహ్మణులే మోక్షార్హులైతే బ్రాహ్మణభావం బలమదు బెట్టు; యేసాధనచే యలవడు మోక్షము; యే సద్విధిచే యలవడు ముక్తి; యేవిద్య గావింపవచ్చును; యే వృత్తిని గావింపగ వలయు" నన్నవే ఆపదీని. వీటికన్నిటికి పంచశిఖుడు జవాబు చెప్తాడు. "గగనమందునా అగపడు నీలము పగిదిని జగములు అగుపడు లేనివియు, కనులజాలి కల

కాదనలేదా? నాదనని అనహంకారులే అశరీరులు; దేహమునే నెర తీసేటి గురుకు కనిపెట్టెడిదాక కట్టడి తనువులు కలుగుచునుందు; అది (బ్రహ్మము) పృథివి గాదది అప్పుగాదు, అది అగ్నిగా దనిలము గాదు, అది ఆదిమధ్యాంతరహితము, జలధితరంగంబులె బ్రహ్మమునలో మాయమాయ కల్పనలే తనువులు; క్షణమాత్రమున్నన సమయూహమునె మోక్షము, మేము పెద్దలమని మిణుకుచు తిరిగే పామరులను దలచగ పనిలేదు, కుల మెక్కువ తక్కువనేమిటికి, బ్రహ్మజ్ఞులే బ్రాహ్మణులు; యీశ్వరుని దృఢ మెదలో నిలుపు, అరసి భ్రమలనే యుషువుల నరుకు; తన ప్రాణమునో ధనములు గురునకు వినయముతో నర్పించుట సద్విధి; షోడశాక్షరీమహిమయే (నేర్వవలసిన) విద్య, వీడక నది గావించుటే ముక్తి; గురుసుశ్రూషయే గురుసద్వృత్తి" అని చెప్పి 'కాగన గురువాక్యములే సాధన, తీర్థయాత్రలు తిరిగిన లేదు. వణకుచు జలముల మునిగిన లేదు, గోణుగుచు వేల్పుల గొలిచిన లేదు, దానధర్మముల తగిలిన లేదు, మౌనస్థులమై మెలిగిన లేదు; పంచగద్దెములు పెంచిన బూది కొంచి భీతిలి చనునా మాయ, జట్టనిడిచినా మారునమాయ, పుట్టుబొపనవి పోవునెమాయ, సన్యసించిన పనెలు నెరమాయ, వనవాసంబుల వదలునె మాయ, పంగనామంబుల బడునా మాయ, లింగధారి యని పొంగునమాయ", అనే పరమ రహస్యము నుపదేశించినాడు. సూత్రాల రూపాన్ని ఉపదేశముద్రపట్టిన వేదాంత శాస్త్రాలకంటె ఎదురుగా కూర్చుని ఎవరో చెప్పుతూన్నట్టున్న ఈ వేదాంతపు పాటలు నయము. చిన్నయాగురుని శిష్యుడు పన్నాల సుందరయ్యట ఈపాట రచించినది. కుచ్చలకథ వరకవి పాడవలెనన్నాడు కనక ఆకథ తర్వాతే రచించబడి వుండాలి. కుశలవులయుద్ధము, కుశలాయకము, కుశలవ కుచ్చలచరిత్ర క్రిందటి శతాబ్ద మధ్యప్రాంతమున రచించబడి ఉండవచ్చును.

'వశిష్ఠవాక్యములు' కూడా సులభ శైలిలో వేదాంతాన్ని బోధించే పాటయే. "స్ఫటికంపురాయి సైంధవ లవణము సాగరములోబడి తా ద్రవకమాయెనే ఓరామ| అటువలెనె తన మనసు శివుని ధ్యానము చేసి శివునందు కలసునే ఓరామ| కీటకమ్మా యిపుడు భ్రమర ధ్యానము చేసి భ్రమరంబు తానాయె ఓరామ| అటువలెనె తన మనసు శివుని ధ్యానము చేసి శివుడు తానాయెనే ఓరామ| శ్రీ గంధములయందు వున్న వృక్షము లన్ని శ్రీగంధమాయెనే ఓరామ| అటువలెనె సత్సంగ మబ్బినవారికి కలదు బ్రహ్మానందమో రామ" అంటూ అద్వైతపరంగా వెళ్లుతుంది పాట అంతాను. 'పాము కూసము విడచి పశ్చాత్తాపాన పట్టుకొని వెతకునా ఓరామ| విష్టలో భోంచేసి విసిరి పారవేసి మళ్ళి అది ముట్టునా ఓరామ| వర్ణాశ్రమాచార మతాభిమానములు వర్తించ జేయోగి ఓరామ'అని చక్కనిసత్యాల్ని సులభంగా బోధిస్తుంది 'వశిష్ఠవాక్యములు'. 'జుట్టు జందెముతీసి చుట్టాల తలబోసి అది గొట్టె సన్యాసమో ఓరామ| బ్రహ్మచారులను మేము భాగులానంటమని బహు గర్వపడుదురూ ఓరామ, ఆత్మకంటె నన్యమే మెరుగకుంటె నదియె బ్రహ్మచర్యమే ఓరామ', అనీ, 'పాము పుట్టలోనుండి పరమరహస్యమున అది మిమ్ము యెరుగునా ఓరామ| పరులమోసము చేసి పలుక దెవ్వరి తోను అదిమిమ్ము యెరుగునా ఓరామ| కలకాలమూ కప్ప కడు చలవనీళ్ళలో మునిగి మిమ్మెరుగునా ఓరామ| గంగాతీరమున కొంగధ్యానము చేసి నిజలింగ మెరుగునా ఓరామ' అనీ సాయిలా పొయిలా మాటలతో భక్తిలేని కర్మవ్యర్థమని చక్కగా బోధించడానికి పాటలను మించిన సాధనము లేదనిపిస్తుంది. స్కూళ్ళలో నేర్పుకునే పాఠాలులాగ వేదాంత శాస్త్రాలలోనుంచి విన్న తత్వాలు మనస్సంతుష్టికే గాని ఆచరణకు అక్కరకు రావు. ఈరీతిగా ఎరిగిన అనుభవములలోనుంచి వెలిచినతత్వము నెత్తురులో ప్రవేశిస్తుంది. వ్యాసరాయస్వామి పురందరదాసు కీర్తనల సంపుటాలను ఉపనిషత్తులపైన పెట్టేవాడట. నేను వేదాంత కుచ్చలకథనూ, వశిష్ఠవాక్యములనూ ఉపనిషత్తులనెత్తిమీద పెట్టడానికి జంకను. నిరక్షరాస్యుల తలుపుకొట్టి వినబడే ఓంకారాలివి. నిశ్చలతత్వాన్ని పుట్టించే వేదాంతనెత్తురులివి. ఉపనిషద్గ్రంథులు కావు.

ఇవన్నీ స్త్రీలకొరకు ప్రత్యేకంగా నిర్మించబడ్డ పారమార్థిక గేయాలు. పాటలరూపంగావుంటాయీ, సులభముగా వుంటాయి. ఇవికాక కందార్థాలలో

తత్త్వాలు ఇమిడ్చిన రచనలూ, భక్తిపూరితములైన ప్రకీర్ణ గేయాలూ ఉన్నాయి. 'గోపెమ్మ నీకుమారుడు పాపడుకాడమ్మ పాలభాండములెల్లకా, పూసెట్టు పుల్ల తెగయగ, వాపోవగ జాగ్రనోహా' వరకూ కంద పద్యమే. ఈ పాదాలు 'కిటతక, కిటతక, కిటతక' అనే నాలుగక్షరాల ఆవృత్తాలుగా విభజించుకోవచ్చునని గుర్తించి, పై 'నోహా' తరవాత 'అంభోజయానా' అనే 'తకిటతక తకిటతక' (ఏడక్షరాల) ఆవృత్తాలు చేర్చి పాటగా పొడిగించి, తరవాత 'తకిట కిటతక' ఆవృత్తాలే అనుసరిస్తారు. ఇవి కందార్థాలు. ఉత్పల మాలకూడా, పాదానికి ఏడేసి 'కిటతక' ఆవృత్తాలతో నడుస్తుంది. మూడుపాదాలు నడిచినతర్వాత — అంటే 21 ఆవృత్తాలు నడిచాక, దీర్ఘాక్షరాలు ఉపయోగించిన నాలుగేసి 'కిటతక' ఆవృత్తాలుగల పాదాలువాడి పాట లాగ పాడేస్తే ఉత్పలార్థాలు వస్తాయి. వెంకటే శ్వర్లకూ 'అలమేలు మంగకూ సంవాదము'లో ఈ ఉత్పలార్థాలున్నాయి. 'ఆండాళ్ చరిత్రము.' అనే యక్షగానములో సీసార్థాలున్నాయి. సీసార్థ ములపాట వినకుండా వాటి ఛందస్సును పరిశీలించ డము న్యాయముకాదుగాని పాడునిస్తే మూడున్నర సీసపాదాలు — కిటతకిట ఆవృత్తాలు మూడెని మిదులూ, మరో నాలుగూను — గడిచినపిమ్మట

'కనుల్నాలు, న్నవి రెండు, కే, యాకర,
　　కణమూలు, న్నవి రెండుకే,...'

అన్న 'తకిట' ఆవృత్తాలు ఎనిమిదిన్నీ, 'కోమ లాంగుని, కొమతిండ్రిని, ప్రేమతోడుత, పెనగు లాడని' అనే ఏడక్షరాల ఆవృత్తాలు నాలుగున్నూ, మళ్ళీ 'తకిట' ఆవృత్తాలు ఎనిమిదిన్నీ వస్తున్నట్లు కన బడుతున్నాయి. ఈ 'అర్ధ' రచనలలో తాళము మారు తోంది. ఇటు పద్యమూ, అనగా సాహిత్యమూ, అటు సంగీతమూ తెలుసునవే గొప్పకోసము యక్షగానాల్లో వీటిని తప్పక ఇమిడ్చేవారేమో ననుకుంటాను. స్త్రీల పాటల్లో తమ "ఆధిక్యాన్ని" పురస్కరించుకుని ప్రవేశించిన పండితసామగ్రి ఈ అర్థపద్యాలు.

'సీతపాట' పారమార్థిక గేయాలలో హిమాలయ పర్వతమువంటిది. తెలుగుభాషలోని వేదాంతగ్రంథ ములలో నాయకమణియైన సీతారామాంజనేయసంవాద మును రచించిన పరశురామపంతుల లింగమూర్తి గురు మూర్తియే ఆర్తులకు బ్రహ్మవిద్యారహస్యార్థంబు కీర్తించి రక్షింపదలచి ఈ పాటనుకూడా రచించెను. 'శ్రీశైల భ్రమరాంబాష్టకము' వసచినంత రొత్తునీ నడుస్తుంది ఇది. అంతకంటె లోతు. సాంఖ్యయోగము, తారక యోగము, అమనస్కయోగము అను మూడు యోగ ములను ౮౮౦ 'వాక్యము'లలో ఇమిడ్చి రచించాడు కవి. మచ్చుకు కొన్ని వాక్యాలు :

సద్యస్తమోనాశ ఖద్యోతమాన జి
　　ద్విద్యుల్లతా ప్రభలు సీతా
హృద్య జద్యోవేద్య ఖద్యోత సముదయ
　　సద్యుత్యుతి చ్ఛటల్ సీతా
ఘోరాంధకార సంపూరిత ఘోరసవారి
　　వారివాహంబులను సీతా
హీర కర్పూర డిండీర తారాకార
　　భూరిచ్ఛటాచ్ఛటల్ సీతా"

ఇది పాటవరుసని ఉన్నది అంతేగాని స్త్రీల పాటకాదు. గొప్ప వేదాంత గ్రంథం మట్టుకోను. 'సీతా' అన్న మకుటము ప్రతీ పాదానికీ వాడడాన్ని బట్టి దీనికి సీతపాట అని పేరువచ్చినది. తంజావూరి సరస్వతీ మహల్ గ్రంథాలయంలో ఉంది. దీనికి ఎన్నడో జీవరత్నాకరం ప్రెస్‌లో అచ్చయిన గుజిలీ ప్రతులు మట్టుకున్నాయి అక్కడక్కడ.



దాక్షిణాత్యాంధ్ర సాహిత్యము

★

శ్రీ నేలటూరి వేంకటరమణయ్య

(గతసంచిక తరువాయి)

కామేశ్వర కవి కవిత్వము ప్రౌఢమైనదని యొక్క మాటలో మంచి యోగ్యతాపత్రము నొసంగినారు వీరేశలింగము పంతులుగారు. శృంగార రసాస్వాదనపరాయణులైన గంటి సూర్యనారాయణ శాస్త్రిలువారానంద మగ్నమానసులైయ్యును కావ్యమందు దోషములున్నవని సూచించినారు. "ఈ కవి ఘనాఘనము శ్రీకృష్ణ కథావృత్తముతో మేళవింపబడిన శృంగార రసములో నీ ప్రబంధ సరోవరమును గూలంకషముగ నిండించి కామభక్త కామ జనక భక్తులను దనియింపఁ బూనినాఁడు. శృంగార రస ప్రియులైన సహృదయు లీ ప్రబంధ సరోవరములో నవగాహ మాచరించి యమందానందమున నోలలాడుదురుగాక! ... కవి యుభయభాషా పాండిత్యము గలవాడయ్యును రసాభినివిష్టుఁ డగుటచేఁ గాబోలును పలుతోట్ల ఆంధ్రవ్యాకరణ మర్యాదలను లక్షింపలేదు. కవిత్వము మృదు మధుర శైలి గలిగి ద్రాక్షాపాకమునఁ బడినది". విజ్ఞుల యభిప్రాయము శిరసావహింపదగినదే.

కాని యీ కామేశ్వర కవి శృంగార రసావిష్టుడై యౌచిత్యమును వీటఁ బుచ్చినాడు. ఈ నరకాసుర వధను ఎఱ్ఱన సోమన పోతన మున్నగు మహాకవులెందరో వర్ణించినారు. శ్రీకృష్ణు నింతటి శైసిమాలినవ్యక్తిగ మఱి యెవ్వరును ప్రదర్శించి యుండలేదు. సామాన్యుఁడా శ్రీకృష్ణుఁడు? ధర్మసంస్థాపనకై భువిపై నవతరించినభగవంతుఁడు. ఇంద్రాది దేవతల యాపదల నాపగల శక్తిప్రభావ సంపన్నుడు. అట్టివాని నిచట కేవల స్త్రీలోలునిఁజేసి రతిరహస్యములను అతని ముఖాంతరముమండి వెడల గ్రక్కించినాఁడు. కామేశ్వరకవి భావించిన శ్రీకృష్ణుఁడు స్త్రీలోలుఁడు, విషయాసక్తుఁడు, కాంతావియోగము నొక్క నిముసమైన సహింపజాలఁడు. వలపంతచే భ్రాంతుఁడై యూడిగంబులు చుట్టుచున్నారని యెట్టి వలంపక చెల్లు వదరుచున్నాడో చూడుఁడు:

"ప్రక్కలో బవళించి పదముపై హావణించి
  యచ్చోటు గదియించి హాసుమించి
చిగురుబ్బలానించి చిగియు సందోవరించి
  పెదవి కెంపులునించి బెదరణంచి
మోవిచ్చి తేలించి ముద్దాడి లాలించి
  ముందుగా గదియించి మోహరించి
యలసి సీవలయించి చెలగి పస్నెలయించి
  భ్రంభావ మొనరించి బుజ్జగించి
వేగవభిముఖ నైతో నవిముఖమనుచు
భ్రమణ మొనరించి రమణ పరాకటంచు
మరుపుతో వ్రాలి నీమేని యొరపులెల్ల
నింక నొకసారి వియ సేయవే యొయారి"

ఇట్టి యసభ్య శృంగార వర్ణనాత్మకములైన పద్యములొక యాశ్వాసమునకు మిక్కుటమైనవి గలవు. ఎంతటి ప్రౌఢమైనదైనను ఇట్టికవిత్వ మేవగింపు బుట్టింపకపోదు. కామేశ్వర కవి ప్రతిభావంతుఁడే కాని, స్వశక్తికొలఁది యెలుఁగక మహాకవులతో దులతూఁగబోయి చదికెలబడినాడు.

నంది తిమ్మన గారి పారిజాతాపహరణములోని

"అందఱిలోనఁ జెద్ద మహి
  మాన్విత రుక్మిణి గానఁబూవు గో
విందుఁడు దానికిచ్చెఁ దగవే యని
  లక్షణ మోర్చె సైఁచెఁ గా
ళింది శమించె ధ్రద యవులెమ్మని
  యూరడిలెక్ సుదంతి లోఁ

గుందుట మానె జాంబవతి
కోపముఁ జెందెను మిత్రవిందయున్."

అను నుత్పలమాలకు బ్రతిగ,

"కోలకోలమించె రుక్మిణికి
ఘూర్ణిలె లక్షణ యెంతయేని చు
క్కారుమనె భద్ర జాంబవతి
కుంచెఁ గళిందజ గుందెఁ జాల వే
సరుకొనె మిత్రవింద సగెఁ
జాలదపించె సుదంతి వారిలో
నరయగ సత్య తా సరసులాడుటకున్
మది కిన్క మాటుమున్.

అను జంపకమాలను,

పతి ప్రాణ సదృశ బంధువు
పతి దైవం బేసుగడయుఁ బ్రతి సతులకు న
ప్పతియ కడు హేఱ దప్పిన
గతి కులకాంతలకు వేఱు కలదే చెపుమా.

అను కందమునకు బ్రతిగ,

మగడే దైవమటందురు
మగువలు మతి నమ్మియుండు మమత కలదు గా
మగఁడెవసీ చాక చేసిన
మగువకు గాదన దరంబె మదవతులారా.

అను ప్రతి కందమును వ్రాసినాఁడు.

తిమ్మనగారి పద సంఘటనయు కవిత్వపు జగ్గను నితని పద్యములందు గానరావు. పారిజాతాపహరణముతో బోల్చి చూచిన నితనిది బిగిసానము చాలని కవిత్వమని తోఁచక పోదు.

ముద్దళగిరి పేరనుండు మూఁడవకృతి విద్యావతీ దండకము: కామేశ్వర కవి యొక్క కోకాదు ముద్దళగిరికి కృతియిచ్చి బహూకృతి నందినది. మహాకవి యని యాకాలమున పేరెత్తిన గణపవరపు వేంకటకవియు ముద్దళగిరి పేర గృతిజెప్పి యతనిచే మన్నన బడసిన వాఁడే.[3] ఇతఁ డనేక గ్రంథములను రచించెను.

---

3. చిరకాలమునుండియు వేంకటపతి కవి యొక్క వాస్తవకాలము దెలియక వాఙ్మయ విమర్శకులును జరిత్రకారులును దిప్పులఁబడుచు పలువిధముల నూహించుచుండిరి. ప్రబంధ రాజ వేంకటేశ్వర విజయ విలాసమును బరిష్కరించి తమ యముద్రిత గ్రంథ చింతామణియందు బ్రకటించిన పూండ్ల రామకృష్ణయ్యగారు, "ఈ గ్రంథకర్త అధునాతన కవి వర్గములోనివాఁడు. శ్రీ కృష్ణరాయల సభాసదులగు ముక్కు తిమ్మనాదుల దానవతారికయందలి 3౪ వ పద్యమున నుదహరించిన కారణముచే నితను శ్రీకృష్ణ రాయలకు నీవలివాఁడనుటకు సందియము లేదు. అనేక గ్రంథ శోధకుండగు కాకనూర్యప్ప కవి వర్యుండు తన లక్షణ గ్రంథమగు "అప్పకవీయమున" నిట్టిగ్రంథ మునుగూర్చి యొచ్చుట నుదహరించనందున నితను అప్పకవికిని యీవలివాఁడని యూహ కట్టుట కవకాశమిచ్చుచున్నది." కందుకూరు వీరేశలింగము పంతులవారుకూడ నిట్టి యభిప్రాయమునే వెలిపుచ్చి యున్నారు. "పదునాఱవ శతాబ్దాంతమందున్న పింగళి సూరనార్యుని, (రామరాజ) భూషణుని పేర్కొనుటచేత నీతఁడు పదునేడవ శతాబ్దమునకు లోపలివాఁడు కాఁడనుటకు సందేహము లేదు. మఱి యొకచోట "లక్షణ సార సంగ్రహ సరస్వతీ విలాస సాహిత్య చింతామణి సత్కవి జనసంజీవని" యని లక్షణ సార సంగ్రహమును, కవిసంజీవనిని పేర్కొని యున్నాఁడు. ఇందలి లక్షణ సార సంగ్రహము చిత్రకవి పెద్దన్న రచియించినదైనపక్షమునఁ గవి పదునేడవశతాబ్దారంభమునకు దరువాతి వాఁడును, కూచిమంచి తిమ్మకవి రచించినదయిన పక్షమున బదునెనిమిదవ శతాబ్దమధ్యమునకు దరువాతివాఁడును అగును." ఇటీవల శ్రీ కొత్తపల్లి సూర్యారావుగారు, "కర్ణాట కుండీర చోళ పాండ్యమండల ప్రముఖాఖిల మండలాఖండల దత్తమత్త సింధుర...రత్నాంబరాదివస్తు... నిఖిల సుభలక్షణ లక్షణకవి వేంకటపతి కవి - యని వ్రాసికొన్న దానింబట్టి చూడగాఁ బాండ్య మండల ప్రభువులలో నాంధ్ర కవుల నాదరించుటచే ప్రశస్తికెక్కిన "మండలేశ, పాండ్య మండలేశ, పాండ్య భూవిభు" మొదలుగా గల విశేషణములచే వ్యవహరింపఁబడినవాఁడు విజయరంగ చొక్కనాథ భూపాలుఁడే యని పెక్కండ్రు దాక్షిణాత్య కవుల వ్రాతల వలన విశ్వసింపఁదగియుండుటచే నిక్కవి యతని కాలమందే యనఁగా క్రీ. శ. ౧౭ శతాబ్దము మొదట నుండినవాఁడై కూచిమంచి తిమ్మకవికి సమకాలికుఁడై యుండునని తోఁచును" అని తీర్మానించిరి. ఇంచుక చారిత్రదృష్టితో జూచియుండిన వీరిట్టి తీర్మానమును జేసియుండరు. కర్ణాట కుండీర చోళ పాండ్య మండల మండలాధీశ్వరులచే సత్కారములను బొందినట్లుగదా వ్రాసికొన్నాఁడు వేంకటపతి కవి. పాండ్య మండలాధీశు నొక్కనినే దృష్టియందుంచుకొని కవి కాలనిర్ణయము సేయబూనటేల? తక్కిన కర్ణాట కుండీర చోళ మండలాధిపుల మాటయేమి?

తారావళి, యమక శతకము, శృంగార రస మంజరి, కృష్ణ మల్లికక చతుర్భద్ర, బాలరామాయణ ద్విపద, లింగాను శాసనము, తెలుఁగు ప్రతాప రుద్రీయము, తెలుఁగు రస మంజరి, అభినవాంధ్ర నిఘంటువు— యిదే వేంకటేశాంధ్రము — ఆంధ్ర కౌముది, గణ యతి ప్రాస లక్షణ సీసమాలిక, ఆంధ్ర ప్రయోగ రత్నాకరము, రేఫ అకార నిర్ణయపద్ధతి, షట్ప్రత్యయముల ప్రస్తార సరణి, యర్వదాఱు ఛందముల వచనము, అలంకార సారము, పరమ భాగవత చరిత్రము, ఆంధ్ర ద్విరూపకోశము, కల్పిత కల్పలత, తెలుఁగు వసంత తిలక బాణము, కఠినప్రాస శతకము, ఆంధ్ర ప్రక్రియా కౌముది, జాంబవతీ విలాస చిత్ర కావ్యము, చండ విద్యావతీ దండకము, చక్రవాళ తారావళి, పురాణ సారము అను గ్రంథములను రచించియు దనివినందక ప్రబంధ రాజ వేంకటేశ్వర విజయ విలాసమును రచించెనట. సర్వ లక్షణ శిరోమణి యను మహాకావ్యమును, మఱియొక లక్షణ గ్రంథమునుగూడ వేంకటేశాంకితముగ వ్రాసెను. వేంకటపతిని కవి యని పేర్కొనుటకంటె శాస్త్రకర్త యనుట యుక్తము. పద్యములను ఛందోవ్యాకరణాది దోషములు లేక వ్రాసినంతటనె కవితా ప్రతిభ లేనివాఁడు కవి కాఁజాలఁడు. వేంకటపతి వ్రాసిన గ్రంథములలో నే

కర్ణాట రాజ్యమును క్రీ. శ. ౧౬౪౮ సం. నను తుండీర మండలమును మధురపటిరేఁటను మహమ్మదీయులు జయించి స్వాధీనము చేసికొనిరి. క్రీ. శ. ౧౬౭౩ వ సం. న మధుర నాయక రాజులు తంజావూరి విజయ రాఘవుని జంపి చోళమండలము నాక్రమించుకొనిరి, కాని యనంతర మల్పకాలమునకె యందు నెలకొన్న మహారాష్ట్రులుగూడ తాము చోళమండలాధిపతుల మని చెప్పుకొనుటవలనను వారును నాంధ్ర కవి జన పోషకు లగుటవలనను వేంకటపతిచేసిన చోళ మండలేశ్వర ప్రస్తావము ఆతని కాలనిర్ణయమున కంతగ దోహదపడదు. కాని కర్ణాట తుండీరములు రెంటి యందును హిందూరాజ్యము క్రీ. శ. ౧౬౪౮-౯ లో సమాప్తి నందినది. తరువాత నవి విజాపుర సుల్తానుల యేలుబడిక్రిందికి వచ్చినవి. కావున గణపవరపు వేంకటపతి కవి కర్ణాట తుండీర మండలేశ్వరులచే సత్కారము బడసినది ౧౬౪౮-౯ కు ముందై యుండ వలయును. అగు నేని యతఁడు ౧౭ వ శతాబ్ద మధ్య కాలమున వెలసియుండునని మన మూహించవచ్చును. ఇదియ యతని సరియైన కాల మని నిర్ధారణచేయ గల సాక్ష్యము గలదు. ప్రబంధ రాజ వేంకటేశ్వర విజయ విలాసమునందు వేంకటపతి కవి తాను దండి విద్యావతీ దండకరాజమును రసము హెచ్చుగ నొనర్చితినని చెప్పియున్నాఁడు. ఈ విద్యావతీ దండకప్రతి యొక్కటి చెన్నపురి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమందున్నది. అందు,

శ్రీ విశ్వనాథాన్వయాంభోధి చంద్రుండు ... వత్సాశ్యపాభిఖ్య గోత్రుండు భాస్వద్భరిత్రుండు శ్రీ తిర్మలోర్వీతలాధీశ పౌత్రుండు వీరావనీ పాల పుత్రుండు, వీరాధి వీరస్తుతోద్దారదోస్సారవచ్చొక్కనాథక్షితీశాగ్రణీ సోదరుం డాశ్రితత్రాణ బద్ధాదరుం డర్భకన్యాస మానోల్లసల్లింగమాంబా వధూగర్భ సుక్తిస్ఫురన్మౌక్తికా కారుఁడై యొప్పు ముద్దళక్షోణి పాలుండు ... బాహ్యతులోర్వ పరిక్రీడలన్ మన్మథాభోగసామ్రాజ్య భోగంబులన్ దేలి చొక్కాటపుం సుందినంబందు రాణించు మాణిక్యమున్నట్టు శ్రీ 'మించి వర్ధిల్లు చోనా్న' దనియు, 'శ్రీ ముద్దళ రిత్మ్యతిలాధీసు పేరన్ కృపాద్రీశ సంకాశు పేరన్ మహాలక్షణగ్రంథ భాషాభిధాన ప్రథా మాధురీ సాధురీత్యర్థవద్బద్ధ బంధానుబంధ ప్రబంధాది నానాప్రయామాత్య రాజ్వేంకటార్య ప్రణీతంబుగా బొల్చు నా పుష్ప కోదండకంబైన విద్యావతీ దండకం బుర్వి నాచంద్ర తారార్కమై యొప్పెడున్" అని యున్నది.

ఇందువలన గణపవరపు వేంకటపతికవి చొక్కనాథుని తమ్ముఁడైన ముద్దళఘురి సమకాలికుఁ డని స్థిర పడుచున్నది. ముద్దళ్గిరి తన యన్న పక్షమున క్రీ. శ. ౧౬౭౩ సం. న తంజావూరిని పాలించియున్నాఁడు గదా. కావున వేంకటపతియు నప్పటివాఁడగుట నిస్సంశయము. మఱియుఁ దుండీర ప్రభువులలో నెల్ల గడపటివాఁడగు వరదప్ప నాయకుఁడు విద్యాప్రియుఁడై కవుల కాశ్రయ మొసఁగినవాఁడు. కర్ణాటక ప్రభువులలో గడపటివాఁడైన ముమ్మడి శ్రీ రంగరాయలకు విద్యా విషయములం దభిరుచియున్నట్లు కన్పట్టదు, మఱియు నితఁడు కవుల కాశ్రయమిచ్చి పోషించినట్లును తోఁచదు; కాని యితనికి పెదతండ్రియైన పెదవెంకటపతి దేవ మహారాయలు—౧౬౩౦ ౧౬౪౨—కవుల కాశ్రయ మిచ్చి పోషించుటయే కాక తన పేర గ్రంథముల జెప్పించుకొనెను. కావున గణపవరపు వెంకటకవిని సన్మానించిన కర్ణాట తుండీరప్రభువులు పెదవేంకటపతి దేవమహారాయలును చెంజి వరదప్పనాయకుఁడు నై యుందురు. అగు నేని యతఁడు క్రీ. శ. ౧౬౨౦ మొదలు ౧౬౬౦ వఱకును వర్ధిల్లెనని చెప్పవచ్చును.

యల్పసంఖ్యాకములో తప్ప తక్కినవన్నియు ఛందో వ్యాకరణాలంకార శాస్త్రములకు సంబంధించినవే. శాస్త్ర విచారమునందు కవితా ప్రదీపనమునకుగాని భావ విలసనమునకుగాని యవకాశ మధికముగ నుండదు.

ఆంధ్రకౌముదిలోని కవిత్వము జూడుఁడు :

అచ్చు తెనుంగున నప్రాణి వాచకో
  దంతములపయి సప్తమికి మఱి తృ
తీయకు నన్ వచ్చుఁ దెలియఁ బాటేశమై
  కొమ్ము నన్నిల్చెఁ గొంకువను విసరె
వనగ నిట్టుల నుదాహరణంబులగు
  మఱి యప్రాణి వాచకోదంతములనె
కన్ను వెన్నును జన్ను మిన్నను
  నుసులకు గంటవంటను జంటమిరటననఁగ
జను ద్వితీయను బందమిని సప్తమిని
  నొక్క రూపమా లక్ష్యముల్ రూఢి వినఁడు
చెలికంటఁజూచెను చెలికంట జొపెను
  నిది కంట గాటుక నిడిరొననఁగ
వలయుచునుంచు నావల మఱి యప్రాణి
  వాచకోదంతశబ్దముల పయిని

ఇత్యాది. ఇది వేయిచరణముల సీసమాలిక, గ్రంథమంతయు కవిత్వమిళ్లై యుండును. మఱియు నీ యాంధ్రకౌముది ప్రత్యేక గ్రంథము గాదు. మొదట ప్రత్యేక గ్రంథముగ వ్రాసినను వెంకట కవి దీనిని ఇట్టి వానిని మఱి కొన్నిటిని సర్వలక్షణ శిరోమణియం దుల్లాసములు జేర్చి గొప్ప లక్షణగ్రంథమును ప్రకటించెను. ఆంధ్రకౌముది సర్వలక్షణ శిరోమణిలోని తృతీయోల్లాసము. వెంకటేశాంధ్రమను నామాంతరము గల యభినవాంధ్ర నిఘంటువు ఇందులోని ద్వితీయోల్లాసము; గణ యతి ప్రాస సీసమాలిక ఇందు ప్రథమోల్లాసములోని యొక ప్రకరణము. నిఖిల శేష ఆకార నిర్ణయ పద్ధతి పంచమోల్లాస ప్రారంభమున గలదు. షట్ప్రత్యయ ప్రస్తారసరణియు, నిర్వచాలు ఛందములకు వచనంబును చతుర్థోల్లాస భాగములు. ఆంధ్ర ద్విరూపకోశము దశమోల్లాసము. కావున సర్వలక్షణ శిరోమణి పదియుల్లాసములకు దక్కువకాని లక్షణ గ్రంథము. ఇదియొక యద్వితీయమైన లక్షణ గ్రంథమనుటకు సందియము లేదు. ఆంధ్రకౌముదిని గ్రహించిన వారి కది యెంతటి యమూల్యమైనదో విదితము కాఁగలదు. గ్రంథము సంపూర్ణముగ లభింపక పోవుట యాంధ్రుల దురదృష్ట మనుకొనవలయును. కాని ఎట్టి యుత్తమలక్షణ గ్రంథమైనను, వేంకటపతి కవిత్వాతిశయమును నిర్ధారించుట కది సహకారి కాఁజాలదు. అతని కవిత్వమహోత్కర్షమును దెలుప గలవి కృష్ణమల్లకథ, బాలరామాయణ ద్విపద, పరమ భాగవత చరిత్ర, జాంబవతీ విలాస చిత్రకావ్యము, పురాణసారమను కావ్యము లుపలబ్ధములు గాలేదు. లభించిన గ్రంథములలో నితని ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము గొప్పది. అదియు నమూల్యమైన లక్షణగ్రంథమే కాని, తిరుమలనున్న నతని కవితాశక్తిని కొంతవఱకు గనుగొనవచ్చును. అతఁడు మహాసమర్థుఁడని యనుమర లేక పల్కవచ్చును. అతని పాండిత్య మద్వితీయము, శాస్త్రపరిచయమును లోకజ్ఞానమును అసాధారణమైనవి. ఛందో వ్యాకరణాది శాస్త్ర విచారమున గొంత దిగునుదినుకు గానవచ్చుచున్నను శైలి మొత్తముమీద సాఫైనదే. పదముల కూర్పునను గర్భ చిత్రకవిత్వరచనలయం దితని నేర్పు మఱియెవ్వరికిని లేదు. ఈ విషయమును ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాస పీఠికయందు చక్కఁగ బరిశోధించి యాంధ్ర వాఙ్మయ విమర్శకపితామహు లనఁదగిన శ్రీమాన్ రామకృష్ణయ్యగారిట్లు వ్రాసియున్నారు. "ఇందుదహరింపఁబడిన గర్భ కవిత్వ చిత్రకవిత్వ బంధకవిత్వములలో చంద్రాఖ్య, సీసపద్యమును బోలిన పద్యమిదివఱకు నాంధ్ర గ్రంథములలో నెచ్చటను వ్రాయబడి యుండలేదు. ఈ పద్యమునందు గర్భితములన్నియు నఱువదికిం బయిగా నున్నయవి. ఈ యఱువదిగర్భితములును రకార ప్రాస ఘటితములై యున్నయవి. ఇందు కందములు, తేటగీతులు, ఆటవెలఁదులు, శోభనమంగళారతులు, శ్లోకములు, చౌపదులు, వృత్తములు, అష్టకములు, ధవళములు, అర్ధచంద్రికలు, ఉత్కళికలు, రగడలు, దరువులు, ఉభయభాషాకందములు లోనగుగర్భితములు వ్రాయఁబడియున్నవి. ఇంతియగాక యీ సీస తేటగీతి యంతయు సర్వ లఘువులతో గూర్పబడి యున్నది. పండితయీ సీసములోనుంచి వింశతి బంధ కందము కూడా వ్రాయఁబడి యున్నది. ... ఇట్టిపద్య మిది వఱకుఁ దెలుఁగుఁ గబ్బములలో నెవ్వరును వ్రాసి యుండలేదు." బళి! బళి! యని మెచ్చదగదా యిట్టి యసదృశ సామాన్య రచనాకౌశల్యమును. కాని ఇది యంతయు శతసహస్రావధాన కౌశల్యమువంటిది కాని యుత్తమ జాతి కవిత్వము కానేరదు.

విజయరంగ చొక్కనాథుఁడు భాషాపోషణ మొనరించిన మధుర నాయక రాజులలో నగ్రగణ్యుఁ డని ముందు చెప్పియున్నాను. ఇతఁడు విద్యాం

సుఁడు. కవుల కాశ్రయ మొసగి కావ్యరచనకు ప్రోత్సహించుటయేకాక స్వయముగ గ్రంథముల రచియించెను. మనకు దెలియవచ్చినంతవఱకు నితని సంస్థానమునందు సముఖము వేంకట కృష్ణప్ప నాయకుఁడు, శేషము వేంకటపతి, కుందుర్తి వేంకటాచలపతి, వెలగపూడి కృష్ణయ్య, బద్దెపూడి ఎఱ్ఱనృపాలుడు నను కవులేవురును యక్షగానకర్త తిరుమల కవియు వెలసిరి. వీరుగాక సముఖము వేంకట కృష్ణప్ప నాయనికి మిత్రుఁడు బుణిగె కృష్ణయ యను కవి మఱియొకఁ డుండెనని యహల్యాసంక్రందనపీఠికలోని "యుభయ భాషా కవితా విశేషులైన శేషము వేంకటపతి, బుణిగె కృష్ణకవీంద్రుకు నా కాప్తసఖులు గావున" అను వాక్యమువల్ల దెలియుచున్నది. ఇతఁ డే గ్రంథముల రచించెనో తెలియరాదు. మఱియు దారాశశాంక కృతిపతియు విజయరంగ చొక్కనాథ నాయకుని మంత్రియు నగు వంగలసీనయామాత్యుఁడు రామానుజ చరిత్ర యను గ్రంథమును, మన్నారు రంగాంకిత గేయమును రచించినట్లు,

"ధాత్రి రామానుజ మహో చరిత్ర ఘటన
కలన కువలయ వికసన కళ ధరించి
సీన ఘనకుండు సర్వజ్ఞ శేఖరుండు."

"శ్రీమన్నారు రంగాధిప
నామాంకిత గేయకల్పనానుత మతికిన్
రామానుజ విజయాంక గ
భీమగురసహాయ మాన వేంకటపతికిన్."

అను శేషము వేంకటపతి వాక్యములవలన విదితమగుచున్నది. వంగలసీనయ సుప్రసిద్ధపదకర్త. ఇతని విషయము ప్రకరణాంతరమున విచారింతము.

మఱి యెందఱుకవులును విద్వాంసులును విజయరంగ చొక్కనాథుని యాస్థానము నలంకరించి యుండిరో తెలియదు.

సముఖము వేంకటప్ప నాయకుఁడు రచించిన గ్రంథములు జైమినిభారత, రాధికాసాంత్వ, అహల్యా సంక్రందనములు మూడు మనకు లభించినవి. ఇందు జైమిని భారతము వచనకావ్యము, రాధికా సాంత్వన అహల్యా సంక్రందనములు రెండును పద్యకావ్యములు. రాధికా సాంత్వనము "ఏకాశ్వాసక్షుద్ర ప్రబంధము" అని వేటూరు ప్రభాకర శాస్త్రిలవారు నిరసించినారు. శాస్త్రిల వారికిట్టి యభిప్రాయమేల కలిగెనో తెలుపలేదు. శృంగార గ్రంథమగుట వలన నేమొ. "కొంతకాలము క్రింద నా తాళపత్ర గ్రంథము విక్రయించుటకై యొకరు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమునకు గొనివచ్చిరి. దానిని నేను చూచితిని. ముద్దు పళని రాధికా సాంత్వనమందుండలి పద్యములన్నియు గలవు. మఱికొన్ని పద్యము లెక్కువగా చేర్పఁబడి నాల్గాశ్వాసములుగా ముద్దుపళని గ్రంథము విభక్తమైనట్లు కన్పట్టుచున్నది" అని శాస్త్రుల వారు వ్రాసినారు. దీనిని బట్టిచూడఁగా ముద్దుపళని వేంకటకృష్ణప్ప నాయకుని కావ్యమును దస్కరించి తాను రచియించినట్లు తన పేర బ్రకటించుకొనెనని చెప్పవలసి యున్నది. ఆంధ్ర సాహిత్య పరిషత్పుస్తక భాండాగారమున వేంకటకృష్ణ నాయకుని రాధికా సాంత్వన ప్రతియొకటి కలదు. విషయ మవశ్యము పరిశోధనీయము.

ప్రభాకర శాస్త్రులవారు సెలవిచ్చినట్లు వేంకట కృష్ణప్ప నాయని గ్రంథములోని పద్యములన్నియు ముద్దు పళిని రాధికా సాంత్వనమునందుండుట వాస్తవమేని, హేయశృంగార వర్ణనలతో నిండినదైనను నది రసవంతమైన కావ్యమని యొప్పుకొనక తప్పదు.

"దీని కవిత్వము నాతి కఠినమయి మృదువుగా నుండినదనుటకు సందేహము లేదు. దీనికి మంచి సంస్కృతాంధ్ర సాహిత్యమును గలదు...అయినను గ్రంథములోని భాగము లనేకములు స్త్రీలు వినదగినవియు స్త్రీ నోటనుండి రాదగినవియు గాక దూష్యములయియున్నవి...స్త్రీ జన స్వాభావికమైన సిగ్గును బోవిడిచి శృంగారరసమును పేర సంభోగాది వర్ణనములను పుస్తకమునిండ మిక్కిలి పచ్చిగా వర్ణించినది."

అని వీరేశలింగము పంతులవారు ముద్దుపళినిని గూర్చి చెప్పిన మాటలు వేంకటకృష్ణప్ప నాయని గ్రంథమునకు జక్కఁగ జెల్లగలవు. నీతి బాహ్యతను విస్మరించిన నిందలి కవితా సౌకుమార్యము నెంత కొనియాడినను తనివితీరదు. విషధర పన్నగ శిరస్థితమైనను చారు మాణిక్యము పేక్షణీయము కాదు గదా.

అహల్యా సంక్రందనము మిక్కిలియు రమణీయమైన శృంగార కావ్యము. వేంకటకృష్ణప్ప నాయకుడు రాధికా సాంత్వనమువలె గాక శృంగార రసము నిండు సత్యముగ పోషించినాడు. శృంగారముతో నందందు హాస్యమును మేళవించి హృదయమున కానందము గొల్పినాడు. శబ్దాలంకారయుక్తమై నిర్ఝరాంభఃపూరమువలె గమనవేగము గలదై, చమత్కారపాటవము గలదై, రసనిష్యందమై విజయవిలాస కువలయాశ్వ చరిత్రలను స్మరణకు దెచ్చుచున్నది. వేంకట కృష్ణప్ప నాయకుడు గొన్ని యెడల చిన నారాయణరాజు కవిత్వమును మేలుబంతిగ గ్రహించి తత్తుల్యముగ కావ్యమును సంతరింపఁ దలపెట్టినట్లున్నది. ఇట్లయినను నవ్య కావ్య ఛాయలు గానవచ్చుచున్నను వేంకటకృష్ణప్ప నాయకుని కవిత స్వతంత్రమైనది. పురాణోక్తమైన ఇంద్రాహల్యల వృత్తాంతమును గొంత మార్చి కల్పనా నైపుణ్యమును జూపినాడు, తియ్యని తేటతెనుఁగు మాటల గవిత్వము నవణించి సరివారిలో వాసి కెక్కినాడు.

శేషము వేంకటపతి :— ఇతఁడు కృతిపతి తమ్ము,

"బిసరుహ మాకరందరస
　పేశలకోమలవన్మృదూక్తులన్
రసికుల కింపుగాఁ గృతి
　పరంపరలన్ రచియించి కీర్తిచే
నెసగితివయ్య వేంకటపతీ
　బళి! శేషము వంశ సత్కృతీ!"

యని సంబోధించినట్లు చెప్పుకొన్నను తారాశశాంక మొక్కటి దప్ప యన్య కృతులెవ్వియు నీతఁడు రచించినట్లు కానరాదు. అది యొక్కటి చాలదా యతని కవిత్వము నాంధ్రభాష మన్నంత కాలమును స్థిరముగ బాదుకొల్పుటకు? తారాశశాంకమును జదివి యానందింపని యాంధ్రుఁ డక్షరజ్ఞుఁ డెవ్వఁడును లేడు, దూషింపని యాధునిక వాఙ్మయ విమర్శకుఁడును లేడు. తారాశశాంక మైదాశ్వాసముల కావ్యము. అందలి యితివృత్తమాంధ్రలోకమునకు సుపరిచితమే. పురాణ గాథలలో రంభా నలకూబరుల కథ, యింద్రాహల్యల వృత్తాంతము, తారా శశాంకోదంతము, రాధా మాధవాఖ్యానము మున్నగునవి సుప్రసిద్ధములైనవి. ఇందు రంభా నలకూబరుల కథను సవరము చిన నారాయణ రాజు దన కువలయాశ్వ చరిత్రయందును, నింద్రాహల్యల చరిత్రను సముఖము వేంకటకృష్ణప్ప నాయకుఁడు దన యహల్యా సంక్రందనమునందును రాధా మాధవ ప్రణయగాథ నతఁడే తన రాధికా సాంత్వనమునను, ఇలిదిండ్ల వేంకటపతి తన రాధా మాధవ సంవాదమునను వర్ణించిరి. మిగిలియుండు తారా శశాంకము శేషము వేంకటపతికి దక్కినది. పురాణములం దచ్చటనో యడఁగియుండిన, తారా శశాంక కథను బయటికీడ్చి తన యసామాన్య కవిత్వ వైభవము ప్రకటమగునట్లు మనోహర కావ్యమును రచియించి దక్షిణ భారత ప్రబంధ కుంతలికిని ప్రియతమమైన ప్రణయ గాథగ చెలామణిలోనికి దెచ్చినాడు. తారా చంద్రుల మోహమును వివరించునపుడు హద్దుమీఱి శృంగారమును పచ్చిగ వర్ణించి గ్రామ్య ధర్మములతో దానికైక్యము గల్పించినాఁడు. మఱియు, "దాటాకులలోన వ్రాసిరి పరాంగన గూడిన పాపం"బనియు, "నెన్ని పువ్వుల వ్రాలదు తేటి యప్పు మగవా డనువానికి దోసమున్నదే" యనియు దుర్నీతిని బోధించినాడని విమర్శకు లితని గర్హించినారు, దుర్నీతిని వర్ణించునపుడే కవి తన యసమ్మతిని దెలుపు వాక్యము ప్రయోగింపకపోయినాడనియు, అంకు మంచిదని సాధించుటకొఱకు పురాణములనుండి దృష్టాంతముల నుదాహరించినాడనియు దెగడినారు. ఈ విమర్శయందు సత్యము లేకపోలేదు. కాని తారా శశాంకాది శృంగార కావ్యములను విమర్శించునపుడు సమస్త విషయములవలె గవిత్వ స్వభావముగూడ దేశకాలానుగుణ్యముగ మారుచుండునను నిజమును స్మరణయందుంచుకొనవలయును. ఒక దేశమువారు మఱియొక దేశము వారికిని యొక కాలము వారింకొక కాలము వారికిని ముక్కుకు సూటిగ వ్రాయజాలరు. ఆధునికాంధ్రులాంగ్ల విద్యానిష్ణాతులు, వారి యభిరుచులన్నియు సీమనుండి దిగుమతియైనవి. వారి యాదర్శములన్నియు మిషనరీ ఫాదిరీ దొరల కర్మాగారములలో దయారు చేయబడినవి. కావున ఆధునిక దృష్టితో మన పూర్వ సాహిత్యమును విమర్శింప జూచుట సరికాదు.

మఱియు నెల్లప్పుడును కవులుగాని యన్య గ్రంథకర్తలు గాని సమకాలికుల మెప్పు నాకాంక్షించియే కృతులను రచియింతురు. చేమకూర వేంకట కవి యంతటి ప్రతిభావంతుఁడు గూడ "ఏగతి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరే కదా" యని వందురినాఁడు. శేషము వేంకటపతి వర్ధిల్లినది నాయక యుగమునందు; నాయక యుగము శృంగార యుగమని చెప్పియున్నాను. అందును తిరుచినాపల్లియందు విజయరంగ చొక్కనాథుని యాస్థానమునందువి శృంఖలమై పెల్లుకొన్నది. ఆ సంస్థానమందలి రసిక శిఖామణులు మెచ్చునట్లు కవిత్వము చెప్పజాలని కవికి గణ్యతలేదు. కావున తారాశశాంకమునందలి దోషములకు మూలకారణ మప్పటి వాఙ్మయాభిరుచులని చెప్పవలసి యున్నది. మఱియు గావ్య నాటకాదులలోని పాత్రల యభిప్రాయములను విమర్శకుల కంటగట్ట జూచుట న్యాయముగాదు. పాత్రపోషణ కొఱకు కవులును నాటక కర్తలును నానా పాత్రల స్వభావములకు దగిన మాటలను అభిప్రాయములను వాని ముఖాంతరమునుండి వెడలజేయుదురు. కావున పరాంగన గూడుట పాపము గాదనియు బురుషునకు దోషము లేదనియుఁ దారచేఁ బలికించినంత మాత్రమున శేషము వేంకటపతి కట్టి యభిప్రాయములు గలవనియు, దుర్నీతిని బోధించు నుద్దేశముతో నతఁ డామెచే నట్లు పలికించెననియు నెంచుట తప్పు.

ఇది సంభావనీయమైనను గాకపోయినను శేషము వేంకటపతి యసాధారణ ప్రతిభాశాలియైన మహాకవి యనుట నిర్వివాదాంశము. చేమకూర వేంకట కవి యనంతర మింతటి గొప్ప కవి మఱియొకఁడు దాక్షిణాత్యాంధ్రులలో బుట్టలేదు. ఆంధ్ర దేశమందలి కవులలో నీతని కీడుజోడునగినవా రెందఱో లేరు. తియ్యని తేటమాటలును, హాయి గొల్పు భావములును, హాయినైన పద్యములును, హృదయంగమమైన శైలియు, అమృతంపు సోనకెనయైన వాగ్ధారయు, యమేయ వాక్చాతుర్యమును,నసాధారణ కల్పనాశక్తియు నేకమై శేషము వేంకటపతి కవిత్వమై వెలసినది. ఇతని కావ్యమున జవిలేని మాట లేదు, రసవంతముగాని పద్యము లేదు, మనోజ్ఞము గాని భావములేదు. కావుననే నేటి దనుక నాంధ్ర లోకమును రంజింపఁ జేయుచున్నది.

వెలగపూడి కృష్ణయ్య:—ఇతఁడు బహు గ్రంథకర్త. మాలతీ మాధవము, గౌళికా శాస్త్రమను పద్య కావ్యములను, చతుర్విధ కంద శతకమును, వేదాంత సార సంగ్రహమను వచనకావ్యమును రచియించినట్లు భానుమద్విజయ పీఠికలో జెప్పియున్నాడు. ఇతని రచనలలో లభ్యమైనది భానుమద్విజయమను నాల్గాశ్వాసముల ప్రబంధ మొక్కటియే. ఇదియైనను ముద్రితము గాలేదు. "ఇతని కవిత్వము రసవంతమైనది"ని వీరేశలింగముపంతులవారి యభిప్రాయము. ఆంధ్ర కవుల చరిత్రయం దుదాహృతమైన,

"గిరులంబాఱెడి యేఱులట్లుగ
వడింగీర్వాణ్యపు కన్నీరులా
సుర వక్షోరుహ హార హీర
ములతో గూడం బ్రకాశింప నా
ధరణీశాంగన మున్మహోత్మ గత
సంతాపంబులో నెద్చె భా
స్వర వాసంత పికీస్వరాకలిత
వాచావైఖరీ మాధురిన్."

అను పద్యమునుబట్టి యితఁడు పెద్దన, తిమ్మన రామరాజ భూషణుల మార్గము ననుసరించి యొప్పు పద్యములను రచించెను. కాని యితనివి వారి పద్యములతో దీటుగాదు.

కుందుర్తి వేంకటాచలపతి:—ఇతఁడు పాండ్య భూనాథుఁడగు విజయరంగ చొక్కనాథుని సభయందు "కథాసు కవి" యని చెప్పుకొని యున్నాడు. కథాసు కవి యనఁగా కథల నాశువుగఁ జెప్పువాఁడని తోచుచున్నది. మఱియు దన క్రోశేయుఁడైన యా ప్రభువు కవిజన కల్పకంబనియు నఖిల కావ్య రసజ్ఞుఁడనియు నతి ధార్మికుఁడును మహానుభావుఁడనియు బ్రశంసించినాఁడు. ఇది వాస్తవము. తంజావూరి రఘునాథ విజయరాఘవుల యనంతర మింతటి పండితుఁడును, ఉదారుఁడునైన విద్వత్ప్రభువు మఱియొకఁడీ యాంధ్ర ప్రపంచమున బుట్టలేదు. వేంకటాచల కవి తాను పెక్కు గ్రంథములను రచించినట్లు తన మిత్రవిందాపరిణయ పీఠికయందు వచించియున్నాఁడు.

భారత భాగవతములను వచనకావ్యములును, బహు నాటకములను జాటుకృతు లనేకములను జెప్పెనట. ఈ నాటకములు యక్షగానములు కావచ్చును. మిత్రవిందాపరిణయమొక్కటి దప్ప ఇతని తక్కిన కృతు లన్నియు నామ మాత్రావశిష్టములై పోయినవి.

మిత్రవిందా పరిణయ మాశ్వాసముల ప్రబంధము. శ్రీకృష్ణ మిత్రవిందల వివాహమును వర్ణించునది ఇందలి యితివృత్తము. ఈ కవి కాలము దప్పి నాయకయుగమున బుట్టెను. సమకాలిక కవిత్వ లక్షణము లనేకము లితని గ్రంథమున గానరావు. కవిత్వము మంచిదే, కాని జీవ కళ యల్పము. సాంప్రదాయసిద్ధమైన ప్రబంధ లక్షణముల నన్నిటిని తు, చ తప్పక యనుసరించినాడు. పురవర్ణన, చతుర్జాతుల వర్ణన, చతురంగబలవర్ణన, పుష్పలావికా వర్ణన, రాజ వర్ణన, గ్రీష్మర్తు వర్ణన, వర్షర్తు వర్ణన, శరదృతు వర్ణన, దౌహృద వర్ణన, బాలక్రీడాది వర్ణన, యౌవన వర్ణన, కాసార వర్ణన, వసంత వర్ణన, వన విహారము, జలక్రీడ, మన్మథ పూజ, అస్తమయ వర్ణన, జ్యోత్స్నాది వర్ణన, చంద్రదూషణ, సూర్యోదయ వర్ణన, రణ వర్ణన, రత్నాకరవర్ణన మున్నగునవి యీ గ్రంథమున గానవచ్చు ముఖ్య వర్ణనలు. ఇవి కథయందు సందర్భోచితముగ వచ్చునవి కావు. ఇందలి కథ వర్ణనల ననుసంధింప పరపాదించిన సూత్రము. గతానుగతికులై పూర్వ మన్యులు చేసిన వర్ణనలనె చర్వితచర్వణముగ జేయు కవికి స్వాతంత్ర్య మెక్కడిది? కల్పనాశక్తి యేది? కాని పూండ్ల రామకృష్ణయ్యగారి వంటి రసజ్ఞులు "ఇక్కవిత యక్కజపుం గల్పనానల్పచాతుర్యమునం జేసి మనుచరిత్రాదుల కెనయనం దనరు" అని సెలవిచ్చినారు. కటకటా!



ఇహపరాలు

శ్రీ వసంతరావు వేంకటరావు

★

1945 వ సంవత్సరం జూలై 16 వ తేదీని విజ్ఞాన చరిత్రలోనే కాక మానవచరిత్రలో సైతం నూతన యుగం ప్రారంభమైంది. ఆనాడు మానవు డిచ్ఛాపూర్వకంగా పరమాణు కేంద్రకాన్ని (*nucleus*) భగ్నం చేసి, అపారమైన కేంద్రకశక్తిని ప్రణాళికప్రకారంగా విడిపించేడు. ఆనాడు మొదటి ఆటంబాంబు పేలింది. అమెరికాదేశపు న్యూమెక్సికో యెడారిలో ఆ ప్రయోగం జరిగింది. మొదటి ఆటంబాంబు పేలినప్పుడు "మధ్యాహ్న మార్తాండునికంటె ఎన్నోరెట్లు ఉజ్జ్వలమైన వహ్నిగోళం పైకెగసింది; దానితో ఉత్పన్నమైన వాయు తాపానికి 250 మైళ్ళ దూరంలోనున్న కిటికీలు గజగజలాడేయి. ప్రయోగస్థానానికి 3 మైళ్ళ దూరంగానున్న పర్వతపంక్తి స్పష్టంగా కనిపించింది."[1] ప్రత్యేకంగా నిర్మించబడిన పెద్ద ఉక్కుకట్టడంపై ఆ బాంబును పేల్చేరు. ప్రేలుడుతో జనించిన తీవ్రమైన తరంగాలధాటికి 5 మైళ్ళ దూరంలోనున్న ఇద్దరు పరిశీలకులు క్రింద పడ్డారు. కుక్కగొడుగు ఆకారంలో రంగురంగుల వాయువులు దట్టమైన మేఘంవలె 40,000 అడుగులు పైకి మహావేగంతో ఉబికేయి. ఉక్కు కట్టడం యావత్తు అత్యల్పకాలంలో మండి, భస్మమై, వాయురూపంలో మాయమైందంటే, ఆటంబాంబు పేలినప్పుడెంత పరిమాణంగల శక్తి జనించిందో, కొంతవరకు, ఊహించుకొనే అవకాశం కలుగుతుంది.

1945 వ సంవత్సరానికి పూర్వమే పరమాణు శక్తి విడుదల చేయబడింది. పరమాణుకేంద్రక భగ్నానికి సంబంధించిన మొదటివార్తలు 1939 లో జర్మన్ విజ్ఞానులు ఆటోహాన్, లైస్ మైట్నర్లనుండి వచ్చేయి. వారు ప్రయోగాలు చేస్తూ "సహజంగా అస్థిరమైన యురేనియం కేంద్రకాలను న్యూట్రానులతో ఘట్టించగా, యురేనియం కేంద్రకాలు రెండు ఖండాలుగా భగ్నమైనట్లు వారు కనుగొన్నారు. వాటిలో ఒక ఖండం బేరియం కేంద్రకంవలెను, రెండవది క్రిప్టాను కేంద్రకంవలెను పోలివుంది. అప్పటికి తెలిసిన కేంద్రకప్రక్రియలలో విడివడిన శక్తికి పై ప్రక్రియలో విడివడిన శక్తి కొన్ని వందలరెట్లుంది."[1] ఇట్లు, అమెరికన్ విజ్ఞానులు కొంతమంది ప్రణాళిక ప్రకారం పరమాణు శక్తిని విడుదలచేయడానికి ఆరు సంవత్సరాల పూర్వమే అట్టి అవకాశమున్న వార్తలు జర్మనీనుండి వచ్చేయి.

పరమాణు చరిత్ర హృదయంగమమైనది, సంకులమైనది కూడా. చాలాకాలంవరకు పరమాణువు అవిభాజ్యమని భావించేవారు. ఏట్టి రాసాయనిక ప్రక్రియవల్ల భిన్నం చేయబడని అత్యంత సూక్ష్మకణంగా పరమాణువుని నిర్వచించేరు. ప్రతి మూలతత్వం దానికి సహజమైన పరమాణువుల సముదాయం. ఒకమూలతత్వంలోని పరమాణువులన్నీ ఒకేవిధంగా నుంటాయి; వాటి భారమొకటే, ఆకారమొకటే, పరిమాణమొకటే. వివిధమూలతత్వాల పరమాణువులలో వ్యత్యాసముంది. ఒకప్పుడు

1. *George Gamow : The Birth and Death of the Sun.*

92 మూలతత్త్వాలున్నాయనుకొన్నారు. కాని 98 ఉన్నట్లు ఇటీవల తెలియవచ్చింది.

కొన్ని మూలతత్త్వాల ప్రవర్తన అవిభాజ్య పరమాణు భావానికి వ్యతిరేకంగా నున్నదని 19 వ శతాబ్దాంతంలో కొన్ని పరిశోధనలవలన విశదమైంది. అట్టి మూలతత్త్వ పరమాణువులు యాదృచ్ఛికంగా భిన్నమై శక్తిని విరజిమ్ముతాయి. ఆ ప్రక్రియను రేడియో ధార్మికత్వమంటారు. పరమాణు విచ్ఛిన్నంలో మూడురకాల కిరణాలు బహిర్గతమౌతాయి. అవి ఆల్ఫా, బీటా, గామాకిరణాలు. ఈవిధంగా కొన్ని మూలతత్త్వ పరమాణువు లెందుకుభిన్నం కావాలో కారణం తెలియలేదు. అందుచేత ఆ సంఘటనను 'యాదృచ్ఛిక విచ్ఛిత్తి' (*Spontaneous disintegration*) అన్నారు. యురేనియం, రేడియం మొదలైన కొన్ని మూలతత్త్వాలు విచ్ఛిన్నమైంది, పరమాణుభారం తక్కువగానున్న తత్త్వలుగా ఏర్పడి తుదకు సీసమౌతాయి. పరమాణువు భిన్నమౌతుండడానికి రేడియో ధార్మికత ప్రబల తార్కాణము. కాని, పరమాణువునకు నిర్మాణముంటే దాని విధానమేమిటో విజ్ఞానులకు బోధపడలేదు.

సుమారు ఆ సమయమందే మరికొన్ని ప్రయోగాలను కొందరు విజ్ఞానులు చేస్తుండేవారు. గాజు నాళానికిరువైపుల రెండువిద్యున్మార్గాల(*Elecrodes*) నమర్చి, దానిలో గాలిని చాలవరకు తీసివేసి, దాని ద్వారా విద్యుత్తును పంపినప్పుడు, ఋణమార్గమైన కేథోడునుండి కిరణజాలం సూటిగా ధనమార్గంవైపు ప్రసరించినట్లు కనుగొన్నారు. ఏ పదార్థంతో కేథోడును చేసినప్పటికి ఒకేవిధమైన ఋణ విద్యుత్కణ ప్రవాహం ఆ గాజు నాళంలో గమించేది. అది ఎలక్ట్రాను ప్రవాహమని సూక్ష్మమైన ప్రయోగాలవల్ల నిర్ణయింపబడింది. ఈ ఎలక్ట్రానులు ప్రతి పరమాణువులో నున్నాయి. అయితే, పరమాణువు విద్యుదావేశంలేని తటస్థ కణమౌటచేత, ఋణావేశానికి సమానమైన ధన విద్యుదావేశం అందులో నుండక తప్పదని స్పష్టమైంది. ఆ ధన విద్యుదావేశాలు ప్రోటానులు; ప్రోటానుయొక్క ధనవిద్యుదావేశం ఎలక్ట్రానుయొక్క ఋణవిద్యుదావేశానికి సమానమే. కాని, ద్రవ్యరాశి (*Mass*)లో మాత్రం ఎలక్ట్రానుకి ప్రోటాను సుమారు 1850 రెట్లుంది. అందుచేత, ఎలక్ట్రాను ప్రోటానులతో పరమాణు వేర్పడిందని భావించేరు. కొన్ని పరమాణు చిత్రాలు ప్రతిపాదింపబడ్డాయి. సౌరమండలాన్ని పోలిన చిత్రం ఒకప్పుడు ఆమోదింపబడింది. తరువాత న్యూట్రాను, పాజిట్రాను మెసాను మొదలగు మరికొన్ని ప్రాథమిక కణాలు బయల్పడ్డాయి.

కొన్ని న్యూట్రానులు ప్రోటానులు కలిసి కేంద్రకం (*nucleus*)గా ఏర్పడి, సౌరమండలంలో సూర్యునివలె నుంటాయి. ఆ కేంద్రకం చుట్టూ ఎలక్ట్రానులు వివిధ కక్ష్యలలో గ్రహాలవలె తిరుగుతాయి. కేంద్రకంలో నున్న ప్రోటానుల సంఖ్యకు, కక్ష్యలలో తిరుగు ఎలక్ట్రానుల సంఖ్య సమానము. బాహ్యకక్ష్య ఎలక్ట్రానులను సులభంగా విడదీయవచ్చు. అప్పుడు, మిగిలిపోయిన పరమాణు భాగానికి విద్యుదావేశం లభిస్తుంది. ఆవేశ పూరితమైన పరమాణువును 'అయను' (*Ion*) అన్నారు. కాని, పరమాణు కేంద్రకాన్ని భిన్నంచేయడం చాల కష్టము. రసాయనికంగా కేంద్రకాన్ని విచ్ఛిన్నంచేయలేక పోయేరు. అయితే, ఎలక్ట్రాను, ప్రోటానులవంటి కణాలను మహావేగంతో కేంద్రకం వైపు విసరగల బలవత్తరమైన యంత్రాలను నిర్మించేరు. తుదకు కేంద్రకాన్ని భిన్నంచేసేరు. పరమాణువులను మార్పు చేయగల సామర్థ్యం సంపాదించేరు. పరమాణు కేంద్రకంలో నిబిడీకృతమైయున్న శక్తిని సైతం విడిపించేరు.

వివిధమూల తత్త్వాల పరమాణువులు కలిసి రకరకాల కూటాలేర్పడతాయి. అట్టి కూటాలను అణువు (*Molecule*) లంటారు. అణుసమూహాలు యౌగికాలు (*compounds*). ఒక సోడియం పరమాణువు ఒక క్లోరీన్ పరమాణువుతో సంయోగించినప్పుడు ఉప్పుయొక్క అణు వేర్పడుతుంది. ఒక ఆమ్లజని పరమాణువు రెండు ఉదజని పరమాణువులతో రసాయనికంగా కూడినప్పుడు ఒక నీటి అణువు లభిస్తుంది. ఎనిమిది కర్బన పరమాణువులు పద్దెనిమిది ఉదజని పరమాణువులతో ఒకవిధంగా సంయోగించినప్పుడు ఆక్టేన్ పెట్రోలుయొక్క అణు వేర్పడుతుంది. మూడు కర్బన పరమాణువులు, ఐదు ఉదజని పరమాణువులు, మూడు నత్రజని పరమాణువులు, తొమ్మిది ఆమ్లజని పరమాణువులు కూడి ఒక విధంగా ఏర్పాటైనప్పుడు ప్రేలుడు పదార్థమైన నైట్రోగ్లిసరీన్, అణువు సిద్ధిస్తుంది.


ఒక యౌగిక రాసాయన ప్రక్రియకు లోనై వేరొక యౌగికంగా మారినప్పుడు, మొదటి యౌగికాణువులలోని పరమాణువుల క్రమం చెదరి రెండవ

యోగి కాణువులలోనున్న క్రమంలో అవి తిరిగి నిర్మాణమైనట్లు భావించాలి.

నేలబొగ్గును బాగా వేడి చేసినప్పుడు దాని ఉపరితలమందున్న కర్బన పరమాణువులు, గాలిలోని ఆమ్లజని పరమాణువులతో సంయోగించడంవల్ల వేడి విడివడుతూంది. ఉపరితల కర్బన పరమాణువులు మాత్రమే పాల్గొను ఈ ప్రక్రియ మందంగా సాగుతుంది. కాని, మోటారు సిలిండరులో వాయు రూపంలో నున్న పెట్రోలు, గాలితో సంయోగించినప్పుడు సైతం ఇట్టి మార్పే కలుగుతున్నప్పటికీ అది మహా త్వరితంగా సంభవిస్తుంది; ఏమంటే, వాయురూపంలోనున్న పదార్థం అధిక పరిమాణంలో గాలితో సంయోగించు అవకాశమున్నది.

నైట్రొగ్లిసరీనువంటి స్ఫోటకపదార్థాన్ని ఒకనిశ్చిత తాపక్రమానికి వచ్చేవరకు వేడిచేసేసరికి, అందులోని అణువులుతీవ్రమైన ఉష్ణప్రకంపనాలకులోనౌతాయి. అట్టి స్థితిలో, అణు మధ్యంనుండి నత్రజని పరమాణువులచే వేరుచేయబడిన ఉదజని కర్బన పరమాణువుల సమీపానికి ఆమ్లజని పరమాణువులు రాగల ప్రమాదం సంభవించవచ్చును. ఉదజని కర్బన పరమాణువులతో సంయోగానికై ఆమ్లజని పరమాణువుల కాసక్తి ఎక్కువ. అందుచేత, సంకులమైన ఆ అణువులోనున్న పరమాణువులు చెదిరిపోయి వేరొక క్రమంలో నిర్మాణమౌతాయి. ఈ క్రింది చిత్రంలో ఆ ప్రక్రియలో అణువు ముక్కముక్కలుగా భిన్నమౌతుంది; దానితో పాటు ఎక్కువ శక్తి విడుదల అవుతుంది. ఇది మహా వేగంగా సంభవించడంచేత దీనిని విస్ఫోటనం (explosion) అంటారు. విస్ఫోటనంలోనున్న విశేషమేమంటే ఆ ప్రక్రియలో పాల్గొను పరమాణువులన్నీ ఒకే అణువులో నున్నాయి. అందుచేత ఆపరమాణువుల సంయోగం లవమాత్రంలో జరిగిపోతుంది.

మండడానికి విస్ఫోటనానికి భేదం వాటిలో విడివడు శక్తి పరిమాణంలో గాక, శక్తి జనించే వేగంలో మాత్రమే ఉంది. ఉదాహరణకు, అవసరమైన ప్రాణవాయువుతో కలిసిన అక్టేన్ పెట్రోలు ఒక గ్రాము మండినప్పుడు 2500 కాలరీల వేడి జనించగా, టి. ఎన్. టి. అనే విస్ఫోటక పదార్థం 1 గ్రాము ప్రేలినప్పుడు 1000 కాలరీల వేడి మాత్రమే విడివడుతుంది. అయితే, ఆ పెట్రోలు మండడానికి సెకండులో పదియవ వంతుకావలసి



నైట్రొగ్లిసరీన్ విస్ఫోటనం చెందు విధానం. తీవ్రమైన ఉష్ణప్రకంపనాలచేత నైట్రొగ్లిసరీన్ అణువు భిన్నంకాగా శక్తి విడివడుతుంది.

వస్తే కొన్ని మైక్రో సెకండ్ల (సెకండులో పదిలక్షలయవ భాగం)లో నే టి. ఎన్. టి. ప్రేలుతుంది.[2]

పరమాణుశక్తి ఇట్టి ప్రక్రియవల్ల విడుదలవదు. బరువైన పరమాణుకేంద్రకం విచ్ఛిన్నమైనప్పుడు ఆ ద్రవ్యంలో కొంతభాగం శక్తిగా పరిణామ మొందుతుంది. అది అత్యంత స్వల్పమే కావచ్చు; కాని, పరమాణుకేంద్రకనిర్మాణం మార్పు ద్రవ్యం శక్తిలోనికి మారడానికిది నిదర్శనము. ఒక గ్రాము ఎల్యూమినియము శక్తిలోనికి పూర్తిగా మారినప్పుడు 1400000000 కాలరీల వేడి జనిస్తుంది; ఒక గ్రాము యురేనియం శక్తిలోనికి పరివర్తన మొందితే 19000000000 కాలరీల వేడి ఉద్భవిస్తుంది. ఈ సంఖ్యల పరిమాణాన్ని అవగాహన చేసికోవాలంటే, ఒక గ్రాము యురేనియంనుండి లభించు శక్తి 19 టన్నుల టి. ఎన్. టి నుండి కాని లభించదని గమనించాలి. ఇంత వ్యత్యాసానికి ముఖ్య కారణమేమంటే మంటలోను ప్రేలుడులోను విడుదలవునది రాసాయనిక శక్తి, పరమాణువుల ఏర్పాటు మారినప్పుడు అది బహిర్గమిస్తుంది; పరమాణు విచ్ఛిత్తిలో విడుదలవునది కేంద్రకశక్తి, కేంద్రక నిర్మాణం మారినప్పుడు కొంత ద్రవ్యం శక్తిరూపంలో ఆవిర్భవిస్తుంది.

అపారము, ప్రమాదకరమునైన ఇట్టి పరమాణుశక్తిని నడిపించగల సామర్థ్యాన్ని సంపాదించి మానవుడు నాగరికప్రపంచంలో ప్రయోగించడానికి ప్రయత్నిస్తున్నాడు. వినియుక్త విజ్ఞానంవల్ల జీవిత సౌభాగ్యాలు పెంపొందుతున్నాయి; పారిశ్రామిక దశలలో భూలోకస్వర్గం నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మానవుడెట్టి శ్రమించవలసిన అవసరం లేకుండా యంత్రాలు చాలవరకు వానికి తోడ్పడుతున్నాయి.

పరమాణుశక్తిని మానవ శ్రేయస్సుకు మాత్రమే వినియోగించినట్లైతే ఐహిక దుఃఖాలు చాలవరకు తగ్గుతాయి. పరమాణు విచ్ఛిత్తిలో జనించిన రేడియో ధార్మికపు ఐసోటోపులు వైద్యంలో లాభదాయకంగా పనిచేస్తున్నాయి. కొన్ని పదార్థాలు మానవశరీరంలో ఏవిధంగా ఇమిడిపోతున్నాయో తెలిసికోడానికి ఇవి ఉపయోగకరంగా ఉన్నాయి.

మొదటి పరమాణుశక్తివల్ల మానవజీవితం ఎట్లు మారిపోతుందో అన్న విషయంపై రచయితలూహాగానం చేసేరు. కొందరేమన్నారంటే : "మున్ముందిక రైలుగోర్ల అవసర ముండదు. మానవులు వాతావరణంపై ఆధారపడవలసిన అగత్యముండదు. సొరంగాలలో చక్కటి ఇండ్లు కట్టుకొని, సుఖంగా జీవించడానికై పరమాణు శక్తిని వినియోగిస్తారు. వ్యవసాయం కూడ భూగర్భంలోనే సాగిస్తారు. అతివృష్టి అనావృష్టుల బాధలు కాని, ఝంఝూవాతాల భయంకాని ఉండదు."[3]

ఇంకొకవంక చూస్తే అటమ్‌బాంబు చేసిన విధ్వంసం హృదయవిదారకంగా గోచరిస్తుంది. శతాబ్దాలనుండి శ్రమించి చీమలు పుట్టలు పెట్టుకొన్నట్లుగా మానవులు మెల్లగా నిర్మించుకొన్న మహానగరాలను, నగర సౌధాలలో సుఖంగా జీవించు అమాయకజనులను కనురెప్పపాటులో ధ్వంసం చేయగల సామర్థ్యం పరమాణుశక్తి కుంది. వేలకొలది విజ్ఞానులు సహకారభావంతో కృషిచేసి నిర్మించిన వివిధరమ్య విజ్ఞాన సౌధాలు, అంతశ్శక్తి ప్రచోదితులై అత్యల్పమైన ఉపకరణాలతో కళాకారులు సృష్టించిన కళాఖండాలు, ఆత్మజ్ఞాన ప్రభావంచే యోగీశ్వరులిచ్చిన సందేశాలు పరమాణుశక్తి వహ్నికి పాల్పడి లయమయ్యే అవకాశముంది. నాగరికతా వ్యాప్తికి సహకరించిన మానవ సృష్టియే వానిని నిర్దాక్షిణ్యంగా కబళింపనుంది. మానవుడొక విచిత్రస్థితిలో ఇప్పుడున్నాడు. సహనంతో న్యాయమైన సృజనాత్మక పథాల ననుగమించేడా భూలోకస్వర్గం నిర్మింపగలడు; ఈర్ష్యాపూరితుడై అహంకారంతో స్వార్థపరత్వానికే దాసుడైనాడా యావత్ ప్రపంచాన్ని మంటబెట్టి నాశనం చేయగలడు. ఈ రెండింటిలో ఏదో ఒకటి సంభవించక తప్పదు.

ఇట్టి క్లిష్టసమయంలో "పరమాణు యుగంలో జీవితం" అను విషయాన్ని సమగ్రంగా విజ్ఞాని బెర్‌ట్రండ్ రస్సెల్ విమర్శించేరు. అనాదిగా మానవుడు పాల్గొంటున్న మూడు విధములైన సంగ్రామాలను రస్సెల్ సూచించేరు. అవి, మానవుడు ప్రకృతితో సాగించు సంగ్రామం, తోడిమానవులతో సాగించు సంగ్రామం, మానవుడు తన అంతఃకరణతో సాగించు సంగ్రామం. భౌతిక విజ్ఞానం సాంకేతిక నైపుణ్యం కలిసి ప్రకృతితో యుద్ధాన్ని సాగిస్తున్నాయి; రాజకీయాలు, యుద్ధాలు కలిసి తోడి మానవులతో సంఘర్షిస్తు

2. *George Gamow : Atomic Energy in Colmic and Human Life.*

3 *Hawley & Leifson: Atomic Energy in war & Peace.*

న్నాయి; అంతరంగికంగా జరుగు సంఘర్షణను, ఇతఃపూర్వం, మతం కొనసాగించింది. అంతరంగిక సంఘర్షణను శాస్త్రీయంగా వివరించడానికి మానసిక విశ్లేషణ మొదలగు పద్ధతులకు సాధ్యమౌతుందని కొందరు భావిస్తున్నారు. కాని, ఇతర సహాయం లేకుండా ఈ పద్ధతులు మాత్రమే ఆ పని చేయగలవా అను సందేహం రస్సెల్‌కుంది. ఈ మూడురకాల యుద్ధాలలో మానవులు ప్రకృతితో చేస్తున్న యుద్ధం ప్రధానమైంది. ఏమంటే, అందులో జయిస్తే కాని మానవుడు బ్రతికే అవకాశమే లేదు.......సాంకేతికాభ్యున్నతివల్ల, అంతవరకున్న శత్రువులను పరిమార్చడంకంటె వారితో సంధి చేసికొనడంవల్లనే మానవులు పురోగమించగల ఒకానొక అవస్థ మానవ పరిణామంలో వస్తుంది. అట్టి అవస్థవచ్చినప్పుడు, తోడిమానవులతో చేయు యుద్ధాల నాపవలసిన అవసరం కలుగుతుంది. అట్టి అవస్థలో, మానవుడు అంతరంగంతో సాగించు యుద్ధాన్ని ముఖ్యంగా పరిసమాప్తం చేయవలసియుంది. ఇప్పుడు మానవులట్టి పరిస్థితిలోనే ఉన్నారు.

మానవుడు తన అంతరంగంతోను, తోడిమానవులతోను యుగయుగాలుగా కొనసాగిస్తున్న యుద్ధాలు మానవ స్వభావాన్ని ఒక ప్రకారంగా సంస్కరించేయి. ఒకప్పుడది యుక్తంగా నుండేది; ఇప్పుడు మాత్రం ఆ స్వభావం అవ్యవహార్యమైంది. తరతరాలుగా జరుగుతూన్న బాహ్యయుద్ధాల ప్రభావం ఆత్మయందు జరుగు అంతరంగిక యుద్ధంపై కనిపించక పోలేదు. ఈ అంతరంగిక యుద్ధంలో ఒక భాగం రెండవభాగాన్ని 'పాపం' అని నామకరణంచేసి, దానిని నిర్మూలించడానికి నిశ్చయించింది. అయితే, బాహ్యయుద్ధాలలో నిర్ణయమైనంత నికరంగా జయాపజయాలు అంతరంగిక యుద్ధాలలో నిర్ణయంకాక పోవడంచేత, అపజయం పొందినప్పటికి పాపం తన నికృష్టపు తలను పదే పదే పైకెత్తుతుండేది. ప్రప్రథమంగా, బాహ్యయుద్ధానికి ప్రతిబింబమైన అంతరంగికయుద్ధం, నేడు, బాహ్యయుద్ధాలకు కారణభూతమౌతోంది.

తమస్వభావంలో పాపమొక భాగమే కాని, తమ ప్రతిపక్షుల స్వభావమంతా పాపమే అని మానవు లనుకొంటారట. అందుచేత వారికి ఆత్మశాంతి ఉండదు; అంతరంగిక శాంతిని పొందలేని ఆత్మ ప్రపంచంలో శాంతియుతంగా జీవించలేదు. నిజమైనయుద్ధం అంతరంగికమైనదే అన్న విషయాన్ని ముఖ్యపరచటానికి తమలో తాము మానవులు పోరాడుకొంటారు. కాగా, మానవ పరిణామంలో ప్రముఖస్థానం వహించేది మానవుని అంతరంగిక యుద్ధం.

మానవులలో అన్యోన్యంగా ఐక్యభావం కుదరవచ్చును. కాని, తమలో ఒక భాగాన్ని నిర్మూలించవలసిన శత్రువుగా ఎప్పుడు వారు పరిగణించడం మాని, అంతరంగికమైన ఐక్యభావాన్ని సిద్ధింపచేసికొంటారో, అంతవరకు, ఈ అన్యోన్య ఐక్యభావానికి యాథార్థ్యం సమకూరు అవకాశమే లేదు.

మానవాభ్యుదయానికి అన్యోన్యమైన ఐక్యభావం అంతరంగికమైన ఐక్యభావంకూడ అత్యంతావశ్యకములే. పరమాణుశక్తి ప్రపంచాన్ని కబళింపనున్న ఈ సమయంలో దీని ప్రాముఖ్యమెంతేనా ఉంది. ఐతే, అంతరంగిక ఐక్యభావం ఎట్లు సిద్ధిస్తుంది? మానవులలో జరుగు యుద్ధాల ప్రతిబింబమేనా ఈ అంతరంగిక యుద్ధం? బాహ్యయుద్ధాల జోలికే పోని మహామహులు విజ్ఞానాన్ని పెంపొందించుకోడానికి, జగత్తుతో మానవునికి గల సంబంధాన్ని తెలిసికోడానికి తీవ్రమైన అంతరిక యుద్ధాలు చేయలేదా? మానవు లొకరితోనొకరు పోట్లాడుకోడానికై ఆయుధాలను నిర్మించకపూర్వమే, కొన్ని సహస్రాబ్దాలకు ముందు, తమ భౌతికదేహాలెట్లు క్షీణించినా పరిగణింపక, కొందరు మహాత్ములు దీక్షగా అంతరంగిక యుద్ధాన్ని సాగించేరు. వారికి బాహ్యయుద్ధాల ప్రసక్తే లేకపోయింది. ప్రకృతిశక్తుల వశీకరణంపై పెంపొందిన పాశ్చాత్య నాగరికత పై విషయాన్ని గమనించలేక పోవచ్చును.

మానవుడు సుఖంగా జీవించగలిగిన మాత్రాన్న సత్ప్రవర్తకుడౌతాడని చెప్పలేము. అసౌఖ్యనివారణంవల్ల సహనము సౌభ్రాత్రము పెంపొందకపోవచ్చు.

నిబిడ కాంతారవాసియైన మానవుడు నాగరికతా రశ్మిని సందర్శించడానికై బాటలు వెదకుకొంటూ అనేక కష్టాలకు లోనైనాడు. భయంకర ప్రకృతిచే ఆవరింపబడి, భీకర మృగ దౌష్ట్యానికి చిక్కి, ఆకలిదప్పుల బాధల కున్మాదియై, భయవిహ్వలుడై, అజ్ఞాన తిమిరాన్ని దాటి జ్ఞానక్షేత్రంలో ప్రవేశించేడు. కాని, ఆ ప్రయత్నంలో సౌఖ్యచిహ్నమైన మందహాసాన్ని మరచిపోయేడు.

జ్ఞానరశ్మిలో ప్రవేశించేడే కాని, మానవుడా వెలుగును నమ్మలేకపోతున్నాడు. మూఢ నమ్మకాల ప్రాబల్యంనుండి తప్పుకోలేక, ప్రాథమికమైన భయద్వేషాలకు చిక్కి, తనొక నికృష్టుడైన పాపాత్ముడని

తన సేవగించుకొంటున్నాడు. రస్సెల్ ప్రకారం మానవుని కొక్కటే తరణోపాయమున్నది; తిమిర భూయిష్ఠమైన గతానికి భయాన్ని విడిచిపెట్టి, హృదయమందలి ఆనందద్వారాలను తెరవాలి. 'నేను పాపాత్ముడను కాను, దీర్ఘ కంటకావృత మార్గాన్ని ప్రయాణంచేసి, సహజమైన అవరోధాలను దాటగలుగునట్లు బుద్ధిని వికసింపచేసుకొని, స్వేచ్ఛగా ఆత్మశాంతితో జీవింపగల ఆనందమయ జీవిని. అందుచేత మానవులందరితోను శాంతియుత జీవితాన్ని గడపగలను," అని మానవుడాత్మవిశ్వాసంతో వచించాలి, దుఃఖాన్ని విడిచి ఆనందాన్ని చేపట్టినప్పుడే ఇట్టి మనస్థితి ఏర్పడుతుంది. లేదా, మానవుడు మృత్యుకోరలకు జిక్కి, నామరూపాలు లేకుండా నాశనమై పోవలసిందే4.

సహజమైన అవరోధాలను దాటచేర్చిన మానవ బుద్ధి, దురదృష్టవశాత్తు, ఆత్మశాంతిని పొందే విధానాన్ని తెలిసికోలేకపోయింది. అంతరంగిక యుద్ధంలో సంప్రాప్తమైన వివిధ మానవానుభవాలను అంతగా రస్సెల్ పరిగణించినట్లులేదు; అసలు, 'పాపం' క్రింద వాటిని కొట్టి పారవేసేడు. కాని, పాప భావానికి సంబంధం లేకుండానే సామాన్యంగా నిరంతర మానసిక సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. అదెందుకు జరగాలి?

ఏ ప్రకృతిశక్తులను జయించి వశం చేసికొందామనుకొంటున్నాడో ఆ శక్తులచేతనే ప్రచోదింపబడి మానవు డనుక్షణం కర్మచేస్తున్నాడు. అదే మానవునికి ప్రకృతికిగల అవినాభావ సంబంధం. వాటి ప్రాబల్యంనుండి తప్పుకోలేడన్నది సామాన్యభౌతిక సత్యం. అందుచేత, మానవుడు కర్మచేస్తాడు. కర్మ చేస్తున్నప్పుడు, కొంతకాలానికైనా, తను చేస్తున్నది ఒప్పో తప్పో తెలిసికోవాలని పర్యాలోచిస్తాడు. సహజమైన మనః ప్రవృత్తికనుగుణ్యంగా ప్రవర్తిస్తే, సాధారణంగా, దుఃఖం కలుగుతుందని కొద్దిపాటి అనుభవంవల్ల గ్రహిస్తాడు. అంటే, యుక్తాయుక్త విచక్షణానికి అవసరం ఏర్పడింది. రోడ్డుమీద పోతూంటే ప్రక్కనున్నవానిని లెంపకాయ కొట్టడం తప్పా అంటే, నైతికధర్మం అట్టి ప్రవర్తనాన్ని నిషేధిస్తుందని చెప్పుకోవాలి. జనులందరు మంచిగా ప్రవర్తిస్తారని ఆశిస్తాము. కొంతవరకట్లే జరుగుతుంది. మన నిత్యజీవితాలు చెప్పుకోదగ్గ సంఘర్షణ లేకుండా సాగుతుంటాయి.

4. *Bertrand Ruesell : Living in an Atomic Age.*

మనలో కొందరనువర్తనగా నుంటారు; కొందరెప్పుడు కయ్యానికి కాలుదువ్వుతారు. మంచివారు కూడ, కొన్ని పరిస్థితులలో విపరీతంగా ప్రవర్తిస్తారు. యోచనా రహితంగా సహజ ప్రచోదనానికి దాసులైనప్పుడు అది సంభవిస్తుంది. అట్టి ప్రచోదనలు సంఘంతో సంఘర్షించనంతకాలం ఇబ్బందిలేదు. కాని, అదెప్పుడైతే సంఘశాంతికి భంగం కలిగించి సంఘాభ్యుదయాన్ని నిరోధిస్తాయో అప్పుడు వెంటనే వాటిని అదుపులో పెట్టవలసివస్తుంది. శాంతి భద్రతలకు భంగం కలిగించేవారికి ఆనందమయంగా జీవించగల అవకాశాలు కల్పించినంతమాత్రాన వారిలో మనః పరివర్తనం కలుగుతుందా? అది అనుమానాస్పదమే. ఐహిక సౌఖ్యాలవల్లనే మానవ హృదయం సంతృప్తిచెందదు; అది అమందానందాన్ని పొందగల క్షేత్రమింకొకటి ఉంది.

కురుపాండవ సంగర ప్రారంభంలో గీతామృతాన్ని గ్రోలుతూ కృష్ణుని అర్జునుడు ప్రశ్నిస్తాడు: "పురుషుడు పాపముచేయ నిచ్ఛయించనివాడైనను ఏ కారణముచేత ప్రేరేపింపబడినవాడై నెగుడు బలాత్కారముచేత భృత్యునివలె దుష్టకర్మను ఆచరింపుచున్నాడు?" దానికి కృష్ణుని సమాధానం:

కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః
మహాశనో మహాపాప్మా విద్ధ్యేన మిహ వైరిణం॥
ధూమేనా వ్రియతే వహ్ని ర్యథాదర్శో మలేన చ
యథోల్బేనావృతో గర్భ స్తథా తేనేదమావృతమ్॥
ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా
కామరూపేణ కౌంతేయ దుష్పూరేణానలేన చ॥
ఇంద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే
ఏతైర్విమోహయ త్యేష జ్ఞానమావృత్య దేహినం॥
తస్మాత్త్వ మింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాన నాశనమ్॥
ఇంద్రియాణి పరాణ్యాహు రింద్రియేభ్యః పరంమనః
మనసస్తు పరాబుద్ధి ర్యోబుద్ధేః పరతస్తుసః॥
ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మాన
మాత్మనా
జహిశత్రుం మహాబాహో కామరూపం దురాసదం॥
(భగవద్గీత 3, 37-43)

'పురుషుడు కామమువలన ప్రతిదానిని కామించుచున్నాడు. ఈ కామము ప్రతిబంధింపబడి క్రోధరూపముగ పరిణమించుచున్నది. అందువలన క్రోధము కూడ కామమే. ఈ కామము రజోగుణమువలన బుట్టుచున్నది. ఇది మితిలేని ఉపభోగరూప

మైన యాహారము గలది. అందువలన పురుషునకు గొప్ప అనర్థ రూపమగు దోషమును కలిగించును. కావున, ఈ కామమును మోక్షమార్గమందు శత్రువునుగా తెలియుము. అప్రకాశరూపమైన పొగచేత ప్రకాశస్వరూపమగు వహ్ని కప్పబడునట్లును, చేతన స్వభావముకల ధూళిచేత ఆనందకరమగు అద్దము కప్పబడునట్లును, రజోగుణమువల్ల బుట్టిన కామముచేత సత్త్వగుణమువల్ల బుట్టిన పురుషునియొక్క జ్ఞానము మరుగు జేయబడుచున్నది. నిరంతరము భోగముల ననుభవించుచున్నను ఇంతటితో చాలు ననుట లేనిదియు, నిండింప నలవి గానిదియు, కోరికయే స్వరూపముగా గలదియు, నిత్యశత్రువును అగు ఈ కామముచేత బ్రహ్మమును గ్రహించుటకు తగిన బుద్ధి వృత్తి కప్పబడుచున్నది. ఇంద్రియములును, మనస్సును, బుద్ధియును ఈ కామమునకు ఆశ్రయమని చెప్పబడుచున్నది. ఈ ఇంద్రియాదులచేత జ్ఞానమును కప్పి, మనుష్యుని నానాప్రకారములుగ ఈ కామము మోహింప జేయుచున్నది. ఈ కారణముచేత ఇంద్రియములను నీవు మొదట నియమించి, ఆత్మజ్ఞానమును అనుభవ జన్య జ్ఞానమును నశింపజేయునదియును, పాపస్వరూప మైనదియును అగు ఈ కామమును తెన్నగా జయింపుము. శ్రోత్రాదీంద్రియములను దేహాదులకంటె శ్రేష్ఠములైనవని పండితులు చెప్పుచున్నారు. అ ప్రకారముగానే మనస్సు ఇంద్రియములకంటె ఉత్కృష్టమైనది. నిశ్చయాత్మకమైన బుద్ధి మనస్సు కంటె ఉత్కృష్టమైనది ఏ ఆత్మయైతే బుద్ధికంటె వ్యతిరిక్తమై సాక్షిత్వముచేత నున్నదో అదియే పరమాత్మ. అర్జున, ఈ ప్రకారముగ బుద్ధ్యభిమాన దేవత కంటె ఉత్కృష్టమైన పరమాత్మని తెలిసికొని, బుద్ధి చేత మనస్సును స్తంభనము చేసికొని, సులభముగా జయింపబడక కామరూపమైన ఈ శత్రువును నాశనము జేయుము."

ఇది సాధించడం ఎట్లన్నదే పెద్ద ప్రశ్న.

ఉద్ధరే దాత్మనాత్మానం
నాత్మాన మవసాదయేత్
ఆత్మైవహ్యాత్మనో బన్ధు
రాత్మైవ రిపురాత్మనః ॥
బన్ధు రాత్మాత్మన స్తస్య
యేనాత్మైవాత్మనా జితః
అనాత్మ నస్తు శత్రుత్వే
వర్తే తాత్మైవ శత్రువత్ ॥
(భగవద్గీత : 6-5,6)

"సంసారమందు నిమగ్నుడగు తనను ఆసక్తిలేని మనస్సుచేత ఉద్ధరింపవలెను. తనను అధోగతి పొందింపరాదు. తనకు మనస్సే ఆప్తకారి, తనకు మనస్సే శత్రువు అన్నది ప్రసిద్ధము ఏ పురుషునిచేత మనస్సు జయింపబడినదో వానికే మనస్సు ఉపకారకము. మన స్స్వాధీనము లేనివానికి మనస్సే ప్రసిద్ధ శత్రువువలె అపకారమును చేయు విషయమునందు ప్రవర్తిస్తు న్నది" అని భగవానుని ఆదేశము.

మనస్సుని జయించడం కష్టతరమైన కార్యము. ఎవరికివారు శ్రమించి దానిని సాధించవలసినదే. ఎట్టి బాహ్యోపకరణములుగాని, పరసహాయం గాని ఆకష్టాన్ని తగ్గించలేవు. ఎవరి మనస్థితిని బట్టి వారి కనువైన మార్గాన్ని ఎంచుకోవాలి. భగవానుని వాక్యాలలో :

ధ్యానే నాత్మని పశ్యన్తి కేచిదాత్మాన మాత్మనా
అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే,
అన్యే త్వేవ మజానన్తః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే
తేఽపి చాతి తరన్త్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః
(భగవద్గీత : 13-25-26)

"కొందరు జ్ఞానయోగమువలన పరమాత్మను హృదయకమలమందు చూచుదురు. కొందరు జ్ఞానయోగమువలన, మరికొందరు నిష్కామకర్మయోగము వలన జూచుదురు. ఈ విధముగా పరమాత్మను తెలిసికొనని వారిలో కొందరు ఇతరులవలన పరమాత్మను తెలిసికొని ధ్యానముజేయుచున్నారు. వారు కూడ శ్రవణమునందాసక్తులైనవారై మృత్యువునుదాటి ముక్తులగుదురు."

ఆత్మజ్ఞానాన్ని పొందడానికి నిరంతర సాధన అత్యంతావశ్యకము. శ్రవణ మనన ధ్యాన నిదిధ్యాసము లచేగాని అధ్యాత్మజ్ఞానం లభ్యంగాదు. ఐహిక సౌఖ్యాలలో ముంచెత్తినమాత్రాన మానవునికి యుక్తాయుక్త విచక్షణ జ్ఞానం కలుగుతుందని చెప్పలేము. ఆత్మవిషయాన్ని భౌతికవిజ్ఞానం వివరించలేదని ఆ జ్ఞానభాగమే లేదనడం పొరపాటు. అధ్యాత్మజ్ఞానానికై మనస్సెంత ప్రాకులాడుతుందో అనుభూతి గల వారికే తెలుస్తుంది.

భౌతిక విజ్ఞానచరిత్రను సమీక్షిస్తే, భౌతిక విజ్ఞానంయొక్క పరిమితత్వం అర్థమౌతుంది. అనేక సంఘటనలను సూక్ష్మంగా పరిశీలించి, పంచేంద్రియాలకు అతీతమైన జ్ఞానాన్ని సేకరించడానికి బహువిధ యంత్రాలు నిర్మించి భౌతికవిజ్ఞానులు

తమ జ్ఞానసీమలను విస్తరింపజేసికొన్నారు. జగత్తు యంత్రవత్ సాగిపోతూందన్న కాలం గతించింది. ద్రవ్యనిర్మాణం నికరంగా తెలిసిందన్న యుగం గతించింది. శక్తి లక్షణాలను పూర్తిగా గ్రహించేమన్న తరం గతించింది. పరమాణువు ద్రవ్యఖండమో శక్తికోశమో తెలియదు. ఆ రెండిటి లక్షణాలను పరమాణువు ప్రదర్శిస్తుంది. శక్తి తరంగ సమూహమో కణ పరంపరో నిశ్చయంగా చెప్పలేము; ఒకప్పుడు తరంగాలవలె ఒకప్పుడు కణాలవలె వ్యక్తమౌతుంది. భౌతిక విజ్ఞానమంత ద్వంద్వంగా నుంది.

మానవ మనస్తత్వాన్ని గుర్తించడం ముఖ్యం. ఐహిక సౌఖ్యాలతో మానవుడు సంతృప్తిపొందలేడు. భౌతికానికి అతీతమైన దానికోసం మానవ హృదయం ప్రాకులాడుతుంది. ఆ ప్రాకులాట భౌతిక విజ్ఞానానికర్థం కాదంటే ఆశ్చర్యంలేదు. అంతమాత్రాన్న అది భౌతికం లేదనడం పొరపాటు. విపరీతశక్తిని విడుదల చేయగల సామర్థ్యాన్ని మానవుడు సంపాదించిన ఈనా సమయంలో, దానిని సృజనాత్మకంగా వినియోగించాలంటే నవీన నైతిక దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. పరులను బ్రతుకనిచ్చి తను బ్రతుకగల పరిస్థితిని కల్పించ కలిగినప్పుడే పురోగమనం సాధ్యమౌతుంది. లేదా, తరతరాలుగా శ్రమించి సంపాదించిన శక్తి సర్వధ్వంసానికే దారి తీస్తుంది.

ఒంటరి పయనం

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

ఒంటరినై పోనా ? – ఈ
ఓరుగాలిలోన దొరా!

ఒంటరినై......

చిలిపి చిలిపి జగడలకు
వాలికే సింగార మెంచి
అలకదీర్చి, కలక దేర్చి
పల్కరించువారు లేక,

ఒంటరినై......

* * *

మొగలిడొంక మథుపులోన
మోము దాచుకొన్నావా?
దొండ పందిరుల కింద్రై
దోబూచాడేవ దొరా?

ఒంటరినై పోనా......

చీకటి వెలుగుల నందున
చీలిన నీ రెండలలో
జలకమాడ అడివి పిచుక
జంటలవే రివ్వు మంట

ఒంటరినై పోనా......

* * *

ఏటిమనుసుతోట సాగుసు
ఏకమయిన చోటిక్కడ
సరస నీవు లేకుంటే
సుందర మని పిస్తదోయి

ఒంటరినై......

పరమార్థం

★

శ్రీ మంథా వెంకటరమణరావు

"వెంకట్రావుగారు మీకు తెల్సునుకదూ?" వెనుకకి చేతులు కులాసాగా వదిలి అన్నారు మాస్టారు.

దగ్గరగా ఉన్న తోటలోనుండి చల్లటి గాలి తెర, నీటి కెరటంలా తాకుతూ పోయింది. నిండా బియ్యం వేసుకున్న ఒక లారీ దారి కడ్డంగా ఉండిపోయింది. క్లీనరు లేని అరవ డ్రయివరు 'బోనట్' మీదకెత్తి ఏదో మర సరిజేస్తున్నాడు. దారిలేక మరోకలారీ ముందుకి కొంత దూరాన్న నిలబడిపోయింది, పెట్రోలు కొలుస్తూ.

మొదటి గోడాము ద్వారంముందు '52 మోడలు ఫోర్డుబండీ, నగ్నంగాఉన్న కొండదానిలా నిల్చుంది. ఒక అనుగు వెడల్పుగానున్న బల్లమీదుగా కూలీలు, తూకం వేసిన బియ్యం బస్తాలను సర్కసు ఫీటులా వీపులమీద బేలెన్సు చేస్తూ తీసుకపోయి లారీలో కుదేస్తున్నారు.

"అంటే?" కొద్దిగా ముందుకు వంగి జ్ఞాపకం తెచ్చుకుంటున్న వాడిలా అడిగేను.

"మూడేళ్ళక్రితం పోయేడులెండి. పాపం, చిన్న కాలంలోనే పోయేడు."

"అంటే........."

"అంత చిన్నతనమనీ కాదు. ఓ నలభైఎనిమిది, ఆముక్క నుండొచ్చు. నేను, ముదలియారు, వెంకట్రావు, నరసింహం మేమంతా ఒకదోస్తీ, ముస్తైపు మూడు ఆ ప్రాంతంనుంచీ."

అరవ డ్రయివరు లారీ స్టార్టు చేశాడు.

బియ్యం వేసుకున్న ఎర్రలారీ ముందుకు వస్తోంది, మొదటిగేరులో, మరాం పెడుతున్న కుర్రవాడిలా.

ఆరిపోయిన చుట్టని, సిగర్ లైటరుతో ముట్టిస్తూ అన్నారు మాస్టారు. "ఈ లైటరు చూసేరా? పదేళ్ళయింది."

ఇత్తడిగిద్దెలా ఉంది లైటరు. అంత పెద్దదీ ఔను. చక్రం ఉన్నచోట టంకంతో పెద్ద అతుకు, నాసులు చివరికి చివరికి అంటించుకున్న పూజాప్రసాదంలా. పెట్రోలుపోసేద్వారాన్ని కప్పే మర పోవడంవల్ల దానిస్థానా న్నొక జీలుగుబెండు ఆక్రమించుకుంది. లైటరుకంటి కింపుగా లేకపోయినా చేతికి నిండుగా ఉంది.

"అబ్బా......!" చేతిలోకి తీసుకో నేటందుకు ధైర్యం చాలక దూరంనుంచే చూస్తూ ఆశ్చర్యపోతున్నట్టు ముఖం పెట్టి అన్నాను.

"ఇది, అతనిదగ్గర తీసుకున్నదే. సర్వీసు చేసినోడి నాదగ్గర కొచ్చింది. వాళ్ళ మేనమామదగ్గర అతను కొట్టేసేడు. మొత్తం ఎన్నేళ్ళయిందో లెక్క వేసుకోండి."

చిన్న నవ్వునవ్వి వెనుకకి చేరబడ్డాను ఏం చెయ్యడమో తెలియక.

ఎర్రలారీ కనుపించకుండా పోయింది రోడ్డు మీద. ఒక 'షెవర్లెట్' బండీవచ్చి నిలబడింది బస్తాలు వేయించుకోడానికి. లారీ నిలబెట్టి, చక్రం విప్పడం మొదలెట్టేరు డ్రైవరు.

చుట్టపొగ గాలిలోకి వదిలి, ఓ సారాకాశాన్ని, కళ్ళు చిట్లిస్తూ చూసి అన్నారు మాస్టారు. "ఓ చిన్న కథ చెప్పనా?" కొన్ని సెకండ్లాగుకొని అన్నారు. "నిజంగా జరిగిందే ఇది."

గాలికి, అతని తలమీది పండు వెంట్రుకలు, వెన్నుభారంతో ముందుకు వంగిపోయిన చేలలా ఉన్నాయి. అతని నుదుటిమీది ముడతపడ్డ కమ్ముకొస్తున్న చీకటిలో కలిసిపోయింది. బావాజీ కొండ వేపు తీతువు అరుచుకుంటూ పోయింది.

"ఇంకా మనవాడొచ్చేటట్టు లేదు. కానీండి," గంట్రంకింద వేసుకున్న తెల్లపంట్లాము నలిగి పోకుండా మీదకు లాగుతూ అన్నాను.

గొంతు సరిజేసుకొని ఒక పొడిదగ్గు దగ్గి అన్నారు మాస్టారు. "రాయాలిసుకుండీ!"

మాస్టారి పాత జీవితంలో రోజు కొక కథ దొరుక్కొచ్చు. అతను చెప్పడంకూడా గొప్ప నేర్పుతో 'సస్పెన్సు' కొసవరకూ ఉంచి మంచి రసవంతంగా చెప్పుకొస్తాడు. అది వ్రాసేటందుకు శిల్పంకోసం ఆలోచించడంకూడా అనవసరం.

"మూడు ఎనిమిదిలు, ఒక ఆరు—" లెక్క లేస్తున్నాడు గోదాము గుమాస్తా. బస్తాలొక్కొక్కటే వెళ్తున్నాయి లారీలోనికి, కూలీల వీపులమీదుగా. ఒక్కొక్క బస్తా కుదేస్తూఉంటే, తుఫానుగాలికి చెట్లూగిపోయినట్టు ఊగుతోంది లారీ. ముప్ఫైబస్తాలు వెయ్యడం పూర్తయేసరికి అది కొస్త ఒరిగి కూరుకుంటుందేమో ననిపించింది.

"ఓసారి షికారు వెళ్ళేం" మాస్టారు మొదలెట్టేరు.

"ఎవరెవరు?" కాలుమీద కాలు వేసుకుంటూ అడిగేను.

"మాదోస్తీ బృందం. ఇప్పుడు పెట్రోలు బంకుంది చూసేరా? అటు వేపు."

"అయితే ఇది ఈ ఊళ్ళో జరిగిందా మాస్టారూ?" ఆత్రంగా ముఖం ముందుకి తెస్తూ అన్నాను.

"చెప్తాం కేం వే. మేం పదహారుగురం రోజూ షికారుపోయేవాళ్ళమే అనుకోండి. ఆరాణీ తోట వేపు పోయేవాళ్ళం. కాని ఆరోజు బుద్ధిపుట్టి ఇటు వేపు వెళ్ళేం."

చుట్టపొగ లాగుతూ అప్పారావుగారు లారీవెనుక నుండొచ్చారు మా వేపు.

"వినండోయి. మొన్న మేమంతా షికారెళ్ళేం బావాజీ కొండవేపు" ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ అన్నాడాయన.

"మాస్టారున్నారా?"

"అయ్యో! లేకేం! ఈ పాటివేళా అయింది. దీని తస్సాదియ్యా. సగం దారి వెళ్ళేటప్పటికి మా పక్కనే పులి అరిచింది."

ఆశ్చర్యంగా చూస్తూ అడిగేను. "పరుగు లంఘించుకున్నారా?"

"లేదులెండి," మాస్టారు నవ్వుతూ అన్నారు. "నడక వేగం మాత్రం ఎచ్చిచేం."

టేబిలు మీదనున్న అగ్గిపెట్టె తీసి, ఒక్క పుల్ల గీకుతూ అన్నాను. "మీ కథ కానీండి మాస్టారు."

విషయం మారడంవలన రసం పోయినట్టయిందేమో "తరవాత తీరుబడిగా చెప్తాలెండి" అన్నాడాయన, చుట్టకు కట్టిన కాడిని చిటికెన వ్రేలితో దులిపి, కొంతకాలం ఊరుకుని అన్నాడాయన. "ఈ లారీలు, ఈ గొడవ చూసేరూ?"

"వాటి గొడవ వాటిది. మన కథకేం ఆటంకం లేదు మాస్టారూ. కానీండి." వాసన చూపించి పంకు విసిరేస్తున్నట్టయి అన్నాను.

చుట్ట మొదటికొస్తున్న నిప్పు ఎరుపుదనాన్ని పరీక్ష చేస్తూ అన్నారు అప్పారావుగారు. "మన వాడింత వేగం రాడు. ఇంకో నాలుగు లారీలకి పెర్మిట్టివ్వాలి."

"అయితే చెప్పొచ్చే దేమిటంటే ఆ బంకు వేపు షికారు వెళ్ళేం. అక్కడో కొనాఉంది చూసేరూ? ఇప్పుడంటే ఇవన్నీ తారురోడ్లయేయి కాని అప్పుడంతా మట్టే. మీ రింకా పుట్టేరో లేదో. పుట్టినా పాలుతాగే వాళ్ళేమో!"

"ఉఁ" కొడుతున్నాన్నేను ప్రతి వాక్యం ఆఖరికీ. అప్పారావుగారు కళ్ళద్దాలు సర్దుకొని, కళ్ళు రెపరెపలాడించి, ఏదో పిలుస్తున్నట్టు ముక్కుతో

శబ్దం చేసి, మాష్టారి ముఖంలోనికి చూస్తూ కూర్చున్నారు.

"ఆ కొనామీద ఒక బావాజీ కూర్చున్నాడు."

"ఓస్! బావాజీ కథా!" ఒక నిట్టూర్పు విడిచి ఏదో బరువు తగ్గిపోయినట్టన్నాను.

"జరిగింది చెప్తామంటేనే. వినరేం?"

"చెప్పండి, చెప్పండి." అడ్డుచెప్పకూడదని నిశ్చయించుకుని, తప్పు కప్పుకుంటున్న వాడిలా నవ్వి అన్నాను.

కొసవరకు కాలిన చుట్టని క్రిందకు విసరికొట్టి క్రొత్తదానికోసం జేబులో చెయ్యి పెట్టే అప్పారావుగారు. చెయ్యి కాళీగా వచ్చింది. ఆ చేతితోనే కళ్ళద్దాలు సరిచేసుకుని, కాళ్ళు మరింత దగ్గరిగా లాక్కొని వింటూ కూర్చున్నారు ఒక బుద్ధిమంతుడిలా.

"అందరిలోనూ ఈ వెంకట్రావుకీ నాకూ బాగా దోస్తీ." మాష్టారు చెప్పుకపోయేరు. "ఇద్దరం చాలా కలిసికట్టుగా ఉండేవాళ్ళం. మా వీధి కొట్టుంది చూసేరూ. అందులో బస. ఎక్కడ! ముప్పైవేళ్ళ క్రితం నుంచి కలిసి తిరుగుతూ ఉండేవాళ్ళం." ఒక్క [illegible] దూరుకుని, చుట్ట పీల్చి, నా ముఖం మీదకి పొగ వదుల్తూ అన్నారు.

"ఓసారి ఇంటిదగ్గర పెట్టిన చోలిరొట్టె అపాశంగా మింగేసి, రామా హోటల్లో పదిఇడ్లీ, కాఫీ కాళీచేసి, నే చెరుకుపడగానే బ్రదర్ టిఫిన్ ఇప్పించవా అన్నాడు. అప్పుడు చూసేరూ, వెధవది అణా పారేస్తే పరక ఇడ్లీ, పరక కాఫీ, అపెక్కడెక్కడికేసిని, అయితే పద అన్నాను. మీరు నమ్మండి! పదకొండణాలూ ఇంకొక మాటలేకుండా తినేసేడు. నాలుగిడ్లీ, ఒక కాఫీ, నాలుగిడ్లీ ఒక కాఫీ అలాగ. అయ్యరు గుండెలు కొట్టుకున్నాడు. మనిషి అందగాడు కాకపోయినా పుష్టిగా ఉండేవాడు. ప్లెయిన్ ఫెలో. మొహంమీద తిడితే ఏం అనుకొనే వాడు కాదు. వెనక నేదన్నా చేస్తే చంపేసేవని లెక్క."

"ఈ బావాజీ సంగతేమిటి మాష్టారూ?" గాలి కెగిరిన తలవెంట్రుకలని సరిచేసుకుని మామిడితోట వేపుచూసి అడిగేను. గోదాము వేపు వస్తున్న ఒక లారీ దీపపుకాంతిలో తోటవేపు రెండుకళ్ళు మెరిసేయి. నక్కా! పులో! ఏదన్నా అవొచ్చు. నక్క అయ్యుంటుం అనుకున్నాను, అట్టే బాధపడకుండా.

"ఒస్తున్నా, ఒస్తున్నా. చెప్పొచ్చే దేంటంటే అతగాడికి వేదాంతం పిచ్చి, మనుష్యులు, తత్వం, అర్థంచేసుకోడం, వీటిలో ఎక్కువ అభిమానం ఉండేది."

"ఎవరికి? వెంకట్రావుగారికా?"

"మీరు బాగా వింటున్నారే. మరెవడి సంగతి మాట్లాడుతూంట? ఈ బావాజీని చూడ్డంతోనే అతగాడికేం బుద్ధిపుట్టిందో కాని, కొనామీద చతికిలబడ్డాడు, ఉస్సూరుమని. ఇం[illegible]కి పోదామని ఎంత బలవంతం చేసినా లాభం లేకపోయింది. మనిషి తీరే అంత!"

"ఆఁ. ఐతే?"

"ఐతే ఏముంది. కూర్చున్నాం. ఆ సన్యాసిగాడు, దూరంగా ఉన్న కంపునీటి చెరువు వేపు తదేక దీక్షతో చూస్తూ ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. సమాధిలోంచి అప్పుడే కళ్ళు తెరిచిన ఋషి పుంగవుడిలా ఉన్నాడు. మన వెంకట్రావేం చేసేడో తెల్సా? ఉండుండి బావాజీకి దగ్గర దగ్గరగా జరిగేడు. ఆరోజు ఇతగాడికి నిజంగా పిచ్చెత్తిం దనుకున్నాను. ఈ బొల్లి బావాజీగాళ్ళ దగ్గర చేర్చుకోవల్సిన పరమార్థ మేమిటో నాకు ఏవొచ్చింది."

ఏ బొల్లిబావాజీ అన్నా దగ్గరుంటే మాష్టారి మాటలకి ఇటో అటో ఏదో ఒకటి చేసును, [illegible]. కాని ఇక్కడ కూర్చున్న వాళ్ళమంతా అసలు బావాజీగాళ్ళం. సంసార మహాసాగరాన్ని తెప్పలు లేకుండా ఈదుకొస్తున్న వాళ్ళం. ఆ అంతులేని అగాధంలో మునుగుతూ, తేలుతూ చిరునవ్వుతో పోతున్న వాళ్ళం.

"చిన్న కుశల ప్రశ్న వేసేను."

"ఏమని?" ఓ చిన్న ప్రశ్న వెయ్యకుండా ఉండలేకపోయేను.

"ఏమనో! అదంతా ఇప్పుడు సరిగా జ్ఞాపకమూ ఏమిటి? ఏవో మాటలు కలపడానికి ప్రయత్నించి అందులో జయం పొందేడు. అసలీ బావాజీ, అడిగిన ప్రశ్నలకి ఇష్టమున్న వాటికి టక్, టక్ మని జబాబిచ్చి మూతి ముడుచుక కూర్చోడం మొదలెట్టేడు, ఏదో దీక్షాపరుడిలా."

"ఒంటిగా పడున్న వాడిని అల్లర పెట్టడంకూడా అన్యాయమే." మధ్యలో అడ్డువస్తూ అన్నాను.

అప్పారావుగారు సందేహం పుట్టి అడిగేరు. "అయితే మాష్టారూ. ఈ బావాజీకి గడ్డం, మీసం

అవీ ఉండేవంటారా, లేక ఈనున్న టెసుండు రఖమా! శైలమాన్ మోడల్."

ప్రపంచాన్ని, మనుష్యుల్ని అర్థం చేసుకున్నట్టు చిన్నపవ్వు నవ్వి అన్నారు మాష్టారు. "శరీరబాధ్యం ఉన్న మనిషే, కాని ఆరభం కాదు. జానెడు దగ్గర దగ్గర గడ్డాం ఉంది. అదున్నప్పుడు మోసం ఎలానూ ఉంటుంది. అసలు విషయంలోకొద్దాం. మెల్లిగా ఆ బావాజీని దువ్వడం మొదలెట్టేడు వెంకట్రావు. నాకిటువంటి విషయాల్లో స్వతహాగా జోక్యం కలుగజేసుకోడం ఇష్టముండదు జరిగేదిమాత్రం చూడడం మానను. కొంతసేపు పోయేక అసలు ప్రశ్నలవైపే తీసేడు మాటాడు. "ఏదూరు? గోదావరిజిల్లాలోనా? అంటే ఫలానా ఊరికి దగ్గరేనా? అయితే అక్కడ ఏం చేస్తున్నట్టు. ఏదో వృత్తి! అంటే ఏవృత్తి? పోనీ పెళ్ళయిందా? ఎందరు పిల్లలు? చదువుకుంటున్నారా? మీ భయస్సు? ఈ వరి వర్తన ఎందుకు కలిగింది? వైరాగ్యమా? విరక్తా? మోక్షమార్గం కావల్నా? ఇలా ఎన్నెన్నో. మావాడెన్ని ప్రశ్నలు వేసినా ఒక్క ఊరు పేరుమాత్రమే చెప్పి ఆ సన్యాసిగాడు శిల్పం కొట్టిన రాయిలా కూర్చున్నాడు. జపం చేస్తున్నాడా అంటే అదీ లేదు. గుడ్లు మిటకరించుకుని. కంపు చెరువుదగ్గరి చెట్టుమీద కాకుల్ని కొంగాను చూస్తున్నాడు మకం వేసుకుని. ఏమనుకోవాలి చెప్పండీ అలాటివాణ్ణి. మావాడొదుల్తాడూ. అదేపనిగా జవాబురాని ప్రశ్నల్ని తిరిగి అతిడిమీద ప్రయోగించడం మొదలెట్టేడు. బావాజీకి చిరాకేసిందిలా ఉంది. ముఖం ఎర్రగా చేసుకున్నాడు. కనురెప్ప లోకటి రెండుసార్లు మూడి చేడు. ఒకసారి మా అందరివేపూ ఏదో ఫిర్యాదున్నట్టుగా చూసేడు. ఆఖరికి లాభం లేదని నోరువిప్పేడు. అంతరిక్షంనుంచి ఆకాశవాణి పలుకుల్లా ఉండేవి బావాజీమాటలు. ఎంత గంభీరంగా ఉందంటారేమిటి ఆగొంతు. "ఎందుకు నన్నిలా బలవంతం చేస్తారు" అన్నాడు.

మా వెంకట్రావ్ పూరుకున్నాడు, ఒక నిముషం. తరవాత అతిడి కష్టసుఖాలన్నీ తెలిసినవే అన్నట్టు ముఖం పెట్టి అన్నాడు. 'మనుష్యులం మనం. ఈ జన్మలౌక అన్నీ ఏవో ఉంటూ గుంటాయి. అవి తెలిసినవారి ముందు చెప్పుకుంటే కాస్త మనశ్శాంతి. చూడండీ. నేనూ ప్రపంచంలో వేడీ చలీ అన్నీ చూసేను. ఈ వేదాంతంకూడా కొంతకొంత అర్థం చేసుకుంటున్నాను.'

మావాడిని అట్టే పోనివ్వలేదు బావాజీ. కళ్లోకే సారిమూసి, విప్పి, మకం మార్చి, కాళ్ళు క్రిందకు వేలవేశాడు. కుడికాలి బొటనవ్రేలితో భూమినికొట్టి ధూళి రెగరేస్తూ దీర్ఘనిశ్వాసం వదిలి, ఆకాశంమీద పోయే కొంగల్ని చూస్తూ అన్నాడు.

"ఏవస్తువునీ గాఢంగా ప్రేమించకూడదు. అది బానిసత్వమే. దానినుంచి దూరమైతే మతిపోతుంది".

బావాజీ ఊరుకున్నాడు. అంతా నిశ్శబ్దంగా వింటున్నాం ఆ వేదవాక్కుల్ని.

కాలిపోయిన చుట్టని దూరంగా ఉన్న కాలవలోనికి విసిరేరు మాష్టారు. రసంలేనివాటి కదెదారి.

ప్రెయివరు చక్రం విప్పి ట్యూబుకి అతుకు వేస్తున్నాడు.

నేనన్నాను నవ్వుతూ—"అయితే ఆ పరమార్థం నిజమేనంటారా మాష్టారూ."

"ఏమో! ఎవడికి తెలుసు?, నాకే వేదాంతి మన్నా అర్థమయితేగా? అయితే జరిగిం దిమిటంటే. ఆ బావాజీ తన జీవితచరిత్ర మొదలెట్టేడు. ఏవేవో చెప్పిచెప్పి ఆఖరికి అసలువిషయంలోకిదిగేడు. చెవులు రిక్కించుకుని మేమంతా వింటున్నాం.

"నాభార్య నన్నెక్కువగా ప్రేమించేదని గర్వపడేవాడిని. అది, సమయం వొచ్చినప్పుడు నాకోసం దేన్నైనా వదులుకోడానికి సిద్ధమయ్యేది. ప్రాణం కూడా ఇవ్వడం ఈలోకంలో ఎంత ప్రేమించుకున్న వ్యక్తుల్లోనూ అసాధ్యమైనా, నాకా అవుసరం పడలేదు. ఆ వేళ, సన్నపాటి వ్రేళ్ళతో నా తలవెంట్రుకలని సరిచేస్తూ, నా కన్నులలోకి ఏకో నాలో దాన్ని అర్థం చేసుకున్నట్టు, నా నుందెలలోకి తొంగిచూస్తూ చిరునవ్వు నవ్వేది. వంపులు తిరిగిన ఆ ఎర్రటి పెదవులవెనక దాగొని ముత్యాలలా తొంగిచూసేవి రెండు మూడుపళ్ళు, ఆకళ్ళలో ఎంత వెలుగు!

నిగనిగలాడే ఆ నల్లటి పొడుగాటిజుత్తు బెంగాలీ ముడివేసుకుంటే దానిచుట్లలో నన్ను కట్టేసినట్టుండేది. ఒకనాడు, కొత్తగా తెచ్చిన వాయిలు చీర, పల్చటి రవిక వేసుకుంది. జిలేబీలా జుత్తు ముడివేసుకుని, అప్పుడే విచ్చ గులాబీ ముడుచుకుంది. చెవులకి ఉంగరాల్లాటి చుట్లు. చంటిపిల్లలాటి అమాయకపు నవ్వు పెదవులమీద. నుందెలు కదిల్చే ఆ నవ్వులో నాదగ్గర కొచ్చింది. నాకళ్ళు చాల వనిపించింది, నిజంగా. అంత డబ్బు ఖర్చు చేసేవాణ్ణి, దాని మెసలో

కొనుక్కోలేను కొనలేక పోతున్నావే ఎందుకు పనికొస్తా ననుకొని చేశాన్లే.

ఏ వస్తువూ కొనమని అడిగేది కాదు. ఇస్తే వాడు కొనేది. లేకపోతే లేదు. నేను తినవిదే ఒక్క మెతుకు ముట్టుకొనేది కాదు. ఓసారి, అలాగే క్యాంపునుంచి తిరిగొస్తానని చెప్పి ఒక ఊరెళ్ళేను. రావడం ఆలశ్యమయింది. రాత్రి ఒంటిగంట అయింటుంది. పైటకొంగు నేలమీద పరుచుకొని పడు కుంది. అంతదాకా పస్తుంది!

కల్లా, కపటంలేని ఆ నవ్వుతో, నా కళ్ళలోకి చూస్తూ, దగ్గరకొచ్చి నా గుండెలమీద తల వాల్చు కుంది. దాని తల నిమురుతున్నాను నేను. నా చేతుల మీద వేడినీటి చుక్కలు పడుతున్నట్టనిపించింది. గబుక్కున దాని ముఖమెత్తి చూసేను కళ్ళలోకి. ఏడుస్తోంది. ఏడుపు నాపుకొ టేటందుకు ప్రయత్నిస్తూ అంది మెల్లగా." 'ఎప్పుడూ ఇలా ఉండిపోగలమూ?'

కన్నీళ్ళు తుడుస్తూ అన్నాను. 'వాడి దయుంటే!'

ఈ రెవెన్యూ ఇన్స్పెక్టరు పని తెలుసుకదూ? నెలకి ఇరవైరోజులు తిరుగుడు. ప్రక్కనే ఉన్న పోలీసిన్స్పెక్టరుగారి పెద్దబ్బాయి ఏ కూరా గాయా కావల్సినా తెచ్చిపడేస్తూ ఉండేవాడు. కుర్రాడు బుద్ధిగానూ, మర్యాదగానూ ప్రవర్తిస్తూ ఉండే వాడు.

బావాజీ కొంతసేపాగి, పొడిదగ్గు దగ్గి అన్నాడు. 'ఆడదాన్ని మొగాడెన్నా మొగాణ్ణి ఆడదన్నా ఎక్కువగా ప్రేమించుకో కూడదు "

"అయితే మాస్టారూ" అన్నా నేను ఎందుకో.

"చెప్పేది వినలేం. ఆ బావాజీ ముఖం ఎలా ఉండే వినుకున్నారు చెప్తూ ఉంటే. కందిపోయి, ఏదో తప్పుచేసిన వాడిలాగా ఉంది. చెప్పక పోయేడు, బావాజీ.

'ఓనాడు నాకో ఉత్తరం ఒచ్చింది. చదివేను. నవ్వొచ్చి, చింపిపారేసేను. ఐనా, మనస్సులో అది చిన్నచిచ్చు నాటింది.

వారంరోజులైంది. నా పనులు నేను చేసు కుంటున్నాను.

క్యాంపు వస్తున్నా నన గానే, లలిత బేజారెత్తి పోయేది. ఒక్క నిముషం దాని ఎదురుగా నే లేకపోతే ప్రాణంపోయి నట్టయిపోయేది. అది కళ్ళు తడిచేసు కోకుండా నేనొక్క వాడు బండీ ఎక్కలేదు. నన్నొక దేవతలా చూసేది.

మరోనాడు క్యాంపు పోయేముందొక కవ రొచ్చింది. విప్పిచదివేను. ఆ రాసినవాడిమీద ఎంత కోపమొచ్చిందో చెప్పలేను. లలిత ఎదురుగా నిల్చుంది నా కళ్ళలోకి చూస్తూ అమాయకంగా. ఉత్తరం దాని కందిచ్చేను. ఆత్రంగా చదివి తిరిగి నా కంది చ్చింది. దానికళ్లు వాడిపోయేయి. చెక్కిళ్లలోని రంగుపోయింది. బిత్తరపోయినట్టు కళ్ళు పెద్దవి చేసి చూస్తూ నా దగ్గరకొచ్చి నా గుండెలమీద వాలి పోయింది, వెక్కి వెక్కి ఏడుస్తూ. ఆ ఏడుపులో విని పించేయి దానిమాటలు. 'ఆడదాన్ని నేనేం చెప్ప గలను."

బావాజీ నిట్టూర్చి ఆగేడు. బూడిదచేతులతో తలరాసుకుని, ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ అన్నాడు. 'మొగాడి సంగతి చూడండీ. పెళ్లాం పతివ్రతయినా, రోడ్డు పోయేవాడొక్కమాటంటే, ఆలోచించక మానడు. మేక, దొంగలకథ తెల్సుకదూ?' కొంచెం తేరుకుని అన్నాడు. 'ఇంకో వారంరోజులకి మరొక ఉత్తరం ఒచ్చింది. ప్రతిఒక్క ఉత్తరం నా మన స్సులో ఆ అక్షరాలని ఒక దొంతరగా పేరుస్తూ, దారాన్ని పేనుతూ ఉండేవి. కాని మనుష్యులం! నేను నమ్మలేక అనుకోండి.

మరొక ఉత్తరం ఒచ్చింది. అందులో ఒక చిన్న ఉపాయంకూడా రాసుంది. ఈ ఉత్తరాల బాధపడలేకపోయేను. అసాధ్యం అయింది. నామనస్సు బాధకూడా నేనెరా!"

మాస్టారింకో చుట్ట ముట్టించేరు ఆ గెడ్డ లైట రులో. మంచి పట్టులో ఉన్న కథ నాపి చుట్ట ముట్టిం చడం నా కిష్టంలేకపోయింది. కాని ఆ చుట్టతో కథకి మరింత రసం పోయొద్దూ ఆ పంచుబ్ర.

చుట్ట ముట్టించి అన్నారు మాస్టారు. "బావాజీ సంగతికదూ అనుకుంటున్నాం. ఆ బావాజీ కూడా నే నిప్పు డాపినట్టే కథ నాపేడు, నేలని చూస్తూ. మా అందరికీ పీకలమీద కత్తిపెట్టినట్టుగా ఉండేది. మళ్ళా బావాజీ చెప్పకపోయేడు. పాతబ్రతుకువంతా ఒరిచేసుకుని ఇంకోసారి అనుభవిద్దాం అన్నట్టున్నా యతడి ముఖంలోని రేఖలు.

'మూడు రోజులవరకు రాలేనని చెప్పి బయల్దేర నారోజు. ఇద్దరు బంట్రోతుల్ని వెంటేసుకుని బండీ మీద ప్రక్కఊరు ప్రయాణంకట్టేను. సాయంకాలం వేసవి. చంద్రుడప్పుడే పైకొచ్చేడు. చల్లగాలి.

పాటు ప్రయాణం. బండీమీద ఎంతో హాయి అనిపించింది. ప్రాణం కుదుటపడ్డట్టయింది. ఎక్కడో కుప్పల్లోంచి ఒక నక్క అరుపు అరేపరుసగా, కోమటి దాని ఏడుపులా.

ప్రక్కఊరు చేరుకొనేసరికి రాత్రి ఎనిమిదయింది. వెంటనే ఇద్దరి బంట్రోతుల్ని పిలిచి, మర్నాడు నేను వెళ్ళి వెంటనే పనిచూసుకొనేందుకు బందోబస్తు కని, అక్కడికి దగ్గరగానున్న ఊరు పంపేను. ఒక పావుగంట కరణంగారి ఇంట్లో విశ్రాంతి తీసుకున్నాను. కాస్త సుష్టిగ పుచ్చుకుని, పెట్టె, పరుపు కరణంగారి ఇంట్లోనే ఉంచి అ పండువెన్నెల్లో బయల్దేరేను.

మాఊరి కింకో అడ్డుదారుంది. అదారంట బండీ వెళ్లేందుకు సాధ్యపడదు. కాని, దారి అక్కడక్కడ తప్పించి కాలిబాటకి సాఫీగానే ఉంటుంది. అంత వేగంగా నేనే నాడూ నడవలేదు. మధ్య నొక సెలయేరుంది. నీరు ఎండిపోయింది. ఎదురుగా పెద్ద టేకు తోట. ఆ తోటలోనుంచే వెళ్లాలి. అడివి మల్లెల వాసన. దానికితోడు పువ్వులా చల్లటి వెన్నెల. ఇంత హాయిగా ఉన్నా ఏదో తప్పుచేస్తున్నట్టు, తెలివి తక్కువగా ప్రవర్తిస్తున్నట్టు చిన్నమాదిపోటొక్కడో తగుల్తోంది.

మాఊరి పొలిమేర ఒక గంటన్నరలో చేరుకున్నాను.

మా ఇంటిచుట్టూ ఇటికలగోడ ఉంది. గోడకున్న ద్వారపుతలుపు వేసుకుని, ఇంటి తలుపులన్నీ తీసేసి పడుక్కునేవాళ్లం వేసవిలో.

పెరటిదారంటవెళ్లి గోడగెంతేను. మానుయిళ్ళ, కొబ్బరిచెట్లు, అంటుమామిడిచెట్లు ఇంటి కాపలావాళ్లలా నావేపు చూస్తున్నట్టనిపించింది.

ఒకమూల చెప్పలేని సిగ్గువేస్తోంది.

పెరటిద్వారం తెరిచేఉంది. లలిత ఆ ద్వారం ఎప్పుడూ తెరిచే ఉంచమంటుంది నన్ను, గాలికోసం.

ఆ ద్వారంగుండా చడి చెయ్యకుండా ఇంట్లో ప్రవేశించేను. మా పడకగది ద్వారంముందాగేను, సంకోచిస్తూ.

చెవిమీద వాలిన ఈగని కొట్టడంలో చెవిని కొట్టుకుని అన్నాడు బావాజీ. 'తగ్గించిన దీపపు వెలుగు పడుతోంది తెల్లటిగోడమీద. నా పెద్ద ఫోటో వాడిపోని పూలదండలో ఒకప్రక్కకు కనిపిస్తోంది. దాని చట్టానికి అగరువత్తులు.

ఇంట్లో ఏచప్పుడూ లేదు. మంచి నిద్రలో ఉంటుందనుకున్నాను. నామీద నాకే అసహ్యం పుట్టుకొచ్చింది. నాఇంట్లో నేను దొంగలా!

రెండు చేతులలోనూ ద్వారాన్ని పట్టుకుని తొంగిచూసేను.

బావాజీ ఆగేడు. గొంతుక సరిచేసుకుంటూ, మాటల్ని నొక్కుతూ మెల్లిగా అన్నాడు. 'నాభార్య పడుక్కుంది. హాయిగా నిద్రపోతోంది. అమాయకపు కళ్ళతో, పెదవులమీద చంటిపిల్లనవ్వుతో గాఢంగా, ఇంకొకడి ఒడిలో.'

నిట్టూర్చేడు బావాజీ. మేమంతా తెల్లబోయి వెర్రివాళ్లలా బావాజీకళ్లలోకి చూసేం. బావాజీ కంపు తెరువుకేసిచూస్తూ నిరసనగా నవ్వి అన్నాడు, 'ఏం అలా చూస్తారు?

నా మనస్సులో ఏభావాలు కలిగేయో విపిడిని ఇప్పుడు చెప్పలేను. ఏభావాలూ కలగలేదనుకోవడం మంచిది.

ముందుకువెళ్ళి చిన్నదగ్గు దగ్గేను.

ఇద్దరూ ఉలిక్కిపడి లేచి నిల్చున్నారు. వాళ్లిద్దరి ముఖాలూ ఎలా వుంటే వనుకున్నారు!

బావాజీ నిరసనగా ఇంకొక నవ్వు నవ్వి అన్నాడు.

నేనో వెర్రివాడిలానే ప్రవర్తించేననుకోండి, ఏమనుకోండి. ఆపరిస్థితులలో ఇంకోలా చెయ్యలేకపోయేను.

ఇన్‌స్పెక్టరుగారి అబ్బాయి భుజంమీద చెయ్యివేసి ఏంభయం లేదంటూ ద్వారంవరకు సాగనంపేను. తిరిగి నాగదిలో కొచ్చేను. మూర్ఛపోయినట్టు క్రిందపడి నాకాళ్లు రెండూ పట్టుకుంది నాభార్య, వెక్కి వెక్కి ఏడుస్తూ అమాయకంగా, నిష్కల్మషంగా.

నేలమీద అలా సాష్టాంగ పడి వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆకారాన్ని చూస్తే ఎవడిగుండె కరగదు? ఇప్పుడు చెప్తున్నాను. ప్రపంచం, ఒక బ్రతుకు, నేనంటూ ఒక మనిషినీ ఉన్నానంటే లలితవల్లనే అనుకొనేవాడిని. నేను దానిలో ఒక భాగమే అనుకొనేవాడిని. అదే ప్రపంచం, అదే సృష్టిఅనిపించేది.'

ఒక ఈగని దగ్గరకు రానీయకుండా తోలుతూ అన్నాడు బావాజీ—'దాన్ని లేవనెత్తి అన్నాను, ఎందుకేడుస్తావ్' అని. అది నాముఖం చూసి, రెండు

ప్రాణసుధ

★

క్షీణించిన వీర్యశక్తిని పెంపొందించును. నరములకు పటుత్వమును, కండపుష్టి నిచ్చును.

మెదడుతో పని చేయువారికి ఆత్మమిత్రము.

పక్షవాతమునకు అమోఘమయిన ఔషధము.

క్షీరబల (101 సార్లు ఆవర్తితము)

అయవీరము

వాడిచూడుడు, తృప్తిచెందుడు.

★

మలబార్ ఆయుర్వేదిక్ స్టోర్సు

నెం. 107-108, బ్రాడ్వే, మదరాసు

మదనకామేశ్వర లేహ్యం

ఇది రక్తవృద్ధిని చేయు విలువ గల వస్తువులచే తయారు చేయబడినది. మేహములు, నిక్కాక నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము మొదలగు వాటిని ఖండించి, మంచి బలమును వీర్యపటుత్వమును కలిగించుటలో అద్భుతమయినది. అనేక సర్టిఫికెట్లు గలవు. 2 డబ్బీలు చాలును.

20 తులముల డబ్బీ రు. 2/-

పోస్టేజి ప్రత్యేకము

పి. సి. ఏ. అండ్ కంపెని

ఆయుర్వేదసమాజము

పెరిదేపి, (నెల్లూరు జిల్లా)

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహ మచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము.

జి. ఏ. రెడ్డి అండ్ కో

(రిజిష్టర్డు)

"భాస్కరాశ్రమము"

గోపాలపురం, తూ. గో. జిల్లా

లోకప్రసిద్ధిపొందిన

పి. వి. రాజన్ అండ్ కంపెనివారి

శ్రేష్ఠమైన మదరాసు నశ్యం

R. S. సుగంధ ముక్కుపొడి

అన్నిటిలో సాటిలేనిది.

ధర వివరములకు వ్రాయుడు.

తయారు చేయువారు:—

పి. వి. రాజన్ & కంపెని,

అర్కోణం, Arkonam, N. A. Dt.

చేతులతోనూ కళ్లు కప్పుకుని వెళ్లి, పరుపులో తల దాచుకుంది.'

'తరవాత?' మొదలియారడిగేడు పళ్లు పైకిపెట్టి, అతడు చెప్తూంటేనే.

'దాన్ని బట్టలు లేకుండా చేసి, ఏ వస్తువులూ లేని గదిలో పెట్టి గడియపెట్టేను. ఈ ఆడవాళ్ళతో చెప్పలేం చూశారండీ. ప్రక్క ఊరు కబురు పెట్టేను వెంటనే, దాని తల్లిదండ్రులకి, లలితకి జబ్బుగా ఉందని. రాత్రి రెండుకల్లా బండీ చేయించుకుని వాళ్లంతా వచ్చేరు. వాళ్ల అమ్మాయిని, ఆ అమాయకపు చిరునవ్వుతో వాళ్లకప్పగించేను.'

వెంకట్రావుకూడా అడిగేడు, 'తరవాత,' ఏదో పోతున్నట్టు.

'నేనో దేవతనైనట్టు నా కాళ్లమీద పడ్డారు వాళ్ళంతా. ఇకముందు సరిగా ఉంటుందని దాని తరుఫున హామీ ఇస్తూ చేరదీసుకున్నారు.'

బావాజీ, ఊరుకోని అన్నాడు అనుమానంగా, 'తెగిపోయిన తివ్వ అతుక్కుంటుందా?'

మావాడి నోటికి అడ్డూ అపూ లేదు. 'ఐతే, మీ రెందుకు సన్యసించేరూ?' అడిగేడు, పరమార్థమేదో దొరకనట్టు.

పెదవులు విరిచి, చిన్ననవ్వు నవ్వి, ముఖం త్రిప్పుకున్నాడు బావాజీ."

మాష్టారు, చుట్ట గట్టిగా పీల్చి గాలి వదిలేరు.

గాలితో నిండిన చక్రం లారీ ఎక్కింది. లారీ మొదటి గేరులో ముందుకువస్తోంది, మరాం పెడుతున్న పిల్లవాడిలా.

కృష్ణమూర్తి పనిచేసుకుని ఒక ఘనకార్యం చేసినవాడిలా వచ్చి మాముందు నిల్చున్నాడు.

"మాష్టారో మంచి బావాజీ కథ చెప్పేరోయి—" అన్నాను నవ్వుతూ—

చెట్టుదగ్గర స్టాండు వేసున్న సైకిలుకోసం వెళ్తూ అన్నాడు కృష్ణమూర్తి, ఏదోగా. "ఆ రావెన్యూ ఇన్స్పెక్టరు కథేనా?"

'అమృత కేతకి'

★

సాళ్వ కృష్ణమూర్తి

ఎన్ని నాళ్లకు వచ్చె నీహృదయ బంధ
న ప్రవాస శిక్షా మోచనంబు నాకు!
ఎన్ని యుగములు తల్లి! త్వత్సన్నిధాన
పరమ భాగ్య విలుప్తి శాపంబు నాకు!

ఎంత కృశించి పోయితిని యిట్టి నిరాదృతి ప్రాణవల్లకా
కృంతన తీవ్రమై యెడద గీచిన రాపిడి నే చలించి, కా


పాంతము నేడిటుల్ పిలచినట్టుల వచ్చిన శర్వరీ సమా
క్రాంత తమోగుళుచ్ఛ పిసరంబులు జారె నుమస్సుహాసినీ!

నామెదలోన పండిన సనాతన ధర్మమరీచి నిన్ను కా
త్యాయనిగా మలంచుకొన తల్లి ! మదీయ నిరంతర స్మృతి
ధ్యేయము త్వత్పదాంబురుహ దివ్యనఖాంకుర రక్తదీప్తి కో
పాయత నేత్రగోళ మసృణాంచల రేఖనిటుల్ రగిల్చితో!

చీలిన నాదుగుండె పరిశీర్ణత నాంతర వీధి క్రుంగి జీ
ర్ణాలయ సుప్తకోణ తతి నంటు స్మృతి వ్యధ లాక్రమింప, శం
పాలలితాభమూర్తి! యిటు పర్విన భావతరంగ మొండు బా
ధాలులితంబునన్ ప్రతిహతం బొనరించె పదేండ్లు సాగినన్.

లలిత మరుద్విధూత వికలద్యుతి సంగత మేఘమాలికా
చలిత శశాంక ముగ్ధరుచి ధామ్మన కోపన లావకృష్టమై
పొలచిన బుద్ధి నీమిసిమి పోవని నవ్వు కలంగి భంగమై
తలపు గ్రసించెనేమొ చకితభ్రు కుటీపరి క్లుప్తశేఖమై

హేలా కల్పిత కృష్ణమేఘ భయదాహి. స్పష్ట వర్షానభః
ఖేలా భీలత లాగి నేడఖిల దిక్సీమా పరివ్యాప్తమా
లాలీలా మృదు చంద్రమః ప్రభలు వాల్లభ్యాను రూపంబులై
పాలించెన్; పరివృత్త కోపమతి! శర్వాణీ శిరః కేతకీ!



నెడుంజెలియన్

★

శ్రీమతి వారణాసి యశోదాదేవి

దక్షిణాపథమును పరిపాలించిన సుప్రసిద్ధ సామ్రాజ్యములలో పాండ్య సామ్రాజ్య మొకటి. పాండ్యులు అతి ప్రాచీనులు. వీరిరాజ్యము అశోకుని శాసనములలో పేర్కొనబడియున్నది. పాండ్యులు చంద్రవంశజులుగను పాండవ సంబంధీకులుగను చెప్పబడి యున్నారు. వీరు మత్స్యలాంఛనులు; మత్స్యధ్వజులు. వీరి బాణములపై రెండు మత్స్యములు వుండును. పాండ్య చక్రవర్తులు మొదటినుండియు మధురానగరము రాజధానిగ పాండ్యరాజ్యము నేలిరి.

చరిత్రకు పరిచితులైన మొదటి పాండ్య రాజులు తమిళ సంగము గ్రంథములందు గన్పడుచున్నారు. వీరిలో కొందరు శిలాశాసనములందును చెప్పబడి యున్నారు. మిక్కిలి భేదాభిప్రాయములకు గురియైన తమిళ సంగ యుగకాలమును క్రీ. శ. మొదటి శతాబ్దములు అనగా 3 వ శతాబ్ద అర్ధభాగములోపల—యని పాండ్య చరిత్ర నిర్మాతలు ఆచార్య నీలకంఠ శాస్త్రిగారు నిర్ణయించి యున్నారు. సంగం గ్రంథములలో 20 మంది పాండ్యరాజులు పేర్కొనబడి యున్నారు. వారిలో వడింబలంబ నిన్రవన్ లేక నెడియోన్, పల్యాశాలై ముదుకుడిమి అన్నవారలు, మధురైక్కాంజి కావ్యములో కీర్తింపబడ్డ నెడుంజెలియనుకు పూర్వులు. ఈ నెడుంజెలియన్ శిలప్పదికారంలో చెప్పబడిన ఆరియప్పడైకడంద విరుదాంకితుడగు నెడుంజెలియను వేరైయున్నారు.

ప్రసిద్ధ శిలప్పదికారం కథాకాలము నాటికి రాజ్యమేలుచున్న పాండ్యరాజు నెడుంజెలియను. కన్నకిదేవివల్ల కోవలునియొక్క నిరపరాధిత్వము నిరూపింపబడినతర్వాత నెడుంజెలియను మహారాజు కడు విచారమున క్రుంగి చనిపోయినట్లు చెప్పుదురు. విద్య, జన్మకును, కులమునకును అతీతమను విషయమును ఇతివృత్తముగా గల ఒక కావ్యమును యీరాజు రచించెనట. ఈకాలమున కొర్కైరేవున రాజప్రతినిధి చెలియన్ నెడుంజెలియను పుత్రుడే. అతని తర్వాత పాండ్యసింహాసన మధిష్ఠించిన వెట్రివేర్చెలియన్ లేక యిళంజెలియన్, ఒక్కరోజున వేయిమంది కమసాలులను బలియిచ్చి కన్నకి దేవతకోపమును ఉపశమింపజేసి పాపమునుండి విముక్తి బొందెను. ఇది అంతయు రెండవ శతాబ్దమున జరిగెను.

తలైయాలంగానమ్ యుద్ధవీరుడు నెడుంజెలియను పై నెడుంజెలియనుకు తర్వాతివాడు. ఇతడు చిరుతప్రాయమున గద్దె నెక్కెను. రాజ్యమునకు వచ్చిన కొలదికాలమునకే, చేర చోళ చక్రవర్తులు యేవురు సామంతరాజులతో గూడిన శత్రువుల నెదిర్చ వలసి వచ్చెను. జయాపజయముల నిర్ణయించు ముఖ్య యుద్ధము తలైయాలంగానమ్—ప్రస్తుతపు తంజావూరు జిల్లాలోని తిరువాలూరునకు 8 మైళ్ళ దూరమున నున్న తలై ఆలంకాడు—యొద్ద జరిగెను. యుద్ధమునకు పోవుటకుముందు పాండ్యచక్రవర్తి తన వీరత్వమువల్ల జయమును పొంద ప్రతిన బూనెను. ఇది హర్షవర్ధనుడు రాజగుటకు పూర్వము యుద్ధమునకు సంసిద్ధుడై చేసిన ప్రతిజ్ఞను స్ఫురింపజేయును. శత్రురాజులు నెడుంజెలియను శక్తిసామర్థ్యముల దెలియనివారై పాండ్యరాజ్యమును జయించి భాగములు పంచుకొను నూహతో దండెత్తి వచ్చిరి. నెడుంజెలియన్ మధురాపురి కవాటములయొద్ద శత్రువుల నెదిర్చి తలైయాలంగానమ్‌వరకు తరిమి, యుద్ధములో తన ప్రతిజ్ఞానుసారముగ గజదృష్టి (*Elephant look*) గల చేర రాజు కొడుకు మాందరమ్ చెరల్ ఇరుంపొరైనును సజీవముగ బట్టుకొనెను. ఇంతవరకును రాజ్యరక్షణకై యుద్ధముచేసి యిటుపై నెడుంజెలియను శత్రు రాజ్యములపై దండెత్త మొదలిడెను. కొంగు రాజ్యముపై దండెత్తి, యుకైయూరువద్ద యుద్ధముచేసి కొంగురాజు అడిగన్‌ను జయించెను. ఎవ్వి యను నిడూరు రాజుతో యుద్ధముచేసి తంజావూరు జిల్లాలోని మిళలైకూర్రమ్, ముత్తూర్రు కూర్రమ్‌లను పాండ్యరాజ్యములో కల్పికొనెను.

నెడుంజెలియను హిందూ బ్రాహ్మణ మతానుసరుడు. వేదశాస్త్రపారంగతులైన బ్రాహ్మణుల సాయంతో యితడు యజ్ఞము చేసెను. తాను గొప్ప కవియై నెడుంజెలియను కవుల నెక్కుడుగ ఆదరించెను. మాంగుడి మరుదన్, నక్కీరర్, పరణన్, కల్లాడనార్ మొదలగు కవుల గీతులలో నీ రాజు కీర్తింపబడి యున్నాడు.


పాండ్యరాజ్యమున యీకాలమున బ్రాహ్మణ మతము జనుల సాంఘిక జీవనములో ముఖ్యభాగమై యుండెను. ఆచార్యమతము బాగుగ వృద్ధిచెందెను. దీనికి పొరువిలక్కనమ్, నక్కీరర్, రచితమైన తిరుమురుకాట్టుప్పడైలోని వేలన్—ఆడార్, శిలప్పదికారంలోని వెట్టువర్ పూజలు — నిదర్శనములు. వెట్టువవరిలో కొట్రవై శివుని భార్యగాను, లక్ష్మి యవతారముగాను వర్ణింపబడి యున్నది. కొట్రవై కొడుకు మురుగన్ ఆర్గురు తల్లులకు పుత్రుడుగాను దేవతల సైన్యాధిపతిగను, బ్రాహ్మణుల పాలిట భాగ్యముగాను వర్ణింపబడియున్నాడు. పురనానూరు లోని ఒక భాగము శివుని త్రిపుర దహనగాథను, శెండిల్ (తిరుచ్చెందూరు) లోని సుబ్రహ్మణ్యేశ్వరుని యాలయమును గురించి చెప్పుచున్నది. శిలప్పదికారములోని ఆయ్చ్చర్ కురవై, రాముడు, కృష్ణుడు కథలను పదములలో యిమిడ్చియున్నది. కణ్ణప్పర్, చండేశ్వరర్ కారైక్కాల్ అమ్మైలో ఏగునవి అచార్యమతమును సూచించును. శిలప్పదికారము, మణిమేఖలలు ఆ కాలమున జైన, బౌద్ధమతముల యునికిని చూపుచున్నవి.

కురల్‌లో ఆదర్శరాజు, రాజ్యము వర్ణింపబడి యున్నవి. ఆదర్శరాజ ధర్మములను కవులు రాజులకు మరల మరల నొక్కి చెప్పుచుండిరి. రాజు తనుమాత్రముగ పన్నుల విధించిన రాజభండారము నిండుటయే గాక, రాజు ప్రజాభూషితుడగునవియు, ఎక్కువ పన్నుల విధించిన రాజు బొక్కసము ఖాళీయగుటయే గాక, రాజు ప్రజానిందితు డగుననియు, నీ కాలపు యొక కవి చెప్పియున్నాడు. రాజు న్యాయపరిపాలనమున నిష్పక్షపాతియై యుండవలెననియు, ప్రతాపశాలియై, దానశీలుడుగ నుండవలెననియు మరొక కవి వ్రాసియున్నాడు.

మధురానగరము, ఇతర పట్టణములలో సాంఘిక జీవనము నాగరికమై వృద్ధిచెందుచుండెను. ఈ విషయము ఆకాలపు సారస్వతమున ప్రతిబింబించి యున్నది. భట్రాజులు, బిచ్చగాండ్రగు కవులు, గాయకులు యీ కాలమున నుండిరి. వీరు తమను రాజు తగురీతిని మన్నింపనప్పుడు, వానిపై తిట్టు కవిత్వమును చెప్పుచుండిరి. ఈ గుంపులుగా తిరుగు దేశద్రిమ్మరులగు బిచ్చగాండ్రలో కొందరు గొప్పకవులు, వివిధ నూతన వాద్యముల వాయించు పాటకులు, ఆటపాటలు నేర్చిన రమణులు, ఊరూరు తిరుగుచు కొందరు రాజులచే బహుమతుల బొందుచు, మరి కొందరచే తిరస్కృతు లగుచున్నట్లు పురనానూరులోని యొక పాటవల్ల తెలియుచున్నది.

మధురైక్కాంజి కావ్యమునుండి యీ కాలమందు అనుసరింపబడిన యుద్ధపద్ధతులు తెలియనగును. పరణిపర్‌లు యుద్ధకుశలతకు పొగడబడిరి. చాలవరకు నెడుంజెలియను సైన్యములలోని సైనికులు వీరులై యుండురు. శాలియూర్ రేవున వర్తక వ్యాపారములు విరివిగ సాగుచుండెను. మధురానగరపు కోటకు కావలివాండ్రు యవనులట. రాజులు విదేశీయ మత్తుపానీయముల దెప్పించి త్రాగుచుండిరట. కొర్కై రేవు ముత్యముల వ్యాపారమునకు కేంద్రము. మధురానగరముయొక్క కందకము, గోడలు, కవాటములు, జనసమ్మర్దముతో గూడిన బజారులు, దేవాలయములు, ఆస్థాన ప్రాసాదములు మధురైకంజిలో చక్కగా వర్ణింపబడినవి. వేశ్యలు సంగీత, నాట్యకళలలో ప్రవీణులై యుండిరి. శిలప్పదికారములో మాధవి కన్నకిలలో — వేశ్యకును, శాశ్వత ప్రేమంపుభార్యకును గల భేదము విదితమగుచున్నది. ఈ కాలమున స్త్రీలలో కవయిత్రులు, సన్యాసినులుగూడ నుండిరి. ఈ కాలమున బ్రాహ్మణులు వేదమంత్రముల పఠించువారట; సంగీత పాటకులు తమ తమ వాయిద్యములపై సాధన చేయువారట.

ఈవిధముగ నెడుంజెలియను కాలమున పాండ్య సామ్రాజ్యము సర్వతోభాయమానముగ నొప్పి యుండెను.



కావ్యము - శిల్పము

★

శ్రీ వాకాటి పాండురంగారావు

1

"శిల్పానికన్నా కావ్యమే గొప్పది" మళ్ళీ అన్నాడు కవి ప్రభాకరుడు. శిల్పి అజయుడా మాటలను అంగీకరించలేదు.

నీలద్వీపపు ఉపవనంలో, నిండు మాలాలి వేగంతో ప్రవహించే సెలయేటి సంగీతపు కలకలంలో ప్రభాకర అజయులమధ్య పెరుగుతూన్నది వాదం. పంక్తులలోని గుర్తులవలె వారిరువురి వాదోపవాదాల మధ్య ఒక్కొక్కప్పుడు మెల్లని నవ్వుశబ్దం వినపడుతూంది. కాని వాదంమాత్రం నిర్విరామంగా సాగుతూనే వుంది.

ఆ ఉపవనంలో ప్రభాకరుడూ అజయుడూ తీవ్రంగా చర్చలు జరుపుతూంటే మూర్తీభవించిన మౌనమా అన్నట్లు చేతిమీద చెక్కిలి వానించి కూర్చుని వారి మాటలను శ్రద్ధగా ఆలకిస్తున్నది మనోహారి.

"శిల్పానికున్న ప్రాముఖ్యమూ మహిమా కావ్యానికి లేదు" అజయుడు నొక్కి వక్కాణించాడు. అతడా మాటలను పెద్దరాయి బద్దలవగా ముక్కలు ఎగిరిపోతున్న ధోరణిలో అన్నాడు.

"శిల్పం! హూ—గాలికీ వానకూ తట్టుకోలేనిది ఈ నీశిల్పం. కాలగర్భంలో కనబడకుండా కలిసిపోతుంది నీ శిల్పం. కావ్యమో? అలాంటిది కాదు. మనుష్యులు ఒకరితో ఒకరు మాటలాడుతున్నవరకూ, భాష ఈ లోకంలో ఉన్నంతకాలమూ ఉంటుంది కావ్యం! మనస్సుతోనూ కాలంతోనూ పరుగులిడుతుంది కావ్యం"—అన్నాడు ప్రభాకరుడు. ఎత్తైన పర్వతాలనుండి క్రిందికి పడుతున్న జలపాతపు ధ్వని అతని మాటలలో ప్రతిధ్వనిస్తూంది.

కొంత దూరంలో ఉండి మనోహారి విసుగుకుండా వింటున్నది. వీరి కెదురుగా చతుస్తంభ మంటపంలో కూర్చుని వీరి వాదోపవాదాల ధోరణిని ముగింపును ఆవంతయినా లక్ష్యం చేయక మనస్సుకు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని అనుగ్రహించి ఊహాలోకంలో ఊగులాడుతున్నాడు వసంతుడు.

"శిల్పానికి పొడవు, వెడల్పు, ఎత్తు అనే మూడు ఆధారాలున్నాయి. వాటిమీదుగా శిల్పలత ప్రాకి పెద్దదై పూవులూ ఫలాలూ వెదజల్లుతుంది"—అన్నాడు అజయుడు.

"ఔను. అట్లా మూడు ఆధారాలుండబట్టే శిల్పానికి హద్దు లున్నాయంటున్నాను. శిల్పమా ఎల్లల బయటికి అడుగిడలేదు. కానీ కావ్యానికి ఈ ఎల్లలు లేవు. కావ్యలతకు ఆధారం మానవుని మనసే. అది ఈ ప్రపంచానికన్నా విశాలమైనది. మహాసముద్రాలకన్నా లోతైనది. ఆకారంలేని ఆవేశపు ఆధారంతో కవిత్వం ఆచంద్రార్కస్థాయిగా వెలకొని విరాజిల్లుతుంది... ఈ విషయం మనోహారికి బాగా తెలుసు"—అని ప్రభాకరుడు పలికాడు.

అప్పుడే వికసిస్తూన్న మొగ్గలాంటి మందహాసం మెరిసింది మనోహారి మృదు మధురాధరాలమీద.

అజయు డిలా అన్నాడు: "కాదు. మనోహారికి శిల్పంమీదే ఆసక్తి ఎక్కువ. ఈ వనమంతటా ఆమె వివిధరూపాలను చెక్కి ప్రతిష్ఠిస్తాను నేను. అప్పుడీ శిల్పపు గొప్పతనం ఆమెకు ఇంకా బాగా అవగత మౌతుంది."

వాదనలోని రసవత్తరమైన ఘట్టంలో ఈ లోకానికి వచ్చిన వసంతుడొక్కసారి నవ్వాడు.

"వయస్యా!...నీవే చెప్పు ఏది గొప్పదో? శిల్పమా? కావ్యమా?" అజయుడు ప్రశ్నించాడు.

వసంతు డిలా ప్రత్యుత్తర మిచ్చాడు: "ఏది గొప్పదన్న చింతే నాకు లేదు. శిల్పమూ కావ్యమూ—రెండింటి అనుభూతులుగూడా అనుభవించి ఆనందింపదగినవే. నాకు తెలిసిందంతే...ఇక అనుభూతి అంటారా అది కావ్య శిల్పాలకేగాక ఒక చిన్న పుష్పానికికూడా ఉంది."

ఈ తరుణంలోనే మనోహారి ఒక్కసారి పెద్దగా నవ్వింది. ఆ ఉపవనపు హృదయశబ్దంవలె, ఆ ప్రక్కనే ప్రవహిస్తున్న స్రవంతీ నాదంవలె, వనదేవత కాలి అందెల చప్పుడువలె ఉండిన దామె

నవ్వు! ఆమె లేచి మెల్లగా అడుగుమీద అడుగువేస్తూ నడువసాగింది.

"వివాదం ఇంకా ముగియలేదు కదూ?" అని అజయుడు అడిగాడు. "లేదు. ఈ వివాదపు అంతం తేల్చవలసింది మనోహరియే కదా!" అని బదులిచ్చాడు ప్రభాకరుడు.

"చూదాం! మీరే ఏ ముగింపు కోస్తారో?" అని పలుకుతూ రాయంచల పద విన్యాసంతో నడచింది మనోహరి.

ఆ పలుకులను తమతమ ఎదలలో పదిలపర్చుకున్నారు ప్రభాకర అజయు లిద్దరూ.

2

నీలద్వీపపు ఉపవనం కళామంటపంగా తయారయింది. వనమంతటా మనోహరి మూర్తి వివిధ భంగిమల్లో వెల్లివిరిసింది. ఆమె నడుస్తూ ఉన్నట్లు, నాట్యమాడుతున్నట్లు, నిలిచి దేనో చూస్తున్నట్లు, నవ్వుతున్నట్లు—నవయౌవనవిలాసినీ హావభావవిలాసాలు ఎన్ని రూపాలు దాల్చగలవో అన్ని రూపాలలో ఆమె శిల్ప ప్రతిబింబాలు ఆ ఉపవనమంతటా నిండిఉన్నాయి!

ఈ శిల్పరూపాలమధ్య కవితా పుష్పం కూడా విప్పారి తన సౌరభాన్ని మలయమారుతంతో మిళితం చేస్తూఉన్నది. ఆమె నడకల ఒయ్యారాన్ని వర్ణిస్తూ, నిలిచిఉన్నప్పటి ఆమె హొయలును చిత్రిస్తూ, ఆమె చిరునవ్వు అందాన్ని ఆలాపిస్తూ, యౌవనపు బిగిలోని సుందరయువతి చేష్టలన్నీ మనోజ్ఞమైన కవితారీతిలో అభివర్ణింపబడ్డాయి! ప్రతి శిల్పం క్రిందా ఒక పద్యం! ప్రతీ శిల్పం పీఠంపైనా ఒక గీతం!

కవిత్వమూ, శిల్పమూ, ప్రణయవాహిని వేగానికి తట్టుకోనలేక ఉక్కిరి బిక్కిరవుతూ తమ తమ ప్రభావాలను చూపడానికై పోటీకి దిగాయి ఆ ఉపవనంలో!

వసంతుడో? ఈ కళా నైదగ్ధ్యానికి అక్కజపడుతూ ఈ మహోత్కృష్ట శిల్పకావ్యాల కాధారభూతమయిన మనోహరమూర్తిని మనసార ధ్యానించి తన్మయత్వపుటంచుల్లో తారాడుతున్నాడు!

మళ్ళీ అందెలరవళి, నక్షత్రాలను జ్ఞప్తికితెచ్చే చిరునవ్వు—ప్రతిధ్వనించాయి. మనోహరి అక్కడకు వచ్చింది.

"మనోహరీ! చెప్పు. శిల్పమూ కావ్యమూ నిన్ను ఆరాధిస్తున్నాయి. దేన్ని అనుగ్రహిస్తావ్?"—శిల్పి ప్రశ్న.

అందుల కామె నవ్విన నవ్వు ప్రభాకరునిచేత ఒక గీతాన్ని ఆలాపింపచేసింది.

"చూదాం! మీరే ఏం ముగింపు కోస్తారో?" ...ఈ మాటలవంటూ మనోహరి నెమ్మదిగా పరస్నదిశను నడిచింది. కనురెప్ప వార్పకుండా ఆమెవైపే చూచి తన్ను తాను మరచిపోతున్నాడు వసంతుడు.

3

పున్నమనాటి వెన్నెలలో జలకమాడుతున్నది నీలద్వీపం! నిశ్శబ్దంగా ఉన్న ఉపవనంలో అంత రాత్రివేళ శిలల ముందర మౌనంగా నిలబడి కండ్లనీరు కారుస్తున్నాడు వసంతుడు! అంతకు క్రిందరోజు కళానైపుణ్యానికి తార్కాణాలుగా నిలబడి వుండిన శిల్పమూర్తులు నేడు ఛేదింపబడి ఉన్నై!!

"అసూయ ఎంత చెడ్డదీ?..." నిట్టూర్పు విడిచాడు అతడు.

"రాయి నశిస్తుంది—అన్న నైజాన్ని నిరూపించడానికై వీటిని నాశనం చేసివున్నట్లయితే ఆ వ్యక్తి కళాభిజ్ఞత ఎటువంటిదోకదా? అసూయ కళాభిరుచికన్నా మహిమా సమన్వితమైనదా? అసూయ ఉన్నచోట వస్తువుల అందవికారాలూ, మంచిచెడ్డలూ మరుగున పడిపోతాయా?"—తనలో తానే అనుకున్నాడు.

కాలిఅందెలల చప్పుడు వినపడింది. వసంతుడు తిరిగిచూచాడు. పుష్పభరితములైన పూలమొక్కల మధ్య అతివేగంతో ఎవరో నడచి వెళుతున్నట్లు తెలిసింది. తనలో తానే నవ్వుకుంటూ ఉపవనంనుండి వెళ్ళిపోతున్నది మనోహరి.

4

మరునటి రోజు రాత్రి అదేసమయానికి నిలబడి కన్నీరు కారుస్తున్నాడు వసంతుడు. ఈసారి శిలల కోసం కాదు; గీతాలకోసం. శిల్పానికోసం కాదు; కావ్యానికోసం!

ఔను. ఛేదింపబడిన శిల్పపీఠాలపై ఉన్న గీతాలన్నీ చెదరగొట్టబడినై; వర్ణనలన్నీ మటుమాయమయినై.

"నేడు నేను నేర్చుకున్న పాఠం విలువ అమూల్యం. కావ్యమూ శిల్పమూ ఎంత గొప్పవో కాని మానవ హృదయావేశం మాత్రం ఈ రెంటి కన్నా గొప్పది" అన్నాడు వసంతుడు బిగ్గరగానే.

అందెల రవళికి ఉలిక్కి పడి వెనక్కి తిరిగాడు. మనోహరి! ఆమె ఉపవనంనుండి బయటకు పోవడం లేదు. వసంతుడివైపే వస్తూన్నది.

"ఎవరూ?...మనోహరివా?" అని అడిగాడు వసంతుడు.

"ఔను. ఈ పోటీలకు కారణమైన పాపిని. మానవుని హృదయావేశపు వింతచిందులను చూస్తున్నాను." అన్న దామె.

"నేనూ అంతే! కానీ, ఏడుస్తున్నాను కూడా" —అన్నాడు వసంతుడు.

"ఇందుకు ఏడవాలా? వివాదంలోని ఒక ఘట్టం మాత్రమే కదా ఇది? ముగింపు చాలా దూరంలో లేదని దీని అర్థం!"

శిల్ప రూపంలో చిత్రించరాని వైభవంతో కాస్తూంది వెన్నెల. కావ్యరూపంలో వర్ణించలేని ధ్వనులతో పరుగెత్తుతూంది ప్రక్కనున్న సెలయేరు. వసంతుడు తలెత్తి మనోహరి వదనాన్ని తిలకించాడు. ఎందుకో, మనోహరి నవ్వింది.

"శిలలకు ఇలా నవ్వడం తెలుసా? కావ్యాలు నన్నిలా పలకరిస్తాయా?" అని అడిగాడు అతడు. కొంతసేపు నిశ్శబ్దం.

"ఏమిటో చెబుతున్నారు. చాల కొత్తగా వుంది" అన్నది మనోహరి.

అతడామెనే చూస్తున్నాడు. చల్లని ఆ వెన్నెలలో పిల్లగాలులకు చెదరిపోతున్న తన ముంగురులను సరిదిద్దుకొంటున్నది మనోహరి.

"ఏదో చెప్పలేని తన్మయత్వం నన్నావరిస్తూంది. నన్ను నేను మరచిపోతున్నాను"—వసంతుడన్నాడు.

మనోహరి అతడిదగ్గరకు వచ్చి నిలబడింది.

చల్లటి గాలి, సువాసనతోడి లతే, చెవుల కింపయిన సంగీతం, కన్నులపండువయిన అందం ఇవన్నీ మూర్తీభవించి తనముందు నిలచిన ట్లనుకున్నాడు వసంతుడు!

"మీరు అందాన్ని ఆరాధించేవారు; కాని దానినిగురించి వాదించేవారు కారు" అని మెల్లగా నవ్వింది మనోహరి.

అంతులేని ఆవేశంలో ఉన్న వసంతుడిలా పలికాడు:

"మనోహరీ! నీ స్థితికి జాలిపడుతున్నాను. శిల్పి, కవి—ఇద్దరూ నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నారు. అందువలననే ఈ పోరాటమంతా! ఇది నాకు తెలుసు."

"కావచ్చు. కాని ఆ పోరాటంలో వారు తమ పోరాట లక్ష్యాన్ని మరచిపోతున్నారు. వివాదం ఎక్కువై, వివాదానికి మూలకారణమేదో అది మాయమైంది" అంది. మళ్ళీ ఆ మందహాసమే!

"చంద్రుడి కిరణాలకు శబ్దముంటూ ఉంటే ఇలాగే ఉంటుంది కాబోలు" ననుకున్నాడు వసంతుడు ఆమె చిరునవ్వు విని.

కొంతసేపు ఇద్దరూ ఊరుకున్నారు. తర్వాత అతడడిగాడు: "నీవేమంటావు మనోహరీ? కావ్యమా, శిల్పమా, ఏది గొప్పది?"

"నావరకు, నేను, ఇప్పుడున్న స్థితిలో ఈరెంటి కన్నా గొప్పది మానవహృదయపాశ మంటాను."

"అంటే?"

"అటువంటి హృదయంకోసమే ఇన్ని రోజులుగా వెదకుతున్నాను......కాదు, వెదకుతూంటే దాన్ని" అన్నది మనోహరి.

"నీవు చెబుతున్నది మబ్బుతెరలచాటు చంద్రు నిలాగుంది మనోహరీ!"

"అజయుడూ ప్రభాకరుడూ తమ నేర్పును వెల్లడించడానికి నన్నొక వస్తువుగా తీసుకున్నారు. వారి వైదగ్ధ్యం వెల్లివిరియడానికి నేనొక సాధనం మాత్రమే. నాకోసం తపిస్తున్న, నన్ను కోరుతున్న హృదయం వారిద్దరివద్దా లేదు" అన్నది మనోహరి. ఆమె కండ్లు దూరానవున్న దేనినో చూస్తున్నాయి. ఆమె కండ్లనే చూస్తున్నాడు వసంతుడు.

"మనోహరీ! ఇదంతా నిజమేనా? నిశ్శబ్దంగా కాస్తున్న వెన్నెల, ఒళ్ళు మరిపిస్తున్న ఈ ఉపవనం, నాముందర నిలబడిఉన్న నీవు......మనోహరీ! నా బుద్ధి చెదిరిపోతున్నదే"—వసంతుడి మాటలు తడబడ్డాయి. ఉద్వేగం ఒక్కొక్కసారి మానవుని, కావ

కి

శిల్పంలో కాల అంచులను దాటి తీసుకుపోతుందని అత నికి అప్పుడే అవగతమైంది.

"మనోహరీ! కావ్యాన్నీ శిల్పాన్నీ అనుభ వించి ఆనందించాను. అవి ప్రాణాలొచ్చి మానవ రూపంలో ప్రత్యక్షమైతే ఎలా ఉంటుందో ఇప్పుడు తెలుసుకుంటున్నాను."

తన్మయించిన ఉద్వేగంలో వసంతుడు మనో హరి మృదుహస్తాన్ని గ్రహించాడు. ఎక్కడో కోయిల కూసింది. చెట్టునుండి ఒక పుష్పం రాలింది. మిలమిల మెరిసిపోతూన్న నక్షత్రాల వెలుగులలో వింత వంకరలతో, సంగీతపు ధ్వనులతో సాగిపోతూ న్నది ప్రక్కనున్న సెలయేరు!

5

"మా ఇద్దరినీ ఆశీర్వదింపవలసిన శాశ్వతి మీది" అన్నది మనోహరి. ఆమె ప్రక్కనే ఆమె చేతిని తనచేత గీలించి నిలబడ్డాడు మనోహరీ మనో హరుడు—వసంతుడు.

ఏదో తెలియరాని ఆరాటంతో బాధపడుతున్న కళారాధకులిద్దరూ ఉపవనపు ఎల్లిక్కుల తమ దృక్కు లను ప్రసరించారు.

"మీ నైపుణ్య ప్రదర్శనలో నన్ను మరచిపో గల్గిన వారు మీరు"—మళ్ళీ మనోహరి.

అశ్రువులు నిండిన నయనాలతో ప్రభాకరు డామెను చూచాడు. ఆమె ఇలా అన్నది:

"మీరు నన్ను ప్రేమిస్తున్నారు. నిజమే. కాని అంతకన్నా గాఢంగా మిమ్మల్ని మీరే ప్రేమించు కుంటున్నారు."

"నీకంటె ఎక్కువగా నన్ను నేనే ప్రేమించు కుంటున్నానా?" అని అజయుడు అడిగాడు.

"అవును. నా అందానికన్నా, నా అందాని కొక రూపునివ్వగల మీ హస్తనైపుణ్యాన్ని మీ రెక్కువ ఆరాధిస్తున్నారు. అది సహజమే. కాని కళారాధకుడి ఆ ఆవేశంలో ఒక స్త్రీ హృదయం ఛిన్నాభిన్నమౌతున్నదన్నది గ్రహించడం లేదే!... ఇలా అంటున్నందుకు నన్ను క్షమించండి."

ప్రభాకరుడూ అజయుడూ తల లూపారు. ప్రభాకరుడు పలికాడు.

"నిజమే! నీవు చెబుతున్నదంతా నిజమే! అయినా ఈ నిజం ఎంత చేదుగా ఉన్నదీ?"

ఇంతవరకూ పెదిమలు కదల్పని వసంతు డన్నాడు:

"నెరవేరని ప్రేమ; పూర్తికాని గోపురం; సగం వ్రాసిన కావ్యం; వీటిలో ప్రత్యేకమైన ఆకర్షణ వుంది. రసికుడి హృదయసీమలో కల్పనాశక్తి కనుగుణంగా అవి పరిపూర్ణతను పొందుతాయి."

ప్రభాకరుని పెదవులమీద నవ్వు ప్రకాశించింది. దానిలో సంతోషం లేదు, దుఃఖమూ లేదు; కోపం లేదు; నిరాశ లేదు; మనోహరి మళ్ళీ పలికింది:

"ఏదో మీకు ఉపదేశిస్తున్నాననుకోకండి! నేను వెదకుతున్న వస్తువు దొరికిందన్న ఆనంద పారవశ్యంతో పలుకుతున్నా. అపజయమని మీరు అనుకుంటున్న ఈ మీ అనుభవం మీ కళకు మరింతశక్తి నివ్వగల్గిందిగా ఉపయోగపడుతుందని నా ఆశ! జీవితానుభవంలో నా స్వార్థానికి క్షమాపణ కోరుతున్నాను."

అజయుడూ ప్రభాకరుడూ ఒకేసారి పలికారు. వారి స్వరంలో గంభీరత మూర్తీభవించి వుంది.

"మీ ఇద్దరికీ మా మనఃపూర్వకమైన ఆశీర్వాదాలు. మీ ప్రేమను శిల్పం చిత్రిస్తుంది; కావ్యం వర్ణిస్తుంది. మీ ప్రేమ చిరస్థాయిగా ఉండుగాక!"

పావులూరి గణితము

ప్రకీర్ణగణితము

(జూలై సంచిక తరువాయి)

★

శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య

వ॥ అందుఁ జతుర్థ[1] శేషమూలభాగజాతి కరణ సూత్రం బెట్టిదనిన —

సీ॥ పదమునగ్రంబు వార్థులఁ బరఁగఁ జెంచి
[2]మూలకృతి గూర్చి యది వర్గమూలమైనఁ
బదయుతార్ధవర్గముఁ జేసి భాగరహిత
రూపమునఁ గొని మఱియు నీరూపు సేయు.

ఉదాహరణం —

సీ॥ పసిఁడి పువ్వులు గొని యొకభక్తుఁ డీశుఁ
బూజసేయంగ వచ్చి యా పూవులందు
దశమనవమాష్టమాంశసప్తమషడంశ
పంచమాంశంబు లెడగాఁగఁ బద మొకండు.

గీ॥ ఆది తుది గల్గి యుండొంటి కధికమైన
వానిఁ గ్రమమునఁ బూజించె మానుగాఁగఁ
గోరి పండ్రెండుపువ్వుల గురులపూజ
కన్ని పువ్వులు వీని మా కెఱుఁగఁ జెపుమ.

మూలము ౧ శేషభాగము ౧/౧౦ మూ ౧. శే. భా ౧/౯ మూ ౧ శే. భా. ౧/౮ మూ ౧. శే. భా. ౧/౭ మూ ౧ శే. భా. ౧/౬ మూ ౧ శే. భా. ౧/౫ దృశ్యం ౧౨ లబ్ధసువర్ణ పుష్పాలు ౧౦౦.

ఇందుకు ప్రకరణం —

పదము నగ్రదృశ్యము ౧౨ వార్థుల జెంచిన ౪౮ మూలం ౧ కృతి గొని యుక్తమైన ౪౯ ఇది

---

1. శేషమూలభాగజాతి యని పేర్కొనఁబడిన యీజాతి మూలములోఁ గానరాదు. దీని కొసఁగఁబడిన కరణసూత్రమును బట్టి చూడఁగా నిది యిందలి మూఁడవ యధ్యాయమునఁ బేర్కొనఁబడిన 'శేషమూలజాతి'యే యనియుఁ గరణసూత్రము మాత్రము ఫలితార్థము సమ మయ్యు నొకింత భిన్నముగా నున్న దనియుఁ దెలియ వచ్చుచున్నది. కనుక దీనిని ప్రత్యేకజాతి గాఁ గాక 'శేషమూలజాతి' గానే గ్రహించుట యుక్తము.

సూత్రవివరణము

పదము నగ్రదృశ్యమును నాలుగుచే గుణించి మూలమును కృతి చేసి దానితోఁ గూడవలయును. పిదప నా వచ్చిన మొత్తముయొక్క వర్గమూలమును గనుగొని మూలమును గూడి యర్ధించి వర్గింపవలయును. అటుపిదప నొకటినుండి భాగమును బుచ్చి యా వచ్చిన మొత్తములోఁ బూర్వపు మొత్తమును భాగించిన యెడల ఫలము వచ్చును.

బీజగణితప్రకార మీ సూత్ర మీ క్రింది తీరున నుండును.

$$x = \left\{\frac{\sqrt{4a + c^2} + c}{2}\right\}^2 \div 1 - b$$

శేషమూలజాతిసూత్ర మిట్లుండును.

$$x - bx = \left\{\frac{c}{2} + \sqrt{\left(\frac{c}{2}\right)^2 + a}\right\}^2$$

శేషమూలజాతి $x - bx$ యొక్క విలువను గనుగొనుటకుఁ దోడుపడుచుండఁగా నీ శేషమూలభాగజాతి x యొక్క విలువను గనుగొనుటకుఁ దోడ్పడుచున్నది.

2. మూలకృతియుక్తమై వర్గమూల మిదియు— పాఠాంతరము.

మూలము గొనగాను ౬ మూలం ౧ యుతేము ౮ అర్ధము ౪ ఇది వర్గవు గొనగాను ౧౬ భాగరహితరూపము పీన భాలుగొనిన అనంతరం ౨౦ ఈ ప్రకారాన వచ్చిన లబ్ధము ౧౦౦.

గీ॥ మహిషయూథంబు వనమున మందయుండి
మేయ సాలవపా లందుఁ బోదె నున్న
వానిలో మూలములు రెండు వానిపిఱుఁదఁ
జనిరె శేషత్రిభాగంబు సనియె మఱియు.

గీ॥ శేషమూలద్వయము మహిషీగణంబుఁ
గలసి క్రీడించె శేషార్ధములసి కొలనఁ
దేలఁబడియుండె మందలో సాలుగుండె
నెన్ని మహిషంబు లివి చూచి నెఱుఁగఁజెప్పుమ.

భాగాలు ౧/౪ శేషమూలము ౨ శేషభాగము ౧/౩ శేషమూలము ౨ శేషభాగము ౧/౨ దృశ్యం ౪ లబ్ధ మహిషములు ౪౮.

గీ॥ వసునవాగ్ని శరాంబుధి రసము లేదు
భాగములు గాఁగ నంబుధి సాగరద్ర
సయనశశి నేత్రములు మూలచయము వరుస
[1]మిగిలి పొందుండె నీయలిబృంద మెంత?

శే. భా. ౧/౮ శే. మూ. ౪ శే. భా. ౧/౯ మూ. ౮ శే. భా. ౧/౩ మూ ౧౧ శే. భా. ౧/౫ మూ. ౨ శే. భా. ౧/౪ మూ. ౧ శే. భా. ౧/౬ మూ. ౨ దృశ్యం ౧౫ లబ్ధ రూపము ౮౭౬.

---

1. దృశ్యసంఖ్య యిందీయఁబడలేదు. క్రింది యంకెలలో దృశ్యము ౧౫ అని కలదు. అందుచే 'మిగిలి పొందుండెఁ బదియేను విూఁజే యెంత?' అని యుండఁదగును. అపుడు కర్త యుండెరు. 'మిగిలి పొందుండె నీయలిబృంద మెంత' అనుచో యతి గమనార్హము.

2. ఈ జాతి మూలమున లేదు. కరణసూత్రమున 'అభినవ మను శేషభాగజాతి' యని పేర్కొనఁ బడి యుండుటచే మూలమునందు లేని యీ క్రొత్తజాతి మల్లనోపజ్ఞ మని తెలియుచున్నది. ఇది గుణించు విధము తరువాతి పద్యవివరణమునఁ జెప్పఁబడి యున్నది.

3. ఈ పాదమున యతిభంగము.

4. వ్రాఁతప్రతు లన్నిటియందును 'ద్రాక్షారామ భీమేశు లోకనాథు'నని యున్నది. అట్లున్నచో ఛందోభంగము. ద్రాక్షారామమునకు 'దాకరేమి' యని పేరుండుట యనేక శాసనములలోఁ గానవచ్చుచున్నది. దాకరేమి యని సవరించినచో సరిపోవును. ఈ సవరణను శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చేసిరి.

ఇది ప్రకీర్ణగణితంబునందు శేషభాగమూలజాతి సమాప్తము.

వ॥ అందు బంచమ [2]శేషభాగజాతియందుఁ గరణసూత్రం బెట్టిదనిన—

గీ॥ ఛేదహతి నంశవర్జితచ్ఛేదమితముఁ
బొలుగొని దాన దృశ్యంబుఁ బొలుగొన్నఁ
బరఁగు నభినవ మను శేషభాగజాతి
గణితఫల మది వచ్చు జగన్నుతముగ.

చ॥ జలికి షడంశముం బ్రియుడు
శేషములోపలఁ బంచమాంశముం
బొలుపుగ దాని శేషమున
బోదకు నాలవపాలు నిచ్చి యం
దులఁ దనపాలుఁ దాఁ గొనిరొఁ
దొమ్మిది జేనలు రాజహంస విూ
నలినమృణాల మెంత సుజనస్తుత!
మా కెఱుఁగంగఁ జెప్పవే.

భాగం ౧/౬ శేషభాగం ౧/౫ శేషభాగం ౧/౪ దృశ్యం ౯ లబ్ధం ౧౮

ఇది కూడే లాగు—

దృశ్యం ౯ ఛేదము ౪ హతి ౩౬ అంశవర్జితం [3] దీనఁబొలుగొన ౧౨ ఛేదహతి ౬౦ అంశవర్జితచ్ఛేదము ౪ కొన్న ౧౫ ఛేదహతి ౯౦ అంశవర్జితచ్ఛేదము ౫ కొన్న లబ్ధమృణాలము ౧౮.

గీ॥ అడవిలో సప్తమాంశక మాది గాఁగ
నర్ధపర్యంతముగ నొక్క హరిణగణము
[3]లోన వానికి శేషమై పాఱెఁ గలయ
దృశ్య మాఱయ్యె నవి యెన్ని తెలియఁజెప్పుమ.

భాగం ౧/౭ శే. భా ౧/౬ శే. భా ౧/౫ శే. భా ౧/౪ శే. భా ౧/౩ శే. భా ౧/౨ దృశ్యము ౬ లబ్ధహరిణములు ౪౨.

గీ॥ జలజములు నవమాష్టమసప్తమాంశ
షష్ఠభాగము లయిన శేషములు గాఁగ
శివుని నాల్గవ క్రియల వర్పించి పంచ
మాస్య మినన్నాటపదిఁ బూజ యయ్యె నెన్ని?
భాగం ౧/౯ శేష ౧/౮ శేష ౧/౭ శేష ౧/౬ దృశ్యము ౨౧౦. లబ్ధజలజములు ౩౭౮.

గీ॥ అష్టమాంశంబు మొదలుగా నర్ధభాగ
మంత్యముగఁ గ్రమంబున శేష మగుచు నున్న
సప్తగోదావరీ సరోజములఁ దెచ్చి
[4]దాకరేమి భీమేశుఁ ద్రిలోకనాథు

సీ॥ సప్తమును లతిభక్తి నర్చనలు సేసి
రున్న శేషంబు (పూన్చెఁ) బయోధిగగన
బాణసంఖ్య యరుంధతి భక్తితోడఁ
బూజ సేసినతామరపువ్వు లెన్ని?

భాగ ౧/౮ శేష ౧/౭, ౧/౬, ౧/౫, ౧/౪, ౧/౩, ౧/౨ దృశ్యము ౫౦౪ లబ్ధకమలములు ౪౦౩౨.

సీ॥ వసుధ శ్రీశైలశిఖరనివాసుఁ డైన
మల్లికార్జున దేవు సుమానఘూటిఁ
బరఁగ శివరాత్రివాఁ డొక్క భక్తుఁ డష్ట
యామములు హేమపుష్పంబు లర్థిఁ దెచ్చి

గీ॥ నవను మొదిగ నర్ధమానంబుదాఁక
శేష మగుచున్న దాని వి శేషపూజ
సేసి పరివారగణము నర్చించె నయున
గుణనభోగతిసంఖ్య యీ గణన యెంత?

భాగం ౧/౯ శేష ౧/౮, ౧/౭, ౧/౬, ౧/౫, ౧/౪, ౧/౩, ౧/౨ దృశ్యము ౪౦౩౨ లబ్ధం హేమపుష్పాలు ౩౬౨౮౮.

ఇది ప్రకీర్ణగణితంబునందుఁ బందను శేషభాగజాతి సమాప్తము.

వ. అందు పష్ఠద్వాగ్రశేషమూలజాతి కరణ సూత్రం బెట్టి దనిన—

సీ॥ [1]పదదళాగ్రముఁ బ్రత్యేకభాగవిరహి
తైకములఁ గొని పూర్వాగ్ర స్వాగ్రరాశిఁ
గూడి (మఱి) మూలకృతియును గూడి మూల
మైన పదయుతివర్గంబు లనఘ యదృశ్య.

[2]సీ॥ భ్రమర మొకఁ డంబరంబునఁ బఱచె శేష
పంచమాంశంబు విహరించెఁ బాటలముల
శేషపాదంబు గ్రోవులఁ జేరి యుండెఁ
బనియొ శేషత్రిభాగంబు జలజములకు

గీ॥ మూల మొక్కటితోఁ గూడి లీల నుండె
రెండు నవమల్లికామంజరీదయమున
మొనసి యుభయాగ్రపరి శేషమూలజాతి
[4]నెఱుఁగు దేనియుఁ దుమ్మెద లెన్ని చెపుమ.

దృశ్యం ౧, శేషభాగం ౧/౫, శేషభాగం ౧/౪, శేషభాగం ౧/౩ మూలం ౧ దృశ్యం ౨ లబ్ధం భ్రమరాలు ౧౬.

---

1 మూలమున నీ సూత్ర మిట్లున్నది.
మూలం దృశ్యం చ భజే
దంశక పరిహీణరూపఘాతేన
పూర్వాగ్ర స్వాగ్రాభ్యాం
క్షిప్తే దత్త శ్శేషమూలవిధిః
సూత్రవివరణము—
రూపమునుండి ప్రత్యేకము ప్రత్యేకముగా భాగములను దుచ్చి వానిని గుణింపఁగా వచ్చిన మొత్తముతో మూలమును, దృశ్యమును (రెండవ యగ్రమును) ప్రత్యేక ప్రత్యేకముగాఁ భాగింపవలయును. పిదపఁ బూర్వాగ్రమును స్వాగ్రాశితోఁ గూడవలయును. ఆ పిదప శేషమూల విధి చేసిన ఫలము వచ్చును.

బీజగణిత ప్రకార మీ సూత్ర మీ క్రిందితీరున నుండును.

$$\frac{c}{(1-b_1)\ (1-b_2)\times etc} \text{ మఱియు } \frac{a_2}{(1-b_1)\ (1-b_2)\times etc} + a_1$$

శేషమూలవిధి సూత్రమున మూలము (c) నకును, దృశ్యము (a) కును బదులుగా నీ రెండు మొత్తముల నుంచుకొని లెక్కించినచో ఫలము వచ్చును.

మూలసూత్రవిషయ మిట్లుండఁగా మల్లన సూత్రము మూలసూత్రమునకు వివరణప్రాయముగా నున్నది. శేషమూలవిధి చేసినతరువాతఁ గలుగురూప మీ మల్లన సూత్రమువలన సిద్ధించుచున్నది.

బీజగణిత ప్రకారము మల్లనసూత్ర మీ క్రింది తీరున నుండును.

$$x = \left\{ \frac{c}{2\,(1-b_1)\ (1-b_2)\times etc} + \sqrt{\left(\frac{c}{2\,(1-b_1)\ (1-b_2)\times etc}\right)^2 + \frac{a_2}{2\,(1-b_1)\ (1-b_2)\times etc} + a_1} \right\}^2$$

2 'మధుకర ఏకో దృష్టః' అను శ్లోకమున కీ రెండు పద్యములును ననువాదములు. మనోహర మయిన యనువాదము.

3. దేరె మఱియు

4. ఎఱుఁగు దేనియుఁ దల్సంఖ్య నెఱుఁగఁ జెపుమ (పా) ఎఱుఁగ నీ తుమ్మెదలు మొత్త మెన్ని చెపుమ. (పా)

గీ॥ [1]కృష్ణసార మొకఁడు క్రీడించె హరిణితో
శేష సప్తకంబు చెదర నందు
షష్ఠ పంచమాంశ చరణ శేషాంశముల్
వరుసఁ జేరె మఱియు వానిపిఱుఁద.

గీ॥ మదముతోడఁ గదలె మూలద్వయంబుతోఁ
గూడి మూఁడు నందుఁ గూడి చనిరొ
గణిత మెఱుఁగుదేని గణుతించి యాకృష్ణ
సారసముదయంబు సంఖ్యఁ జెపుమ

దృశ్యం ౧ శేషభాగం ౧/౭ శేషభాగం ౧/౬ శేష భాగం ౧/౫ శేషభాగం ౧/౪ మూలం ౨ దృశ్యం ౩ లబ్ధ కృష్ణసారములు ౩౬.

గీ॥ గంధుఁగోయిల లామనిఁ బిండుగట్టి
ప్రోలఁ దొమ్మిది మామిఁడిప్రోక లెక్క
శేష మష్టాంశ మాదిగాఁ జేరు వరుస
నర్ధపర్యంతముగ శేష మనుచుఁ గలయఁ

గీ॥ జాతపల్లవరస మాని ప్రీతి మూఁడు
మూలములతోడ నిట రెండు లీలఁ గూడి
వనముఁ జొచ్చిన నాపికవర్గ మెంత
చెప్పఁ మధయాగ్రభూరివి శేష ఫలము.

దృశ్యం ౯ శేషభాగం ౧/౮, ౧/౭, ౧/౬, ౧/౫, ౧/౪, ౧/౩, ౧/౨ మూలం ౩ దృశ్యం ౨ లబ్ధపికంబులు ౬౨౫.

గీ॥ నలినవనికరము కరిగెను నలులు నాలు
శేషపంచాంశ ముత్పలసమితి (శ్రేణి?) కరిగె
శేషపాద మామ్లములను జేరె (నందుఁ)
బరఁగఁ దచ్ఛేషభాగత్రిభాగ మరిగె.

గీ॥ [3]వకుళములకు మున్న వానిలో నర్ధంబు
సన్న పిదప మూలసంఖ్య రెంటి
తోడఁ గూడ నింగి నాడెడుతుమ్మెద
లేడు దీనిసంఖ్య యెంత చెపుమ.

దృశ్యం ౮ శేషభాగం ౧/౫, ౧/౪, ౧/౩, ౧/౨ మూలం ౨ దృశ్యం ౭ లబ్ధభ్రమరములు ౧౬౯.

ఇది ప్రకీర్ణగణితంబునందు షష్ఠద్విరగ్ర శేష మూలజాతి సమాప్తము.

వ॥ అందు షష్టి[2]మాంశమూలజాతి కరణ సూత్రం బెట్టి దనిన—

గీ. [4]అంశహృత దైనదృశ్యంబు నద్ధిఁ బెంచి
మూలకృతిఁ గూడి మఱి వర్గమూల మైన

దృశ్యా దంశకభక్తా చ్చతుర్గుణా
న్మూలకృతియుతా న్మూలమ్
సపదం దళితం వర్గిత
మంశాభ్యస్తం భవే త్సారమ్.

మల్లనపద్య మిందలి రెండవ సూత్రమున కను వాదము.

సూత్రవివరణము:

దృశ్యము నంశముచేఁ బాలుగొని నాలుగింట గుణించి యా మొత్తముతో మూలమును గృతిజేసి కూడి వర్గమూలము కనుగొనవలయును. పిదప నా వచ్చిన మొత్తముతో మూలమునుగూడి యర్ధించి దానిని వర్గింపవలెను. అపుడు దానిని భాగముతో గుణించిన యెడల నంశమూలఫలము వచ్చును.

బీజగణితప్రకార మాసూత్ర మిా క్రింది తీరున నుండును.

$$x = \left\{\frac{c + \sqrt{c^2 + 4a - b}}{2}\right\}^2 + b$$

పయిసమీకరణము నీ క్రింది సూత్రము నుపయోగించి సులభముగా బడయనగును.

$$x - c\sqrt{bx - a} = 0$$

1. ఈ పద్యము మొదలుకొని యీ యధ్యాయమునందలి యుద్దేశకము లన్నియు మల్లనవే. మనోహర మయినకవిత.

2. ఉన్నవానిలోన సోన్నల కర్ధంబు (పాఠాంతరము)

3. ఈజాతి యంశమూలజాతి, లవమూలజాతి, భాగమూలజాతి యని వ్యవహరింపఁబడుచున్నది.

4. ఈ పద్యము మొదలుకొని 'క్రొవ్వి చెలరేఁగి' యనుపద్యముదాఁకఁ గలభాగము ఎలుగంటి పెద్దన రచించిన 'భిన్నప్రకీర్ణాది గణితములు' అను గ్రంథమునఁ గూడఁ గలదు. మల్లన గణితభాగమునే యాతఁడు తన గ్రంథమునఁ బరిగ్రహించి యుండును. చూడుఁడు. మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని గ్రంథము.

అంశమూలజాతి కరణసూత్రములు మూలమున రెండు గలవు. అవి యివి.

అథాంశ మూలజాతౌ సూత్రమ్.
భాగగుణో మూలాగ్రే
న్యస్య పదప్రాప్త దృశ్యకరణేన
యల్లబ్ధం భాగహృతం
ధనం భజే దంశమూలవిధౌ.
అన్య దపి సూత్రమ్.

మూలయుక్తార్థకృతులను నోలిఁ జేసి
భాగహతమైన లబ్ధమూలఫలము వచ్చు.

క. అష్టమభాగము మూలం
బష్టాదశసంఖ్య గిరికి నరిగిన శేషం
బష్టాదశకరులఁ దవుల
నిష్టవినోదముల నుండె నివి యెన్ని యగున్.

భాగం ౧/౮ మూలం ౧౮ దృశ్యం ౧౮ లబ్ధం గజాలు ౭౨.

కరణము – అంశ ౧/౮ దృశ్యం ౧౮ పాలుగొనిన ౧౪౪ దీని నల్గిఁ జెంచిన ౫౭౬ మూలం ౧౮ కృతి ౩౨౪ దీనిగూడిన ౯౦౦ మూలం ౩౦ మూలం ౧౮ కూడిన ౪౮ దళ ౨౪ కృతి ౫౭౬ భాగ ౧/౮ వచ్చిన లబ్ధం ౭౨.

*గీ. వనరఁ దోలకరియందు మయూరబృంద
మాత్మవాదంబు విని పొంగి యష్టమాంశ
మూలములు నాలుగెనిమిదు లోలి నాడెఁ
బర్వతాగ్రంబునందుండి బహువిధముల.
* ఇది యమూలకము.

గీ॥ నున్న వానిలోఁ (?) బంచాంశయుగళమూల
మష్టసంఖ్య కేకారవ మతిముదమునఁ
జేసె నెనిమిది పాలిలోఁ జేరియుండె
నెన్ని యగును మయూరంబు లెఱుఁగఁ జెపుమ.

భాగం ౧/౮ మూలం ౩౨ శేషభాగము ౨/౫ మూలం ౧/౮ దృశ్యం ౮ లబ్ధమయూరాలు ౨౦౦.

*గీ॥ పంచభాగాష్టమాంశంబు పదిశతంబు
ధీద్రుమ స్తకంబందునఁ బఱచె శేష
పోలిఁ బంచాదశాంశముల్ నాలుగింట
మూలములు పది పల్వలములఁ జరించె.

గీ॥ క్రోవిద్వ చెలరేఁగి పుట్టలు గ్రొచ్చి పర్వ
తములయం దోలి నాడెను దర్ప మెసఁగ

వనవరాహము లిరువది వనములోన
నుండె నీవరాహంబులపిండు చెపుమ.

భాగం ౨/౫, ౧/౫ మూలం ౧౦౦ శేషభాగం ౨/౫ యుతః ౪ మూలం ౧౦ దృశ్యం ౨౦ లబ్ధక్రోడములు ౭౬౦.

‡గీ॥ భ్రమరగణములో షడ్భాగపంచపదము
లామ్లములు నుండె శేషపంచాంశకమునఁ
బంచమూలంబు లుండె నుత్పలములందు
శేషపాదమూలములను జేర వందు.

గీ॥ దాని శేషత్రిభాగపదంబు లర్క
సంఖ్య నుండె నశోకవృక్షములయందు
నున్న శేషము పదియేను పొన్నలందు
నిలిచె నీయలిబృందంబుకోలఁది యెంత?

భాగం ౧/౨ ౧/౫ శేషభాగము ౧/౫ శేషమూలము ౫ శేషభాగము ౧/౭ మూలం ౧౨ దృశ్యం ౧౫ లబ్ధభ్రమరములు ౧౫౦.

*గీ॥ కరుల షష్ఠాంశ (షడష్ట?) మూలాష్టకంబు శేష
పాదభాగ త్రయోదశ పదములందుఁ
గూడి యవగాహనము చేసె కోలఁకులందుఁ
గదియఁ బండ్రెండు నిలిచె వగ్గజము లెన్ని?

భాగం ౧/౨ మూలం ౮ శేషభాగం ౧/౭ మూలం ౧౩ దృశ్యం ౧౨ లబ్ధగజాలు ౯౬.

ఇది ప్రకీర్ణగణితంబునందు షష్ఠమభాగమూలజాతి సమాప్తము.

అందష్టమ † భాగసంవర్గజాతి కరణసూత్రం బెట్టి దనిన—

*గీ॥ స్వాంశచయసంహృతచ్ఛేదసంచయంబు
త్రిప్రపరులఁ జేసి గతిగుణదృశ్య మొకటఁ
బుచ్చి తక్కటి ప్రతిఁ జెంచి వచ్చుమూల
మున్న ప్రతిఁ గూడి యర్ధింపు సమ్మతముగ.

---

1. ఇది యమూలకము.

* ఇది యమూలకము.

‡ ఇది యమూలకము.

* ఇది యమూలకము.

† దీనికే భాగాభ్యాసజాతి యనియు మఱియొక పేరు.

* మూలమున నీ జాతి కరణసూత్రము లిట్లు కలవు.

స్వాంశాప్తహరాదూనాత్
చతుర్గుణాగ్రేణ తద్ధరేణ హతాత్
మూలం యోజ్యం త్యాజ్యం
తచ్ఛేదే తద్దలం విత్తమ్
అన్యచ్చ
చతుర్హతదృష్టేనోనా
ద్భాగాహత్యంశహృతహారాత్
తచ్ఛేదేన హతాన్మూలం
యోజ్యం త్యాజ్యం తచ్ఛేదే తదర్ధం విత్తమ్
ఇందలి తొలి శ్లోకమునకుఁ బయి పద్య మను

ఉదాహరణము—

1క॥ వనమున నాలవపాలును
నెనిమిది యగుపాలఁ బెంప నేర్పడుగజముల్
పనిన మఱి యాలు నదికిం
జనిరెు జలం బాడ నీ గజము లెన్ని యగున్.

౧/౮ ౧/౪ దృశ్యం ౬ లబ్ధగజములు ౨౪.

కరణం— ౧/౮ ౧/౪ పెంపగా ౧/౩౨ అంశ పాలుగొన్న ౩౨ త్రిప్రశ్నలు చేసిన ౩౨, ౩౨, ౩౨ దృశ్యం ౬ నాలుగింట పెంపగా ౨౪ ఒకట బుచ్చిన ా లెక్కటి ప్రతిబెంచిన ౨౫౬ మూలం ౧౬ ఉన్న ప్రతిని గూడి ౪౦ అర్ధించిన లబ్ధం ౨౪.

క॥ షోడశభాగంబును దశ
తాడిత మబ్దములయందుఁ దచ్ఛేషములో
షోడశభాగము నిజగుణ
మాడఁ జతుర్గుణము మిగిలె నది యెంతయగున్.

౧/౧౬ ౧/౩౨ శేషభాగాలు ౧/౧౬ దృశ్యం ౬౪ లబ్ధభ్రమరములు ౨౫౬.

గీ॥ అద్రితలమునఁ బాదలదర్ధహీన
f..........త్ర్యంశయుతిస్వదళిత
భాగరహితతత్స్వదత్పంచమాంశ
యోగగుణ మైనషోడశభాగ ముండె.

3గీ॥ నలినషండంబులో శేషనవమభాగ
గుణితనవమాంశకంబుతోఁ గూడియుండి
లీల నవగాహనము చేసె నోలి వాని
కంటెఁ బదునాలు గుండె నీ గజము లెన్ని?

౧/౯ ౧/౯ ౧/౯ దృశ్యం ౧౪ లబ్ధగజములు ౧౪౪

4క॥ పంచాంశత్ర్యంశంబునఁ
బెంచిన తత్పాదగకులు భీమాటవిలో
నంచి తదైనవతుష్కం
బింపుతటాకంబు కరిగె నివి యెన్ని యగున్॥

౧/౫ ౧/౩ శేషభాగం ౧/౪ ౧/౪ దృశ్యం ౪ లబ్ధగజాలు ౧౦౦.

ఇది ప్రకీర్ణగణితంబునం దష్టమభాగసంవర్గజాతి సమాప్తము.

అందు నవమ శేహీనజాతి కరణసూత్రం బెట్టి దనిన—

గీ॥ 5అర్ధహార మంశభక్తంబు నసుపదకృతి
హీనకృతియును గూడి దృశ్యోనమైన
వర్గమూలంబుఁ గొని పూర్వవర్గమూల
హీనములు గూడి మఱి యంశహృతము సేయు.

వాదము. మూలమునకు సరియయిన, సుందరమయిన యనువాదము.

సూత్రవివరణము—

ఛేదసంచయముచే భాగింపఁబడిన స్వాంశచయమును మూఁడు ప్రతులుగాఁ జేసి యుంచుకొనవలయును. దృశ్యమును నాలుగుతో గుణించి యా ప్రతులలో నొకదానినుండి తీసివేయవలయును. ఆ పిదప నా మొత్తమును రెండవ ప్రతితోఁ బెంచి దాని మూలము గనుగొనవలయును. అట్లు చేయఁగా వచ్చిన మొత్తముతో మూఁడవప్రతిని గూడి యర్ధించినయెడల ఫలము వచ్చును.

మూలమున 'యోజ్యం త్యాజ్యం' అని యుండఁగా నాంధ్రీకరణమునఁ గూడవలయు నని మాత్రము చెప్పఁబడి యున్నది.

బీజగణిత ప్రకార మీ సూత్ర మీ క్రిందిరీతిన నుండును.

$$x = \frac{\frac{nq}{mp} + \sqrt{\left(\frac{nq}{mp} - 4a\right)\frac{nq}{mp}}}{2}$$

ఈ సూత్రఫలితము నే యీ క్రింది సమీకరణము వలన సులభముగాఁ బడియఁదగును.

$$x = \frac{m}{n}x \times \frac{p}{q}x - a = 0$$

f సంచయాంశహృతచ్ఛేదసంచయంబు — పాఠాంతరము.

1. ఇది యమూలకము.

2. ఇదియమూలకము.

3. లెక్కనుబట్టి చూడఁగా నీ పద్యమును, దీని పయిపద్యమును 'శిఖినాం షోడశభాగః' అను శ్లోకమున కాంధ్రీకరణ మయినట్లు తోఁచుచున్నది. మూలమున శిఖివిషయము చెప్పఁబడఁగా నిందు గజవిషయము చెప్పఁబడినది. తొలిపద్య మస్పష్టముగా నున్నది.

4. ఇది యమూలకము.

5. మూలమున నిది యంశవర్గజాతి యని పేర్కొనఁబడినది. అధ్యాయాంతగద్యయం దిందు 'అంశవర్గహీనజాతి' యని కలదు.

6. మూలమున నీకరణసూత్ర మిట్లు కలదు.
అథోనాధికాంశవర్గజాతౌ సూత్రమ్.

1గీ॥ పంచమాంశంబులోపలఁ బరఁగఁ నాలు
ద్రుచ్చ శేషంబు నిజవర్గ మిచ్చ నరిగె
నాలు విజనస్థలంబుల నాడుచుండె
నెన్ని యగు నీగజములు మా కెఱుఁగఁ జెపుమ.
భాగం ౧/౫ హీన ౬ దృశ్యం ౬ లబ్ధగజములు ౧౫.

2గీ॥ అలులు షోడశభాగత్రయంబులోనఁ
జనియె షోడశరహిత ష్వనగుణంబు (?)
కుముదషండంబునకుఁ జతుర్గుణము చనియెఁ
గుముదవనమున కీయలికుల మదెంత?
భాగం ౩/౧౬ హీనము ౧౬ దృశ్యం ౬౪ లబ్ధ భ్రమరములు ౧౨౮.

3గీ॥ ద్వాదశాంశపంచకములోఁ దిగఁగ నేను
బుచ్చియున్న శేషముకృతి భూధరముల
కరిగెఁ బదియేను మార్గజలాశయముల
నుండి క్రీడించె నీ గజయూథ మెంత?
భాగం ౫/౧౨ హీనము ౩ దృశ్యం ౧౫ లబ్ధగజాలు ౨౪.

ఇది ప్రకీర్ణగణితంబునందు నవ (మాంశవర్గ) హీనజాతి సమాప్తము.

అందు దశమభిన్నదృశ్యజాతి కరణసూత్రం బెట్టి దనిన—

క॥ *ఏకములో దృశ్యాంశముఁ
ద్రోకటముగఁ బుచ్చి గుణితభాగముఁ గొనఁగాఁ
జేకుఱుఁగ భిన్నదృశ్యఫ
లాకరములు వచ్చు నతిశయంబుగ ధరణిన్.

ఉదాహరణము—

4గీ॥ తెగిలి నవమాంశతద్గుణద్వాదశాంశ
ముండె హంసలు నీరిలోఁ బిండుగట్టె

స్వాంశకభక్తహారార్ధం న్యూన
యుగధికోనితం చ తద్వర్గాత్
న్యూనాధికవర్గాగ్రా న్మూలం
స్వర్ణం ఫలం పదేఽంశహృతమ్.

ఆంధ్రీకరణమున — న్యూనయుగధికోనితం— అనుటకుఁ దెలిఁగింపు కావరాదు. తెలిఁగింపు అస్పష్టము గాను, సందిగ్ధము గాను నున్నది.

సూత్రవివరణము :

స్వాంశములచే భాగింపఁబడిన హారము నర్ధించి (హీనమును గూడి) కృతి సేయవలయును. పిదప హీన కృతి నందుఁ గూడి దృశ్యమునందుండి ద్రుచ్చి వర్గ మూలము గొనవలయును. తరువాత నా మొత్తములోఁ బూర్వవర్గమూలహీనములను గూడి యంశముచే భాగించిన ఫలము వచ్చును. బీజగణితప్రకార మీసూత్ర మీ క్రిందితీరున నుండును.

$$x = \left\{ \pm \sqrt{\left(\frac{n}{2m} \pm d \right)^2 - d2 - a} + \left(\frac{n}{2m} \pm d \right) \right\} \div \frac{m}{n}$$

ఇది యీ క్రిందిసమీకరణమువలన సులభముగాఁ బడయఁదగును.

$$x - \left(\frac{m}{n} x \mp b \right)^2 - a = 0$$

ఇందు d హీన మని తెలియఁదగును.

1. ఈజాతియందలి యుద్దేశకములన్నియు నమూలకములే.

2. మూలమున నీ జాతికరణసూత్ర మిట్లు కలదు,

అథ భిన్నదృశ్యజాతౌ సూత్రమ్.
దృశ్యాంశోనే రూపే
భాగాభ్యాసేన భాజితే తత్ర
యల్లబ్ధం తత్సార
ప్రజాయతే భిన్నదృశ్యవిధౌ.

సూత్రవివరణము—

ఒకటినుండి దృశ్యాంశమును ద్రుచ్చి యీ వచ్చిన మొత్తమును గుణితభాగముచే భాగింపవలయును. ఇట్లు చేసిన భిన్నదృశ్యఫలము వచ్చును.

బీజగణితప్రకార మీ సూత్ర మీ క్రింది తీరున నుండును.

$$x = \left(1 - \frac{r}{s} \right) \div \frac{mp}{nq}$$

దీనినే యీ క్రింది సమీకరణమువలన సులభముగాఁ బడయఁదగును.

$$x - \frac{m}{n} x \times \frac{p}{q} x - \frac{r}{s} x = 0$$

ఇందు $\frac{r}{s}$ దృశ్యాంశము. $\frac{m}{n}$, $\frac{p}{q}$ భాగములు.

3. ఈయధ్యాయమునందలి సూత్రోదాహరణము లన్నియు మల్లనవే. మూలమునందలి లెక్కలకిం దను వాదములు కానరావు.

దృశ్య మరొక్కఁ ద్రిభాగంబు లేటపడఁగ
నెన్ని హంసంబు లవి మాకు దెలుఁగఁ జెపుమ.

౧/౨, ౧౧/౧౧ దృశ్యభాగము ౧/౩ లబ్ధహంసలు ౬౨.
ఇందుకు ప్రకరణం కూడేలాగు.

దృశ్యం ౧/౩ ౧ లో పుచ్చినది ౨/౩, భాగాలు పెంచిన ౧/౨, ౧౧/౧౩ − ౧౧/౧౬ పీన దృశ్యం పాలుగోన ౨/౩ × ౩౬/౧౧ ౬౨ లబ్ధహంసలు.

గీ॥ స్తంభ మొక్కటి నీరిలో సప్తమాంశ
గుణితదశనాంశకం బుండెఁ గొమరు గాఁగ
సంబరంబున దృశ్యాంశ మర్థ మరొక్క
నెన్ని హస్తంబు లవి మాకు దెలుఁగఁ జెపుమ.

౧/౨, ౧౧/౧౦ దృశ్యభాగము ౧/౩ లబ్ధహస్తాలు ౩౫.

క॥ పాదాంశగుణిత మైన
ద్వ్యదశభాగంబు శైలతలమున కరిగెఁ
బాదత్రయంబు దృశ్యము
పాదరమునఁ జెప్పు గజము సంఖ్యయు మాకున్.

౧/౪, ౧౧/౧౩ దృశ్యభాగము ౩/౪ లబ్ధగజాలు ౧౨.

ఇది ప్రకీర్ణగణితంబునందు దశమభిన్న దృశ్యజాతి సమాప్తము.*

---

* మూలమునఁ ప్రకీర్ణగణితమునందలి యొనిమిదవ యధ్యాయమునఁ జేర్కొనఁబడిన మూలమిశ్రజాతి పావులూరి గణితమున లేదు. మల్లన యీజాతి నేల యనువదింపక విడిచెనో తెలియరాదు.

మూలమున — మూలమిశ్రజాతి కరణసూత్ర మిట్లు కలదు.

మిశ్రకృతి రూపయుక్తా
వ్యాధికా ద ద్విగుణమిశ్రసంభక్తా
వర్గీకృతా ఫలం స్యా
త్కరణ మిదం మూలమిశ్రవిధౌ.


బీజగణితప్రకారము పయిసూత్ర మీ క్రింది తీరున నుండును.

$$x = \left\{ \frac{m^2 \mp d}{2\,m} \right\}^2$$ ఇందు m మిశ్రము.

దీనిచే యీ క్రింది సమీకరణమువలన సులభముగాఁ బసియఁదగును.

$$\sqrt{x} + \sqrt{x \pm d} = m.$$




ప్రతిదినము మీరు మలినములోని క్రిములనుండి అంటురోగమును పొందే ప్రమాద మున్నది
లైఫ్‌బాయ్ సబ్బుతో మలినములోని క్రిములను కడిగివేయండి
ఈ ప్రమాదము నుండి మిమ్ములను మీరు కాపాడుకొనవలెను
దాని "రక్షక నురుగు" మీ ఆరోగ్యమును కాపాడును.
లైఫ్‌బాయ్ సబ్బు
ప్రతిదిన మలినములోని క్రిముల నుండి మిమ్ములను రక్షించును
LIFEBUOY SOAP
LIFEBUOY SOAP